www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 28-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 283 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 7.36 తదుపరి అమావాస్య; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 8.45 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: సా. 4.45-6.18; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.51, రా. 10.16-11.05; అమృతఘడియలు: రా. 2.06-3.39; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.04 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బ్రహ్మపుత్రపై భారత్ భారీ రిజర్వాయర్

- 325 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం
- దానిపైన అతిపెద్ద జల విద్యుత్తు కేంద్రం
- అరుణాచల్‌లో చైనా సరిహద్దుల్లో నిర్మాణం
- డ్రాగన్ 'వాటర్ బాంబ్' రిజర్వాయర్‌కు చెక్
- చైనా గేట్లు ఎత్తినా కాచుకోవడమే లక్ష్యం



2

మళ్లీ కైలాశ్, మానస సరోవర్ యాత్రలు

విమానాల పునరుద్ధరణ.. భారత్, చైనా అంగీకారం

ప్రభుత్వం వద్ద డబ్బులున్నా ఇవ్వడం లేదని, హామీలు అమలు చేయడం లేదని కొందరు అనుకుంటున్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో, ఎంత లోతులో కూరుకుపోయి ఉన్నామో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. వివరంగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాం.

ఐదు రూపాయలిచ్చి ప్రజలను శాశ్వతంగా పేదరికంలో ఉంచాలని మేం అనుకోవడం లేదు. గత ప్రభుత్వం వారికి ఒక రూపాయి ఇచ్చి పది రూపాయలు దోచుకొంది. మేం నిజాయితీగా ప్రజలను అభివృద్ధిలోకి తేవాలని అనుకొంటున్నాం. వాస్తవాలు చెప్పడానికి భయపడదల్చుకోలేదు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆర్టీజీఎస్‌లో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం. చిత్రంలో సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు

ఆర్థికం ఘోరం

వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది

తల తాకట్టు పెట్టయినా హామీలు నెరవేరుస్తాం: సీఎం

ప్రభుత్వం వద్ద డబ్బులున్నా హామీలు అమలు చేయడం లేదనుకుంటున్నారు

- ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది
- ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే నిధులను మళ్లించలేం
- అభివృద్ధి చేయాలి.. సంక్షేమం చూసుకోవాలి
- ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తాం
- ప్రజలను శాశ్వతంగా పేదరికంలో ఉంచాలనుకోవడం లేదు: సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తల తాకట్టు పెట్టయినా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర హామీలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద వెసులుబాటు ఉంటే ఒక్క నిమిషం కూడా ఆగనని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి కొన్ని పథకాలకు వచ్చిన నిధులు చూసి రాష్ట్రం వద్ద చాలా డబ్బులు ఉన్నాయని అనుకొంటున్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని నిధులు ఇచ్చింది. వాటిని మళ్లించి సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడం

మిగతా 13వ పేజీలో...

పీపుల్ ఫస్ట్

- పథకాలపై లబ్ధిదారుల మాటే ఫైనల్
- గుడి.. బడి.. మాల్స్.. అన్న క్యాంటీన్లు..
- కూడళ్లలో ప్రజాభిప్రాయ సేకరణ
- ఎల్లుండి నుంచి వాట్సాప్ పరిపాలన
- ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు వెల్లడి
- పింఛన్లపై 90.20 శాతం సంతృప్తి
- ఉచిత ఇసుకపై 78% మందిలో సంతోషం

రాష్ట్ర అప్పులు రీషెడ్యూల్

- చెల్లింపు కాలపరిమితి పెంచాలని కోరుతున్నాం.. వడ్డీరేట్లు తగ్గించాలని అడుగుతున్నాం
- వృద్ధిరేటు 15% ఉంటేనే వడ్డీలు కట్టగలం.. 9.75 లక్షల కోట్ల అప్పులకు వడ్డీ కడుతున్నాం
- వైసీపీ విధ్వంసంపై ఆనాడు మేం చెప్పిందే నీతి ఆయోగ్ ధ్రువీకరించింది: సీఎం చంద్రబాబు

జగన్ అక్రమాస్తుల కేసుల్లో..



రోజువారీ విచారణ

సీబీఐ కోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం

- తెలంగాణ హైకోర్టు పర్యవేక్షించాలని సూచన
- ఎమ్మెల్యే, ఎంపీల కేసులపై సుప్రీంకోర్టు తీర్పు ఈ కేసులకూ వర్తిస్తుందని స్పష్టీకరణ
- వేరే రాష్ట్రానికి బదిలీ చేయక్కర్లేదని వెల్లడి
- విచారణకు జగన్ అడ్డుపడుతున్నారు
- పదేళ్లుగా బెయిల్‌పైనే ఉన్నారు
- బయట ఉండి ప్రభావితం చేస్తున్నారు
- కోర్టుకు హాజరుకాకుండా మినహాయింపుపై సీబీఐ కూడా సవాల్ చేయలేదు
- పదేళ్ల నుంచి ట్రయల్ ఒక్కడుగూ ముందుకు పడలేదు
- సుప్రీంకోర్టు, హైకోర్టు స్పష్టంగా ఆదేశించినా జాప్యమే
- డిశ్చార్జ్ పిటిషన్లపై వాదనలు విన్న ఐదుగురు జడ్జీలు నిర్ణయం వెలువరించకుండానే బదిలీ అయ్యారు
- రఘురామ తరపు సీనియర్ న్యాయవాది నివేదన
- ఇది రాజకీయ పిటిషన్ అన్న ముకుల్ రోహత్గీ
- బెయిల్ రద్దు పిటిషన్ ఉపసంహరించుకున్న రఘురామ



న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని ట్రయల్ కోర్టు(సీబీఐ ప్రత్యేక కోర్టు)ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేసుల విచారణ తీరును పర్యవేక్షించాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. జగన్ బెయిల్ రద్దు చేయాలని 2023 అక్టోబరు 6న, ఆయన అక్రమాస్తుల కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని అదే ఏడాది నవంబరు 1న అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ రెండు పిటిషన్లను కలిపి సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ వాదనలు వినిపించారు. కేసుల విచారణ జరగకుండా జగన్ అడ్డుపడుతున్నారని తెలిపారు. బెయిల్ మంజూరైన

మిగతా 14వ పేజీలో...



గుంటూరులో జరిగిన బీసీ మంత్రులు, ప్రజా ప్రతినిధుల సత్కార సభలో కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నేతలు. చిత్రంలో ఎమ్మెల్సీ రామారావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అచ్చెన్నాయుడు, పార్థసారథి, సవిత, ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు 12

మహిళలకే పట్టా

గ్రామాల్లో 3.. పట్టణాల్లో 2 సెంట్ల స్థలం



- పేదలందరికీ ఇళ్లు.. మార్గదర్శకాలు జారీ
- పదేళ్ల తర్వాత పూర్తి హక్కులు
- ప్రజల సమక్షంలో లబ్ధిదారుల జాబితా
- గ్రామం, పట్టణం యూనిట్‌గా ఎంపిక
- ప్రైవేటు, అసైన్డ్ భూముల సేకరణ
- పర్యవేక్షణకు మంత్రి అధ్యక్షతన కమిటీ

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయనుంది. అర్హులైన నిరుపేదలకు గృహ నిర్మాణం కోసం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాన్ని కేటాయించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఈ మేరకు ఉత్తర్వులు (జీఓ23) జారీ చేశారు. ఇళ్ల స్థలాల పట్టాలను మహిళల పేరిట ఇవ్వనున్నారు. పదేళ్ల తర్వాత యజమానికి పూర్తి హక్కులు (ఫ్రీ హోల్డ్) దక్కనున్నాయి. పట్టాలను ఈ మేరకు కన్వేయెన్స్ డీడ్ రూపంలో అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో స్థలాలు అందుబాటులో లేకుంటే టిడ్కో లేదా ఇతర స్కీమ్‌ల కింద హౌసింగ్ కల్పించనున్నారు. పథకం అమలు, పర్యవేక్షణ కోసం రెవెన్యూ మంత్రి చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ పథకం అమలు కోసం స్పష్టమైన

మిగతా 13వ పేజీలో...



తలల లెక్కతో వక్ఫ్ బిల్లుకు
జేపీసీ ఓకే

- విపక్షం అభ్యంతరాలు చెత్తబుట్టలోకి
- ఎన్డీఏ సభ్యుల సవరణలకు గ్రీన్ సిగ్నల్
- వివాదం లేని వక్ఫ్ ఆస్తుల్లో జోక్యం వద్దు
- తెలుగుదేశం కీలక సవరణకు ఆమోదం
- క్రూర చట్టం.. కాషాయీకరణ ప్రయత్నం
- ప్రజలే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
- ప్రతిపక్ష సభ్యుల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల్లో ప్రారంభమవుతున్న బడ్జెట్ సమావేశాల్లోనే అత్యంత కీలకమైన వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం సమావేశమైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన సవరణలన్నింటినీ పూర్తిగా తిరస్కరించి, ఎన్డీఏ సభ్యులు ప్రవేశపెట్టిన ప్రతి సవరణనూ పూర్తిగా అంగీకరించడంతో బిల్లుకు తుదిరూపం ఏర్పడింది. పదహారు మంది ఎన్డీయే సభ్యులు, పది మంది విపక్ష సభ్యులున్న జేపీసీ సంఖ్యాబలంతో పూర్తి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చడం, వక్ఫ్ ఆస్తులను సర్వే కమిషనర్ బదులు కలెక్టర్ సర్వే చేసేందుకు వీలు కల్పించడం, వక్ఫ్ ట్రైబ్యునల్ నిర్ణయాలను హైకోర్టులో సవాలు చేసేందుకు అనుమతించడం వంటి కీలక మార్పులను బిల్లులో ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తుల్ని ప్రస్తుతం ఉపయోగిస్తున్న వారి విషయంలో జోక్యం చేసుకోకూడదని, ఆ ఆస్తులు

మిగతా 2వ పేజీలో...

మామూలు కార్యకర్తనే!

అలా ఉండడమే నాకిష్టం.. అలాగే చూడండి: లోకేశ్



- ఒక వ్యక్తి ఒక పదవిలో 3 విడతలకు మించి ఉండకూడదనేది నా వ్యక్తిగత అభిప్రాయం
- ఈదఫా ప్రధాన కార్యదర్శిగా ఉండకూడదనుకుంటున్నా
- గ్రామ స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు మార్పు రావాలి
- రాజకీయ నేతలకు పాదయాత్ర ఎంబీఏ వంటిది
- యువగళంలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా.. వైసీపీని వీడినా అక్రమార్కులను వదలం
- 7 నెలల్లో రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు.. 4.1 లక్షల ఉద్యోగాలు వస్తాయి
- విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం.. ఆ హామీకి కట్టుబడి ఉన్నాం: లోకేశ్ 14

యువగళానికి రెండేళ్లు.. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సంబరాలు

1 నుంచి భూముల ధరలు పెంపు!

- భారీగా ఉన్నచోట తగ్గింపు.. అమరావతికి మినహాయింపు
- 2024-25లో అంచనాలు చేరని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం.. వచ్చే 2 నెలల్లో 10 వేల కోట్లు లక్ష్యం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల పెంపునకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 1 నుంచి భూముల ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరగనున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ అంశంపై కసరత్తు జరిగినా పలు వర్గాల నుంచి అభ్యంతరాలు రావడంతో ఈ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా మార్కెట్ ధరలకు

మిగతా 14వ పేజీలో...



రీచ్‌లకు కొత్త కళ

- ఎక్కడికక్కడ సులువుగా ఇసుక లభ్యం
- జోరుగా తవ్వకాలతో పుంజుకొన్న నిర్మాణరంగం
- ఉచితం అమలుతో సామాన్యుడికి ఊరట 11
- గత ప్రభుత్వంలో మాఫియా గుప్పిట ఇసుక
- 'పశ్చిమ'లో నాడు లారీ రూ.15 వేలు.. నేడు 10 వేలు
- కృష్ణాలో ట్రాక్టరు నాడు 4 వేలు.. నేడు రూ.1300కే

మహారాష్ట్రలో 'జీబీఎస్'తో తొలి మరణం

- గీలన్ బా సిండ్రోమ్ లక్షణాలతో సోలాపూర్‌లో వ్యక్తి మృతి
- పుణెలో 101 కేసులు.. 16 మందికి వెంటిలేటర్‌పై చికిత్స
- కలుషిత నీరే కారణం!.. ఏడుగురు వైద్యులతో కేంద్ర బృందం 2

అక్రమ వలసదారుల కోసం గురుద్వారాల్లో తనిఖీ

ట్రంప్ సర్కారుపై సిక్కు సంస్థల మండిపాటు

స్టాక్ మార్కెట్ల భారీ పతనం

- ఈ నెలలో రూ.32 లక్షల కోట్లు గల్లంతు 10
- అమెరికా మార్కెట్లకు చైనా డీప్‌సీక్ షాక్



మనది నమ్మకమైన భాగస్వామ్యం

- దానికి కట్టుబడి ఉన్నాం.. ట్రంప్‌నకు మోదీ ఫోన్
- రెండోసారి అధ్యక్షుడైనందుకు అభినందనలు

పర్యాటకంలో 1,217 కోట్ల
పెట్టుబడులు

- విశాఖలో ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సు
- 8 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు
- అందుబాటులోకి 825 హోటల్ గదులు
- 2,667 మందికి ఉపాధి అవకాశాలు
- క్రూయిజ్ హబ్‌గా విశాఖ: మంత్రి దుర్గేశ్ 13
- పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా
- ఇతర పరిశ్రమలకు మాదిరిగానే రాయితీలు



జూలై నాటికి ఉత్తరాంధ్రకు
గోదావరి నీళ్లు

- పోలవరం ఎడమ కాలువ టెండర్ల ప్రక్రియ పూర్తి
- ప్యాకేజీలకు ఆమోదం.. రూ.3,198 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగింత
- జూన్‌కల్లా పూర్తిచేసేందుకు ఒప్పందం
- 2027 డిసెంబరుకల్లా ప్రాజెక్టు నిర్మాణం: నిమ్మల

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వచ్చే జూలై నాటికి గోదావరి జలాలను తరలిస్తామని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. సోమవారం విజయవాడలోని జల వనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో పోలవరం ఎడమ కాలువ పనులపై ఆయన సమీక్ష జరిపారు. అనంతరం విలేకరులతో

మిగతా 11వ పేజీలో...

బ్రహ్మపుత్రపై భారత్ భారీ రిజర్వాయర్

చైనా 'వాటర్ బాంబ్' రిజర్వాయర్‌కు చెక్

న్యూఢిల్లీ, జనవరి 27: భారత ప్రభుత్వం దేశంలోకెల్లా పెద్దదైన జల విద్యుత్ కేంద్రాన్ని అరుణాచల్ ప్రదేశ్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించ తలపెట్టింది. చైనా సరిహద్దులకు కాస్త దిగువన నిర్మించే దీని ఖర్చు అక్షరాలా లక్షన్నర కోట్ల రూపాయలు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఏకంగా 325 టీఎంసీల నీటిని నిల్వచేసే రిజర్వాయర్‌ను కట్టబోతున్నారు. నిజానికి పర్యావరణ పరంగా ఆలోచిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో అంతపెద్ద జల విద్యుత్ ప్రాజెక్టు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. కానీ, ఎగువన చైనా నిర్మిస్తున్న మరో అతి పెద్ద జల విద్యుత్ కేంద్రం నుంచి దిగువన బ్రహ్మపుత్ర పరీవాహక ప్రాంతాల్లో ఎదురయ్యే ముప్పు నుంచి కాచుకోవాలంటే ఈ జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించక తప్పడం లేదు. చైనా సరిగ్గా భారత్ సరిహద్దుల్లో తల పెట్టిన రిజర్వాయర్‌ను ఈశాన్య రాష్ట్రాలపై సంధించిన వాటర్ బాంబుగా పరిగణిస్తున్నారు. చైనా జలాశయంలో 194 టీఎంసీలను నిలువ చేయవచ్చు. దీనిపై 60 వేల మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాన్ని కూడా నిర్మిస్తున్నారు. చైనా చెబుతున్న కారణం జల విద్యుత్తే అయినా.. ఇరు దేశాల మధ్య యుద్ధం వచ్చినపుడు చైనా ప్రతీకార చర్యల్లో భాగంగా ఈ డ్యాం గేట్లు ఎత్తేస్తే అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో వేల ఊళ్లు కొట్టుకుపోతాయి. దాన్ని ఎదుర్కోవడానికే దిగువన పరాంగ్ అనే ప్రాంతంలో భారత్ ఏకంగా 325 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తోంది. దీని వల్ల చైనా ఒకేసారి తన డ్యామ్‌ను ఖాళీ చేసినా దిగువన భారత్ నిర్మిస్తున్న జలాశయం మొత్తం వరదను కాచుకోగలదు.


మేలో జనం ముందుకు ఎల్టీటీఈ ప్రభాకరన్?

తమిళ మీడియాలో కథనాలు


(ఫైల్)

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో ప్రత్యేక తమిళ ఈలమ్ కోసం పోరాడిన...నిషేధిత తీవ్రవాద సంస్థ ఎల్టీటీఈ అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్ జీవించేవున్నారా? త్వరలోనే జనం ముందుకు రానున్నారా?.. అవుననంటోంది తమిళ మీడియా. మే నెలలో ఆయన జనం ముందుకు రానున్నారంటూ సోమవారం కొన్ని తమిళ పత్రికలు కథనాలు ప్రచురించాయి. శ్రీలంక సైన్యంతో జరిగిన పోరులో 2009 మే మాసంలో ప్రభాకరన్ మృతి చెందినట్టు సింహళ సైన్యం ఫోటోలను కూడా విడుదల చేసింది. ప్రభాకరన్ మృతి చెందినట్టు ప్రపంచమంతా భావిస్తున్నా.. ఎల్టీటీఈ సానుభూతిపరులైన తమిళ విమోచనోద్యమ నేత పి.నెడుమారన్ వంటి తమిళ రాజకీయ నేతలు మాత్రం ఆయన బతికే ఉన్నాడంటూ అడపాదడపా ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే... ప్రభాకరన్, అతడి కుడిభుజంగా వ్యవహరించిన పొట్టు అమ్మన్‌కూడా మే నెలలో జనం ఎదుటకు రానున్నారంటూ తాజాగా కథనాలు వెలువడ్డాయి.

లోకం తీరు




పుణ్య స్నానమాచరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

మహాకుంభమేళా.. సనాతన సంస్కృతికి ఐక్యతా చిహ్నం!

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. సంగమంలో పుణ్య స్నానం

మహాకుంభ్‌నగర్(యూపీ), జనవరి 27: సనాతన సంస్కృతి, జీవన తత్వానికి మహాకుంభమేళా ఐక్యతా చిహ్నమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. సామరస్యమే సనాతన సంస్కృతికి జీవనాడిగా పేర్కొన్నారు. మహాకుంభమేళాలో సోమవారం ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో త్రివేణీ సంగమంలో సంప్రదాయ బద్ధంగా పుణ్యస్నానం ఆచరించారు. పుణ్యస్నానాల అనంతరం సంగమానికి హారతి ఇచ్చి, అక్షయవట(మర్రిచెట్టు) వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక, కేంద్ర హోం మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కనీవినీ ఎరుగని భద్రతను ఏర్పాటు చేశారు. ప్రయాగ్‌రాజ్ నగరంలో ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు సహా భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 13న ప్రారంభమైన మహాకుంభమేళాకు సోమవారం నాటికి 13.21 కోట్ల మంది భక్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

గంగలో మునిగితే పేదరికం పోతుందా: ఖర్గే

ఇండోర్/న్యూఢిల్లీ, జనవరి 27: గంగానదిలో మునిగితే పేదరికం పోతుందా అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా మహూ(అంబేడ్కర్ జన్మస్థలం)లో కాంగ్రెస్ 'జై బాపూ, జైభీమ్, జై సంవిధాన్' ర్యాలీ నిర్వహించింది. ఖర్గేతో పాటు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. ఖర్గే ప్రసంగిస్తూ.. తాను ఎవరి విశ్వాసాన్నీ ప్రశ్నించడం లేదన్నారు. తన మాటలకు ఎవరైనా బాధపడితే క్షమాపణ కూడా చెబుతున్నట్లు తెలిపారు. 'ప్రధాని మోదీ తప్పుడు హామీల వలలో ప్రజలు చిక్కుకోవద్దు. గంగలో మునిగితే పేదరికం అంతమవుతుందా? మీ కడుపు నిండుతుందా? ఓపక్క పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. వీళ్లు (బీజేపీ ప్రభుత్వం) రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్నారు. గంగలో మునకలకు పోటీపడుతున్నారు. ఇలాంటి వారితో దేశానికి మేలు జరుగదు. మాకూ దేవుడిపై విశ్వాసం ఉంది. అయితే మతం పేరిట పేదలను వాడుకోవడంపైనే మాకు అభ్యంతరం' అని తెలిపారు. మోదీ, షా చాలా పాపాలు చేశారని.. వంద జన్మలెత్తినా వారు స్వర్గానికి వెళ్లరని చెప్పారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని.. దశాబ్దాలుగా సనాతన ధర్మాన్ని అవమానిస్తూ వస్తోందని.. ఇతర మతస్థుల మనోభావాలను పురాతన పార్టీ ఇలా దెబ్బతీయగలదా అని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా నిలదీశారు.

గ్రహశకలాన్ని గుర్తించిన భారత విద్యార్థి

- దానికి పేరు పెట్టే అవకాశమిచ్చిన నాసా
- 14 ఏళ్ల దక్ష్ మాలిక్‌కు అరుదైన గౌరవం



న్యూఢిల్లీ, జనవరి 27: భారత్‌కు చెందిన 14 ఏళ్ల విద్యార్థి దక్ష్ మాలిక్ అరుదైన ఘనత సాధించాడు. తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఒక గ్రహశకలాన్ని గుర్తించిన మాలిక్‌కు... దానికి తనే పేరు పెట్టే అద్భుత అవకాశాన్ని అమెరికాకు చెందిన నాసా అతనికి కల్పించింది. దక్ష్ మాలిక్ నోయిడాలోని శివ నాడార్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. 2022లో మాలిక్, అతని స్నేహితులకు నాసాతో భాగస్వామి అయిన ఇంటర్నేషనల్ ఆస్ట్రాయిడ్ డిస్కవరీ ప్రాజెక్టు (ఐఏడీపీ)లో చేరే అవకాశం లభించింది. తన స్నేహితులతో కలిసి ఏడాదిన్నరపాటు అంతరిక్షాన్ని శోధించిన మాలిక్.. 2023లో ఒక గ్రహశకలాన్ని గుర్తించాడు. అప్పటి నుంచి దాని పేరు '2023 ఓజీ40'గా కొనసాగుతోంది. అయితే నాసా ఇప్పుడు దీనికి శాశ్వత పేరు పెట్టే అవకాశాన్ని దక్ష్ మాలిక్‌కు కల్పించింది.

సెకండ్ షోకు పిల్లల్ని అనుమతించొద్దు

- పుష్ప-2 తొక్కిసలాట నేపథ్యంలో హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాత్రి 11 గంటల తర్వాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమా థియేటర్లలోకి అనుమతించరాదని నిషేధం విధిస్తూ హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక తల్లి మరణించడంతో పాటు ఒక చిన్నారి తీవ్ర గాయాల పాలైన నేపథ్యంలో ఇక చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేసింది. బెనిఫిట్, స్పెషల్ షోలకు అనుమతులివ్వడం, టికెట్ల రేట్ల పెంపుపై దాఖలైన పలు పిటిషన్‌లపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. "రాత్రి 11 గంటల తర్వాత సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో 16 ఏళ్లలోపు పిల్లలను అనుమతించడం భావ్యం కాదని ఈ కోర్టు భావిస్తోంది. ఉదయం 11 గంటలకు ముందు రాత్రి 11 గంటల తర్వాత సినిమా థియేటర్లలోకి పిల్లల ప్రవేశాన్ని నియంత్రించే విధంగా అందరు స్టేక్ హోల్డర్లతో చర్చించి హోం శాఖ ముఖ్య కార్యదర్శి తగిన నిర్ణయం తీసుకోవాలి. సదరు ప్రక్రియ పూర్తయ్యే వరకు రాత్రి 11 గంటల తర్వాత థియేటర్లలోకి 16 ఏళ్లలోపు పిల్లలను అనుమతించడంపై నిషేధం విధిస్తున్నాం" అని మధ్యంతర ఆదేశాలిచ్చింది.

నావిక్-02 ప్రయోగం రేపే

- జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌తో కక్ష్యలోకి

సూళ్లూరుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్పేడెక్స్ ప్రయోగంతో గతేడాదిని ఘనంగా ముగించిన ఇస్రో... మరో అద్భుతమైన రికార్డు ప్రయోగంతో ఈ ఏడాదిని ఆరంభించనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ వేదికగా వందో ప్రయోగానికి సిద్ధమైంది. నావిగేషన్, భద్రత వ్యవస్థల కోసం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎన్‌వీఎస్-02 (నావిక్-02) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఈ నెల 29న ఉదయం 6:23 గంటలకు రోదసీలోకి పంపనుంది. దీనికి కౌంట్‌డౌన్ మంగళవారం తెల్లవారుజామున 2:53 గంటలకు ప్రారంభం కానుంది. 27:30 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే బుధవారం ఉదయం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో ఛైర్మన్ నారాయణన్ షార్‌కు చేరుకొన్నారు. ఈ ఏడాది చేపడుతున్న తొలి ప్రయోగం, షార్‌లో వందో ప్రయోగం కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇది విజయవంతమైతే ఇస్రో ఖాతాలో మరో అరుదైన రికార్డు చేరనుంది. వ్యోమగాములతో కూడిన నౌకను రోదసీలోకి పంపే లక్ష్యంగా శ్రమిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తల సంకల్పానికి నావిక్-02తో మరో అడుగు ముందుకు పడనుంది. స్వదేశీ ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ అయిన నావిక్-02 దేశంలోని విమానయాన, నౌకయాన మార్గాలకు, సైనిక అవరాలకు కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది. ఇది భారత భూభాగం నుంచి 1500 కిలోమీటర్ల వెలుపల కూడా వేగంగా, కచ్చితత్వంతో కూడిన సేవలు అందించగలదు.

తలల లెక్కతో వక్ఫ్ బిల్లుకు జేపీసీ ఓకే

(మొదటి పేజీ తరువాయి)

వివాదంలో ఉన్నపుడు, లేదా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నపుడు మాత్రమే కలుగజేసుకోవాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణ దేవరాయలు ప్రవేశపెట్టిన కీలకమైన సవరణను జేపీసీ ఆమోదించింది. నిజానికి వాడుకలో ఉన్నంత మాత్రాన వక్ఫ్ ఆస్తి(వక్ఫ్ బై యూజర్) కాదని చెప్పడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం తెస్తుండగా దీనికి టీడీపీ ప్రవేశ పెట్టిన ప్రధాన సడలింపునకు జేపీసీ అంగీకరించింది. ఇప్పుడు వివాదమో, ప్రభుత్వ కార్యాలయమో ఉంటే తప్ప 'వక్ఫ్ బై యూజర్' అనేది ఎప్పటిలాగే వర్తిస్తుంది. అయితే కొత్త చట్టం అమల్లోకి వచ్చే నాటికి సదరు ఆస్తి రిజిస్టర్ అయి ఉండాల్సి ఉంటుంది. టీడీపీ తరఫున కృష్ణదేవరాయలు ప్రతిపాదించిన మూడు సవరణలనూ జేపీసీ ఆమోదించడం గమనార్హం. ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా ప్రకటిస్తే దానిపై కలెక్టర్ ద్వారా విచారణ జరపాలని బిల్లు ముసాయిదాలో ఉంటే, కలెక్టర్ కంటే ఉన్నత స్థాయి అధికారితో విచారణ జరిపించాలని లావు కృష్ణ దేవరాయలు మరో సవరణను ప్రవేశపెట్టారు. కలెక్టర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి అధిపతి అయినందున ఆ అధికారి రెవెన్యూ వాదన వైపే మొగ్గుచూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో టీడీపీ ఈ ప్రతిపాదనను చేర్చింది. చట్టం అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రతీ వక్ఫ్ తన ఆస్తుల వివరాలను వెబ్ పోర్టల్‌లో ప్రకటించాలనే నిబంధన ప్రతిపాదిత బిల్లులో ఉండగా, వక్ఫ్ వివరాలు ఇవ్వకపోయేందుకు సరైన కారణాలు ఉంటే తనకు మరింత సమయం కావాలని ముతావలి ట్రిబ్యునల్‌కు దరఖాస్తు పెట్టుకుంటే సుముఖంగా పరిశీలించాలని, అందుకు కనీసం ఆరు నెలల సమయం ఇవ్వాలని కూడా కృష్ణదేవరాయలు మూడో సవరణను ప్రవేశపెట్టారు. తెలుగుదేశం ప్రవేశపెట్టిన సవరణలతో పాటు అధికార పార్టీ సభ్యులు ప్రవేశపెట్టిన 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. జేడీ(యు) ఎంపీ దిలేశ్వర్ కమయిత్, బీజేపీ ఎంపీ, హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ తదితరులు సవరణలను ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తులను మత పరమైన ప్రయోజనాలకు మాత్రమే పరిమితం చేయాలని జేపీసీ నిర్ణయించింది. కాంగ్రెస్, తృణమూల్, ఎంఐఎం, డీఎంకేతో సహా ప్రతిపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన సవరణలు అన్నింటినీ జేపీసీ ఛైర్మన్ జగదంబికా పాల్ మూజువాణీ ఓటుతో తిరస్కరించేలా చేశారు.



క్లాజుల వారీగా తిరస్కరించాం

ప్రతిపక్ష సభ్యులు మొత్తం 44 క్లాజ్‌లకు ప్రతిపాదించిన అన్ని సవరణలను జేపీసీ సమావేశంలో ప్రవేశపెట్టి ప్రజాస్వామ్యయుతంగా తిరస్కరించామని ఛైర్మన్ జగదంబికా పాల్ అన్నారు. 6నెలలుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. ఛైర్మన్ స్వయంగా తమ క్లాజులను ప్రవేశపెట్టి, తలలను లెక్కించి, వాటిని తిరస్కరించినట్లు ప్రకటించారని, తమను నోరెత్తనివ్వలేదని టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ చెప్పారు. జేపీసీలో 16 మంది ఎన్డీఏ సభ్యులుండగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు పది మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణ నుంచి బీజేపీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సభ్యురాలిగా ఓటింగ్ లో పాల్గొన్నారు.

క్లాజుల వారీగా చర్చించలేదు

జేపీసీ ఛైర్మన్ అప్రజాస్వామికంగా వ్యవహరించారని, జేపీసీ విచారణలు జరిపినపుడు అభిప్రాయాలు చెప్పడానికి వచ్చిన వారిలో 95 శాతం మంది బిల్లును వ్యతిరేకించారని, సమర్థించిన ఐదు శాతం మంది కూడా మత నేపథ్యం ఉన్నవారేనని విపక్షాలు ఆరోపించాయి. ఎ.రాజా(డీఎంకే), కల్యాణ్ బెనర్జీ(తృణమూల్), గౌరవ్ గొగోయ్(కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ(ఎంఐఎం), అరవింద్ సావంత్(శివసేన-యుబిటి) తదితరులు జేపీసీ వైఖరిని విమర్శిస్తూ సంయుక్త ప్రకటన జారీ చేశారు. సవరణలపై తాము చెప్పే అభిప్రాయాలను వినకుండా అడ్డుకున్నారని చెప్పారు. ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో జరిగిన సమావేశాల మినిట్స్‌ను తమకు సరఫరా చేయలేదని, క్లాజుల వారీగా చర్చకు అనుమతించలేదని వారు ఆరోపించారు. తమకు డాక్యుమెంట్లను ఇవ్వకుండా ఛైర్మన్ నియంతలా వ్యవహరించారని, క్రూరమైన మెజారిటీతో ఈ దేశాన్ని కాషాయమయంగా మార్చేందుకు ప్రభుత్వానికి జేపీసీ వీలు కల్పించిందని విమర్శించారు. గాంధీ, నెహ్రూ, పటేల్ వంటి జాతి నిర్మాతలు రూపొందించిన రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రజలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. విపక్ష సభ్యులు విడిగా తన అభ్యంతర ప్రకటనను(డిసెంట్ నోట్) జేపీసీ నివేదికలో చేర్చేందుకు అందజేసే అవకాశం ఉంది.

మహారాష్ట్రలో 'జీబీఎస్'తో తొలి మరణం!

పుణె, జనవరి 27: గీలన్ బా సిండ్రోమ్(జీబీఎస్).. అత్యంత అరుదైన ఈ వ్యాధి ఇప్పుడు మహారాష్ట్రను భయపెడుతోంది. జీబీఎస్ లక్షణాలతో ఆదివారం సోలాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి(40) చనిపోయాడు. మహారాష్ట్రలో ఈ వ్యాధి కారణంగా నమోదైన తొలి మరణం ఇదేనని భావిస్తున్నారు. ఇటీవల పుణెకు వెళ్లి వచ్చిన తర్వాత ఈ వ్యక్తి అనారోగ్యం పాలయ్యాడు. విపరీతమైన తిమ్మిరి, కండరాల బలహీనత, డయేరియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జలుబు తదితర లక్షణాలతో ఈ నెల 18న సోలాపూర్‌లోనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఆదివారం చనిపోయాడు. మరోవైపు, పుణెలో జీబీఎస్ వ్యాప్తి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ ఇప్పటివరకు 110మందికి ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. వీరిలో 16మంది వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. జీబీఎస్ చాలా అరుదైన వ్యాధి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ సోకినపుడు రోగనిరోధక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని నరాల వ్యవస్థపై ప్రభావం పడుతుంది.

ఉత్తరాఖండ్‌లో అమల్లోకి యూసీసీ

న్యూఢిల్లీ, జనవరి 27: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) విధానం అమలులోకి వచ్చింది. దేశంలోనే యూసీసీని అమలుచేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. యూసీసీ పోర్టల్, నోటిఫికేషన్‌లను ఆ రాష్ట్ర సీఎం పుష్కర్ సింగ్ ధామీ సోమవారం ఆవిష్కరించారు. "యూసీసీ అమలు రాజ్యాంగబద్ధ చర్య. ఇది వివక్షను అంతం చేస్తుంది. నిజమైన అర్థంలో మహిళా సాధికారికత సాకారం కానుంది. నిఖా హలాల్, బహుభార్యత్వం, బాల్య వివాహాలు, ట్రిపుల్ తలాక్ వంటి దుష్ట విధానాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. రాజ్యాంగంలోని 342 అధికరణ కింద రక్షణ పొందుతున్న ఆదివాసీలకు యూసీసీ నుంచి మినహాయింపు ఉంటుంది. యూసీసీ ఏ ఒక్క మతానికీ, తెగకూ వ్యతిరేకం కాదని మళ్లీ స్పష్టం చేస్తున్నాం" అని ధామీ అన్నారు.

మనది నమ్మకమైన భాగస్వామ్యం

- ట్రంప్‌నకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ, జనవరి 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి మాట్లాడారు. 'రెండోసారి బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించిన ప్రియమిత్రు'నికి అభినందనలు తెలిపారు. ఆయన అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత ఫోన్ చేయడం ఇదే ప్రథమం కావడం విశేషం. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఘన విజయం సాధించిన గత ఏడాది నవంబరు 7న కూడా ఆయనకు ఫోన్ చేశారు. దీనిపై మోదీ ట్వీట్ చేస్తూ పరస్పర ప్రయోజనాలకు, విశ్వసనీయ భాగస్వామ్యానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల సంక్షేమం, ప్రపంచశాంతి, సౌభాగ్యం, భద్రత కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సాంకేతిక రంగాలను కేంద్రీకృతం చేసుకొని ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ప్రతిపాదించారు. ప్రపంచ సమస్యలైన ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమ ఆసియా సమస్యలపైనా చర్చలు జరిపారు. త్వరలో భేటీ కావాలని కూడా ఇరువురు నేతలు నిర్ణయించారు. అక్రమ వలసదారుల సమస్యపై మాట్లాడిందీ లేనిదీ వెంటనే తెలియరాలేదు. సరైన పత్రాలు లేని సుమారు 18వేల మందిని తిప్పి పంపించే అవకాశం ఉండడంతో ఈ సమస్యను ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేదానిపై ఆసక్తి నెలకొంది.

చందన్ మిశ్ర, రేపాక స్వాతిలను కోర్టుల్లో ప్రవేశపెట్టిన పోలీసులు

- హైకోర్టు ఉత్తర్వుల అమలు

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగద్గిరిగుట్ట శ్రీనివాస కాలనీలో నిర్బంధించిన మావోయిస్టు చందన్‌మిశ్రా ఆయన భార్య రేపాక స్వాతిలను తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సంబంధిత కోర్టుల్లో ప్రవేశపెట్టారు. ఈ విషయాన్ని సోమవారం పోలీసులు హైకోర్టుకు నివేదించారు. చందన్ మిశ్రాను ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు పోలీసులు అరెస్టు చేయగా, ఆయనను రంపచోడవరం మేజిస్ట్రేటు కోర్టులో ప్రవేశపెట్టారు. చందన్‌మిశ్రా భార్య స్వాతిని కూకట్‌పల్లి కోర్టులో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈనెల 24న రాత్రి 9 గంటలకు పోలీసులు చందన్‌మిశ్రాను, ఆయన భార్యను అక్రమంగా నిర్బంధించి తీసుకెళ్లారని, వారిని 24 గంటల్లో కోర్టు ఎదుట ప్రవేశపెట్టేలా ఆదేశాలు జారీచేయాలని పేర్కొంటూ ఈనెల 25న రిటైర్డ్ ప్రొఫెసర్, పౌరహక్కుల కమిటీ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావుల ధర్మాసనం.. పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ నిర్బంధించిన వారిని సోమవారం ఉదయం 10.30 గంటలలోపు సంబంధిత కోర్టుల్లో ప్రవేశపెట్టాలని డీజీపీకి ఆదేశాలు జారీచేసింది. ఏయే కేసుల్లో ఎందుకు అరెస్ట్ చేశారనే వివరాలతో ఏపీ పోలీసుల నుంచి నివేదిక తీసుకోవాలని సూచించింది. ఈ పిటిషన్ మళ్లీ విచారణకు రాగా వారిని కోర్టుల్లో ప్రవేశపెట్టినట్టు పోలీసులు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది.

అక్రమ వలసదారుల కోసం..

గురుద్వారాల్లోనూ తనిఖీలు

న్యూయార్క్, న్యూజెర్సీల్లో అధికారుల వేట.. ట్రంప్ సర్కారుపై సిక్కు సంస్థల మండిపాటు



న్యూయార్క్, జనవరి 27: అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమేస్తున్న అమెరికా.. ఆ వేటలో భాగంగా న్యూయార్క్, న్యూజెర్సీల్లోని గురుద్వారాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. సిక్కు వేర్పాటువాదులు, అక్రమ వలసదారులు, సరైన పత్రాలు లేనివారు ఆ గురుద్వారాలను తమ హబ్‌గా మార్చుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో అమెరికా అంతర్గత భద్రత శాఖ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. నిజానికి.. ప్రార్థనామందిరాలు, పాఠశాలల వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ), కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకుండా బైడెన్ హయాంలో నియంత్రణలు విధించారు. కానీ, ట్రంప్ సర్కారు ఆ విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఆయా విభాగాల అధికారులు ప్రార్థనా మందిరాలనూ వదలకుండా సోదాలు చేస్తున్నారు. "ఇకపై నేరగాళ్లు పోలీసులకు దొరక్కుండా ఉండడానికి అమెరికాలోని పాఠశాలలు, చర్చిల్లో దాక్కోలేరు" అని ఆ విభాగం అధికార ప్రతినిధి ఒకరు హెచ్చరించారు. కాగా.. గురుద్వారాల్లోకి అధికారులను పంపిస్తున్న ట్రంప్ సర్కారుపై సిక్కు సంస్థలు మండిపడుతున్నాయి. ఈ తరహా చర్యలు తమ మత విశ్వాసానికి, గురుద్వారాల పవిత్రతకు ముప్పుగా పరిణమిస్తాయని 'సిఖ్ అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్' ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా గురుద్వారాల్లో సోదాలు చేస్తున్నట్టు తెలిస్తే వచ్చేవారి సంఖ్య తగ్గిపోతుందని, దానివల్ల తమ మతవిశ్వాసాలకు సంబంధించిన ప్రక్రియలను అర్థవంతంగా నిర్వహించుకోలేని పరిస్థితి వస్తుందని ఆగ్రహం వెలిబుచ్చింది.

వాణిజ్య యుద్ధానికి భయపడి..

"మా దేశానికి చెందినవారిని అమెరికా నుంచి అక్రమ వలసదారుల పేరుతో సైనిక విమానాల్లో పంపిస్తారా.." అంటూ అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేసి, రెండు విమానాలను తిరస్కరించిన కొలంబియా దేశం ఒక్కరోజు కూడా గడవక ముందే మాట మార్చింది. అగ్రరాజ్యం తమ దేశంపై వాణిజ్య యుద్ధానికి దిగేందుకు సిద్ధం కావడంతో.. అమెరికా చెప్పినట్టు నడుచుకోవడానికి సిద్ధమైంది. మాస్‌డీపోర్టేషన్‌లో భాగంగా అమెరికా ఆదివారం ఉదయం రెండు సైనిక విమానాల్లో అక్రమ వలసదారులను కొలంబియాకు పంపించింది. ఆ విమానాలు రావడానికి తొలుత అన్ని అనుమతులూ ఇచ్చిన కొలంబియా.. అవి దారిలో ఉండగా ఆ అనుమతులను ఉపసంహరించుకుంది. దీంతో ట్రంప్.. కొలంబియా దిగుమతులపై 25% సుంకాలు విధిస్తామని.. మరో వారంలో ఆ సుంకాలను 50 శాతానికి పెంచేస్తానని హెచ్చరించారు. కొలంబియా నుంచి అమెరికాకు ఎవరూ రాకుండా ప్రయాణ నిషేధాన్ని విధిస్తానన్నారు. ఇప్పటికే అమెరికాలో ఉన్న కొలంబియన్ ప్రభుత్వ అధికారులు, వారి కుటుంబసభ్యులు, మద్దతుదారుల వీసాలను రద్దు చేస్తానని హెచ్చరించారు. దీంతో, కొలంబియా సర్కారు వెనక్కి తగ్గింది. అమెరికా నుంచి సైనిక విమానాల రాకకు ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఆ దేశ విదేశాంగ మంత్రి లూయిస్ గిల్బెర్టో అధికారికంగా వెల్లడించారు. దీన్ని ట్రంప్ విజయంగా వైట్‌హౌస్ అభివర్ణించింది.

మహిళలకు ప్రతినెలా రూ. 2,100

- హామీ పత్రంపై కేజ్రీవాల్ సంతకం
- ఢిల్లీ ఓటర్లకు 15 హామీలిచ్చిన ఆప్



న్యూఢిల్లీ, జనవరి 27: "కేజ్రీవాల్ కా గ్యారెంటీ" పేరుతో రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సోమవారం విడుదల చేశారు. "ఆప్ అధికారంలోకి వచ్చిన వెంటనే అరవింద్ కేజ్రీవాల్ అనే నేను నా తల్లులు, సోదరీమణుల కోసం మహిళా సమ్మాన్ రాశి యోజన పథకం ప్రారంభిస్తానని హామీ ఇస్తున్నాను" అని ముద్రించిన గ్యారెంటీ కార్డుపై సంతకం చేశారు. ఆ మ్యానిఫెస్టోలో మహిళలకు నెలానెలా రూ. 2,100 ఆర్థిక సాయం, 24 గంటలూ మంచి నీళ్లు, వృద్ధుల కోసం ఉచిత ఆరోగ్య పథకం, విద్యార్థులకు మెట్రోలో 50 శాతం రాయితీ తదితర 15 ముఖ్యమైన హామీలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఆరు ఉచిత పథకాలు కూడా కొనసాగిస్తామని కేజ్రీవాల్ చెప్పారు. అర్చకులకు, గురుద్వారా గ్రంథీలకు నెలకు రూ.18 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్లు, రిక్షావాలాలకు ఆర్థిక సహాయం చేస్తామని, వారి కుమార్తెల వివాహానికి రూ.లక్ష ఇస్తామని, రూ.10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామన్నారు. ఇప్పటికే తామిస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం నెలనెలా రూ.25 వేలు వరకు లబ్ధిపొందుతోందని, ఉచితాలను ఆపేస్తామని బీజేపీ ఇప్పటికే చెప్పినందున ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఇదంతా కోల్పోతారని ఆయన హెచ్చరించారు.

ఢిల్లీకి వచ్చే నీటిలో విషం!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ కేజ్రీవాల్ సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం ఢిల్లీకి వచ్చే నీటిలో విషం (అధిక అమ్మోనియా స్థాయి) కలుపుతోందని ఆరోపణలు చేశారు. ఢిల్లీ ప్రజలు బీజేపీకి ఓటేయకుంటే.. వారికి విషం కలిపిన నీరు ఇచ్చి చంపుతారా? అని ప్రశ్నించారు. 'ఈ కలుషిత నీరు ఇక్కడి తాగు నీటిలో కలిస్తే.. ఎంత మంది ఢిల్లీ ప్రజలు చనిపోయారో చెప్పలేం! ఒక సామూహిక నరమేధం అయ్యేది!!' అని వ్యాఖ్యానించారు.

మళ్లీ కైలాశ్, మానస సరోవర్ యాత్రలు

భారత్-చైనా మధ్య నేరుగా నడిచే విమాన సర్వీసుల పునరుద్ధరణ కూడా

న్యూఢిల్లీ, జనవరి 27: భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల విషయంలో సోమవారం మరో ముందడుగు పడింది. రానున్న వేసవిలో కైలాశ్, మానస సరోవర్ యాత్రలను పునరుద్ధరించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. టిబెట్‌లో ఉన్న ఈ పవిత్ర క్షేత్రాల సందర్శన కరోనా కారణంగా 2020 నుంచి నిలిచిపోయాయి. అనంతరం గల్వాన్ ఘర్షణల నేపథ్యంలో ఒప్పందాలను పునరుద్ధరించుకోలేదు. తాజాగా రెండు రోజుల పర్యటన నిమిత్తం చైనా వెళ్లిన భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ బీజింగ్‌లో చైనా ఉప విదేశాంగ మంత్రితో జరిపిన చర్చల్లో ఈ విషయమై అంగీకారం కుదిరింది. మరోవైపు, రెండు దేశాల మధ్య నేరుగా తిరిగే విమాన సర్వీసులను కూడా పునరుద్ధరించాలని ఇరు దేశాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఇందుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించేందుకు రెండు దేశాల అధికారులు త్వరలోనే భేటీ కానున్నారు.



సీఎం చంద్రబాబునాయుడును కలిసిన దూండి రాకేష్, ఆర్యవైశ్య ప్రముఖులు

సీఎంకు ఆర్యవైశ్య సంఘాల కృతజ్ఞతలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును ఏటా మాఘ శుద్ధ విదియ నాడు రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించేందుకు జీవో నంబర్181 ద్వారా ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఆర్యవైశ్య సంఘాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపాయి. సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును అధికారికంగా నిర్వహించాలని ఆర్యవైశ్య సంఘాలు కోరగా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసి, ధన్యవాదాలు తెలిపిన వారిలో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ఇరుకుల రామకృష్ణ, అరవీటి నిర్మల, శేగు షణ్ముగం, ఎంవీటీ గురుబ్రహ్మం తదితరులున్నారు.

పెనుగొండలో 31న వాసవీమాతకు చంద్రబాబు పూజలు

భీమవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో కొలువుదీరిన వాసవీ అమ్మవారిని ఈనెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకోనున్నారు. ఆరోజు ఉదయం పెనుగొండ విచ్చేసి చంద్రబాబు అమ్మవారికి పూజలు చేస్తారు. కేవలం అమ్మవారి దర్శనం, పూజలకే చంద్రబాబు పర్యటన పరిమితం చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరిగి విజయవాడ పయనమవుతారు. ఇదిలా ఉంటే ఫిబ్రవరి ఒకటో తేదీన తణుకు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన వాయిదా పడింది. ఆ రోజు తేతలిలో ప్రధాన మంత్రి ఆవాస యోజన 2.0 పథకాన్ని ప్రారంభించాల్సి ఉంది.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన భువనేశ్వరి



ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

చల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథలు, పేద పిల్లలకు ఉచితంగా చదువు చెబుతూ, వసతి కల్పించే ఎన్టీఆర్ మోడల్ స్కూల్లోని విద్యార్థుల వసతి సౌకర్యాలు పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేసి వారితో మాట్లాడారు. క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌ను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. తొలుత ట్రస్ట్ పతాకాన్ని ఆవిష్కరించిన భువనేశ్వరికి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే, ఎన్నారై బొబ్బా గోవర్ధన్, టీడీపీ నాయకుడు కనపర్తి శ్రీనివాసరావు, స్థానిక నేతలు.. భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు ఉద్యాన వర్సిటీ విరాళం

అమరావతి: వరదబాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం తరఫున రూ.12,70,326 చెక్కును మంత్రి అచ్చెన్నాయుడుకు వర్సిటీ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యాన వర్సిటీ క్యాలెండర్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు.

నేటి నుంచి విశాఖ జైల్లో వీడియో ములాఖత్‌లు

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్ర కారాగారంలో మంగళవారం నుంచి వీడియో ములాఖత్‌లు ప్రారంభం కానున్నట్టు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు. ఇందుకోసం ముందుగా స్లాట్ బుక్ చేసుకోవలసి ఉంటుందన్నారు. సుమారు అర గంట వరకు ఖైదీలు బంధువులతో మాట్లాడవచ్చునని తెలిపారు. ఈ సౌకర్యం వినియోగించుకోదలచినవారు Emulakat nic.in వెబ్‌సైట్‌లో సంప్రతించాలని జైలు అధికారులు సూచించారు.

నిష్క్రమించిన ఈశాన్య రుతుపవనాలు

- వాతావరణ మార్పులతో కాస్త ఆలస్యం
- ఏపీలో 10 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతంలో ఐదు వాతావరణ సబ్ డివిజన్ల నుంచి సోమవారం ఈశాన్య రుతుపవనాలు నిష్క్రమించాయి. రుతుపవనాల నిష్క్రమణపై వారం రోజుల నుంచి పలు దఫాలు భారత వాతావరణ ప్రకటనలు చేస్తూ వచ్చింది. చివరికి ఈ విషయాన్ని సోమవారం నిర్ధారించింది. సాధారణంగా అక్టోబరు నుంచి డిసెంబరు 31 వరకుగల కాలాన్ని ఈశాన్య రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. రుతుపవనాలు జనవరి వరకూ కొనసాగినా డిసెంబరు 31 వరకు కురిసిన వర్షాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. ప్రస్తుతం దక్షిణ భారతంలో తమిళనాడు, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో వర్షాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇంకా పొడి వాతావరణం నెలకొనడం, సముద్రం నుంచి తేమగాలులు తగ్గడంతో ఈశాన్య రుతుపవనాలు నిష్క్రమించినట్టుగా భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణాదిలోని ఐదు సబ్ డివిజన్లలో ఏడాదిలో కురిసే వర్షపాతంలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లోనే 30 శాతం నమోదవుతుంది. అదే ఒక్క తమిళనాడు తీసుకుంటే 48 శాతం వరకూ వర్షపాతం నమోదవుతుంది. ఈ ఏడాది అక్టోబరు 15న ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. సీజన్‌లో ఒక తీవ్ర తుఫాన్, ఒక తుఫాన్, మూడు వాయుగుండాలు, రెండు తీవ్ర అల్పపీడనాలు, రెండు అల్పపీడనాలు వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఇలా..

రాష్ట్రం వరకూ చూస్తే ఈ సీజన్‌లో 286.5 మి.మీ.లకుగాను 316.5 (ప్లస్ 10 శాతం) మి.మీ. వర్షపాతం నమోదైంది. కోస్తాలో 322.3కి 292.3 మి.మీ (సాధారణం కంటే తొమ్మిది శాతం తక్కువ), రాయలసీమలో 235.7కి 344.4 మి.మీ. (46 శాతం ఎక్కువ) నమోదైంది. రాయలసీమలోని శ్రీసత్యసాయి జిల్లాలో 173.1 మి.మీ.కి 360.8 (108 శాతం ఎక్కువ) మి.మీ. నమోదు కాగా, కర్నూలులో 140.2కి 103.7 మి.మీ. (29 శాతం తక్కువ), కోస్తాలో నెల్లూరులో 574కి 736.6 మి.మీ. (28 శాతం ఎక్కువ) వర్షపాతం కురిసింది. ఉత్తరకోస్తాలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో తమిళనాడులో వరదలు ముంచెత్తాయి. అనేక జిల్లాల్లో సాధారణానికి మించి వర్షాలు కురవడంతో రిజర్వాయర్లు గరిష్ఠ స్థాయికి చేరాయి.

ఆలస్యం ఆగమనం, నిష్క్రమణ ఎందుకంటే...

వాతావరణ మార్పుల ప్రభావంతోనే ఈశాన్య రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించడం, నిష్క్రమించడం జరుగుతుందని సంబంధిత అధికారి సముద్రాల జగన్నాథకుమార్ విశ్లేషించారు. సుమారు పదేళ్ల నుంచి నైరుతి, ఈశాన్య రుతుపవనాల నిష్క్రమణలో జాప్యం జరుగుతుందన్నారు. నైరుతి రుతుపవనాలు వాయువ్య భారతం నుంచి నిర్ణీత తేదీ కంటే ఆలస్యంగా వైదొలిగే పరిస్థితులు నెలకొంటున్నాయని, ఆ ప్రభావం ఈశాన్య రుతుపవనాలపై పడుతోందని చెప్పారు. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో డిసెంబరు నెలలో బంగాళాఖాతంలో తుఫాన్‌లు ఏర్పడి తమిళనాడుపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషించారు. వాతావరణ ప్రభావంతో వేడెక్కిన సముద్రాల నుంచి వచ్చే గాలుల ప్రభావంతో తీర ప్రాంతాల్లో వర్షాల తీవ్రత పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరిల్లో కురిసిన అతిభారీ వర్షాలే అందుకు నిదర్శనంగా పేర్కొన్నారు.

సీమ ప్రాజెక్టులకు రూ.20వేల కోట్లు కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కొండాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రానున్న బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యంగా రాయలసీమ ప్రాజెక్టులకు రూ.20,000 కోట్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలోని గండికోట ప్రాజెక్టును సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాయలసీమ ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం శీతకన్ను వేసిందని విమర్శించారు. రాయలసీమలో వలసలను ఆపాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం అని చంద్రబాబు ప్రభుత్వం దృష్టిపెట్టిందని.. ఇది సరైన పద్ధతి కాదని అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలని కోరారు. హంద్రీ-నీవా కాలువల కింద ఒక్క ఎకరా ఆయకట్టు కూడా అభివృద్ధి చేయలేదన్నారు. గండికోట ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీళ్లు నింపినా, దానిలో అంతర్భాగమైన వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు ఇవ్వలేదన్నారు. పది సంవత్సరాలుగా గండికోట ప్రాజెక్టులో నీళ్ల నింపుతున్నా నిర్వాసితులకు న్యాయం జరగలేదన్నారు.

వాహనం ఢీకొని చిరుత మృతి



జాతీయరహదారిపై చిరుత కళేబరం

మర్రిపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం సంగణపల్లి సమీపంలోని ముంబయి జాతీయ రహదారిపై (నెం.565) సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ చిరుత పులి మృతి చెందింది. సింగణపల్లి సమీపంలో ఉన్న వెలుగొండ అడవిలో నుంచి బయటకు వచ్చిన చిరుత రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి కొనఊపిరితో ఉన్న చిరుతను చూసి భయపడి దానిని కాపాడే ప్రయత్నం ఎవరూ చేయలేకపోయారు. ఆత్మకూరు అటవీ శాఖ రేంజర్ శేఖర్ ఘటనా స్థలాన్ని పశు సంవర్ధక శాఖ అధికారులు చిరుత కళేబరానికి పంచనామా చేసి, దహన సంస్కారాలు చేశారు.

31నుంచి విజ్ఞాన్‌లో బాల మహోత్సవ్

- విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా ఈ నెల 31 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. సోమవారం వడ్లమూడిలోని విజ్ఞాన్‌లో జరిగిన కార్యక్రమంలో లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి లోపు.. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొనవచ్చని తెలియజేశారు. విజ్ఞాన్ వెబ్‌సైట్‌ను సందర్శించి కూడా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 90305 57363 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రమాదాలు-పాఠాలు

రైలు మండిపోతోందన్న వదంతి కారణంగా ఇటీవల పన్నెండు మంది ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైనది. లఖ్‌నవూ–ముంబై పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు రేగాయని, వ్యాపిస్తున్నాయని ఓ గాలి వార్త ప్రచారంలోకి రావడంతో అందులో ప్రయాణిస్తున్నవారంతా తీవ్ర భయాందోళనలకు గురైనారు. మంటలు తమవరకూ వస్తాయని భయపడిన ప్రయణీకులు అలారం చెయిన్ లాగి రైలును నిలిపివేసి హడావుడిగా దిగిపోయారు. ఈ క్రమంలో వారు పక్కన ఉన్న మరో ట్రాకుమీదకు చేరడం వారి పాలిట శాపమైంది. ఆ ట్రాక్‌మీద గంటకు నూటనలభై కిలోమీటర్ల వేగంతో వచ్చిన బెంగుళూరు–న్యూఢిల్లీ కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు వారిని ఢీకొనడంతో దేహాలన్నీ నుజ్జునుజ్జయినాయి. అగ్నిప్రమాదం నుంచి తమను తాము రక్షించుకున్నామని అనుకున్నవారు ఇలా క్షణాల్లో మరో విధంగా ప్రాణాలు కోల్పోవలసి రావడం విచిత్రం. అది మలుపు ప్రాంతం కావడంతో జనం ట్రాకులమీద ఉన్న విషయం కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ ముందుగా గుర్తించలేకపోయాడని, గమనించిన వెంటనే బ్రేకులు అదిమినా ఈ ఘోరం జరిగిపోయిందని అంటారు. బ్రేకులు వేయనిపక్షంలో ప్రమాద తీవ్రత మరింత హెచ్చుగా ఉండేదన్నది నిజం. చెయిన్‌లాగడంతో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ ఆగిందన్న విషయాన్ని ఎదురుగా వస్తున్న రైళ్ళకు తెలిసేలా ఫ్లాష్‌లైట్ కూడా వేశారట. అయితే, ఈ మొత్తం గందరగోళానికీ, ఘోరానికీ మూల కారణం పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు రేగాయన్న దుష్ప్రచారం. బాధ్యులు ఎవ్వరో దర్యాప్తులో తేలవచ్చును కానీ, వదంతి పూర్తిగా నిరాధారమైనదైతే కాదు. జనరల్ కంపార్ట్‌మెంట్ బ్రేకులు సరిగా లేకపోవడంతో ఆరంభంనుంచి ప్రయాణీకులు ఆందోళనచెందుతూనే ఉన్నారు. బ్రేకులు పడినప్పుడల్లా అవి చక్రాలను గట్టిగాపట్టుకొని మళ్ళీవదలకపోవడం, విపరీతంగా వేడెక్కి నిప్పులు వెదజల్లడం, పొగలు, కాలినవాసన రావడం వంటివి ప్రయాణీకులను భయపెట్టినమాట నిజం.

మృతులకు, బాధితులకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం ప్రకటించాయి, గాయపడినవారికి వైద్యచికిత్స కూడా అందుతోంది. ఖరీదైన రైళ్ళకు ఉండే ఆటోమేటిక్ డోర్లు ఇటువంటి సాదాసీదా రైళ్ళకు ఉండవు కనుక గ్రామీణ ప్రయాణీకులు చెయిన్ లాగి దిగిపోవడం వంటి ప్రమాదకర విన్యాసాలు కూడా సులువుగా చేయగలుగుతున్నారు. రైలు ఆగిన తరువాతే డోర్లు లాక్ తెరుచుకోగలిగే వ్యవస్థ జనరల్ రైళ్ళకు కూడా ఉంటే, భారతదేశంలో తరచుగా సంభవించే ఈ తరహాప్రమాదాలను నివారించవచ్చు. తాము ప్రయాణిస్తున్న రైళ్ళు భద్రంగా ఉన్నాయన్న నమ్మకం ఈ దేశ ప్రజల్లో ఇప్పటికీ ఏర్పడినట్టు లేదు. క్షేమంగా ఇంటికి చేరతామన్న భరోసా కానీ, ఎక్కిన రైలుమీద నమ్మకంకానీ లేకపోవడంతో వదంతులు అగ్గిరాజేస్తున్నాయి. ఎవరో పూలమ్ముకొనే ఓ కుర్రాడు అరిచిన అరుపును తప్పుగా అర్థంచేసుకున్నందువల్ల 2017లో ముంబై ఎల్ఫిన్‌స్టోన్ బ్రిడ్జి ప్రమాదం జరిగి, పాతికమంది ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని అంటారు. రైలుప్రమాదాలు వరుసగా జరుగుతూ అవే వార్తలు వింటూ ప్రజల్లో ఒక రకమైన భయం ఆవహించివున్న నేపథ్యం కూడా తాము స్వయంగా ప్రయాణిస్తున్న సందర్భాల్లో తప్పటడుగులకు దారితీస్తుంది. చాలా రైలు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణమని అధికారులు తేల్చేయడం జరుగుతున్నప్పటికీ, నిర్వహణ లోపం కూడా అందుకు దోహదపడుతున్న మాట నిజం. ఈ రైలులో బ్రేకింగ్ వ్యవస్థ నిర్వహణ అధమంగా ఉండటంతో విపరీతమైన శబ్దాలతో, చక్రాలు ఊగుతూ, నిప్పులు చిమ్ముతూ ప్రయాణీకులు భయభ్రాంతులు కావడం అంతిమంగా ఈ ప్రమాదానికి దారితీసింది. వదంతిని నమ్మినందుకు ప్రయాణీకులను తప్పుబట్టి, ఈ ఘోరానికి దారితీసిన మిగతా అంశాలను వెనక్కునెట్టేయడం సరికాదు. రైల్లో ఉన్న ప్రతీ ప్రయాణీకుడినీ భద్రంగా ఒడ్డుకు చేర్చాల్సిన బాధ్యత రైల్వేశాఖమీద ఉంది. ఎనౌన్స్‌మెంట్ వ్యవస్థ గనుక ఈ రైలులో ఉండివుంటే, అగ్గిఅంటుకుందన్న వదంతి మరింత వ్యాపించకుండా ఆపగలిగేవారేమో. దేశంలో ఇటీవల వరుసగా జరుగుతున్న రైలు దుర్ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతీ ప్రమాదం నుంచి పాఠాలు నేర్చుకోవాలి, పరిష్కారాలు అన్వేషించాలి.

జనాభావృద్ధితో రాజకీయ అంతరాలు



> ఇప్పటికే లోక్‌సభలో ఉత్తర భారతావని ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. రేపు నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ జరిగితే ఉత్తరాది రాష్ట్రాల్లో మరిన్ని ఎక్కువ లోక్‌సభ నియోజకవర్గాలు ఏర్పడతాయి. అప్పుడు దక్షిణాది ఓటర్ల మనోభావాలకు పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఉండదు.

సంతానం లేకపోతే వంశం అంతరించి పోతుందని గతంలో కొందరు ఆందోళన చెందేవారు. సంతానోత్పత్తి ఆగిపోతే దేశాలే అంతరించి పోతాయనే ఆందోళన ఇటీవల వినిపిస్తోంది. సంతానోత్పత్తి లేమితో అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న దేశాల్లో దక్షిణ కొరియా ముందు పీఠిన ఉంది. ఆ తరువాత తైవాన్, జపాన్, ఇటలీ, స్పెయిన్ దేశాలున్నాయి. ప్రపంచంలో మరెన్నో దేశాలకూ ఇలాంటి ముప్పు పొంచి ఉందని జనాభా శాస్త్రవేత్తలు గణాంకాలు తీసి హెచ్చరిస్తున్నారు.

జనాభా పెరుగుదల మీద మనలో అనేక తప్పుడు అభిప్రాయాలు కొనసాగుతున్నాయి. వీటికి పునాది థామస్ రాబర్ట్ మాల్థూస్ 1798లో 'జనాభా సూత్రం' అనే శీర్షికతో రాసిన ఒక వ్యాసం. మాల్థూస్‌ను జనాభా శాస్త్రవేత్తగా, ఆర్థికవేత్తగా పేర్కొంటారు గానీ ఆయన ప్రధానంగా మతగురువు. కొన్ని లక్షల మంది చనిపోయే విపత్తులు ఎందుకు సంభవిస్తున్నాయని అడిగే సందేహపరులను ధార్మికంగా సమాధానపరచడానికి ఆయనొక సిద్ధాంతాన్ని కనిపెట్టారు. ఆహారోత్పత్తి నిదానంగానూ, జనాభా వేగంగానూ పెరుగుతాయనేది ఆ సిద్ధాంత సారం అని అర్థశాస్త్రం విద్యార్థులు తొలి పాఠాల్లోనే చదివి ఉంటారు. భూమికి ఉన్న ఆహారోత్పత్తి సామర్థ్యం కన్నా మనుషుల సంతానోత్పత్తి సామర్థ్యం పెరిగిపోయినపుడు ఏర్పడే 'అదనపు జనాభా'ను తొలగించడానికి విపత్తులు సంభవిస్తాయి అన్నాడాయన. దీనినే మాల్థూస్ మహావిపత్తు సిద్ధాంతం అంటారు.

మాల్థూస్ ఈ సూత్రీకరణ చేసే నాటికే ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం పుంజుకుంటోంది. ఆ పరిణామాల్ని ఆయన పట్టించుకోలేదు. కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలయిన కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ మాత్రమేగాక, పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించిన ఉపయోగితావాదులు, ఫలితవాదులు అయిన జాన్ స్టూవర్ట్ మిల్, విలియం గాడ్విన్ వంటి వారు సహితం మాల్థూస్ సిద్ధాంతాన్ని గట్టిగానే విమర్శించారు. కొన్ని వాస్తవాలను గమనించి మాల్థూస్ ఒక తర్కాన్ని రూపొందించాడు. కానీ, అవి సంపూర్ణ వాస్తవాలు కావని కొందరు తప్పుపట్టారు. మనిషికి జ్ఞానం, విజ్ఞానం రెండూ ఉంటాయి. జ్ఞానంతో సంతానోత్పత్తిని అదుపు చేసుకోగలడు; విజ్ఞానంతో ఆహారోత్పత్తిని పెంచగలడు అన్నవారూ ఉన్నారు. అవసరం ఆవిష్కరణకు తల్లి వంటిది కనుక, ఆహార అవసరాల్ని కొత్త ఆవిష్కరణలతో మనిషి అధిగమిస్తాడని ఆశాభావాన్ని వ్యక్తం చేసినవారున్నారు. మానవజాతికి ఉన్న ఉత్పాదకశక్తి అపారమైనది. అవసరాన్ని బట్టి అది విజృంభిస్తుందన్నాడు ఏంగిల్స్. సమస్య, ఆహారోత్పత్తి జరక్కపోవడం కాదు; ఉత్పత్తి అయిన ఆహారాన్ని సమంగా పంపిణీ చేయకపోవడం అన్నాడు మార్క్స్. ఆయన అంతటితో ఆగలేదు. సంపద ఒకచోట పోగుపడడానికి మిగులు జనాభా ఒక అవసరమైన ఉత్పత్తి అవుతుందన్నాడు.

145 కోట్ల జనాభా అనేది ప్రపంచంలోనే అతి పెద్దది కావచ్చుగాక, మనందరికీ మూడు పూటలా తిండి పెట్టగల సామర్థ్యమున్న భూమి మనది. మన దేశంలో నిర్వహణ లోపం కారణంగా ఉత్పత్తి అయిన ఆహారధాన్యాల్లో 25 నుంచి 30 శాతం వృథా అయిపోతున్నాయి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల ఉత్పత్తిలో 50 శాతం కుళ్లిపోతున్నాయి. మన దేశం నుంచి ఆహారధాన్యాలు ఎన్ని లక్షల టన్నులు అక్రమంగా రవాణా అవుతున్నాయో ఇటీవల కొన్ని కేసులు బయటపడి కళ్ళు తెరిపించాయి. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ఆఫ్రికాకు బియ్యాన్ని దొంగరవాణా చేస్తున్న ఓడను అడ్డుకోవడం వాటిల్లో ఒకటి మాత్రమే. ఇంతటి అదనపు ఆహారోత్పత్తి ఉన్నప్పటికీ ప్రపంచంలో పౌష్టిక ఆహార లోపంతో బాధపడుతున్న ప్రజలు భారత దేశంలో ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయ నివేదికలు చెపుతున్నాయంటే లోపం ఎవరిదీ? పంటలదా? పంపిణీలదా?

నిల్వ ఉంచడానికి తగిన గిడ్డంగులు లేక దేశమంతటా ఆహారధాన్యాలు ముక్కిపోతున్నాయని 2010లో అనేక వార్తలు వచ్చాయి. వాటి మీద స్పందించిన సుప్రీంకోర్టు ఆ ఏడాది ఆగస్టు 12న ఆ ఆహారధాన్యాలను అవసరమైన వారికి ఉచితంగా పంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఆగస్టు 19న కోర్టు ముందు హాజరైన అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్, ప్రభుత్వం అనేక పథకాల ద్వారా పేదలకు సబ్సిడీ ధరకు ఆహారధాన్యాలను పంపిణీ చేస్తున్నదని విన్నవించుకున్నారు. దానితో సంతృప్తి చెందని కోర్టు ఆగస్టు 12 నాటి ఆదేశాలను పాటించి తీరాలని స్పష్టం చేసింది.

జనాభాను నియంత్రించాలని ఐక్యరాజ్యసమితి 1968 మే 13 నాటి టెహ్రాన్ ప్రకటనలో తొలిసారిగా పేర్కొంది. అంతకు 16 ఏళ్ల ముందే 1952లో భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణ పథకాన్ని రూపొందించింది. ఏ కొత్త పథకానికి అయినా సరే మతం రంగు పులిమేయడానికి కొందరు సిద్ధంగా ఉంటారు. వాళ్ళు మనదేశానికి ప్రత్యేకం కావచ్చు. 'మనం ఇద్దరం; మనకు ఇద్దరు' అనే నినాదాన్ని వాళ్లు 'హమ్ పాంచ్, హమారే పచ్చీస్'గా మార్చి ముస్లిం విద్వేషాన్ని ప్రచారం చేశారు. మాల్థూస్ మాటల్ని దేశంలో హిందూ జనాభా నిదానంగానూ, ముస్లిం జనాభా వేగంగానూ పెరుగుతున్నాయన్నట్లు మార్చారు. సమీప భవిష్యత్తులో భారతదేశం ముస్లిం దేశంగా మారిపోతుందని భయపెట్టారు. ఈ పని చేసింది చిన్నాచితక వాళ్ళు కాదు. సాక్షాత్తు దేశాధినేతలు అయినవారే ఈ రకం ప్రచారానికి సారథ్యం వహించారు.

ప్రపంచ గణాంకాల ప్రకారం జనాభాలో సగటున రెండు శాతం మంది ప్రతి ఏటా చనిపోతారు. ఆ లోటును భర్తీ చేయడానికి కనీసం 2.1 శాతం పిల్లలు ప్రతి ఏటా పుట్టాలి. అలా జరక్కపోతే ఏ దేశంలో అయినా సరే అనేక అనర్థాలు జరిగిపోతాయి. ఉత్పత్తి విరమణ చేసిన వృద్ధుల శాతం పెరిగిపోతుంది; ఉత్పత్తి చేయడానికి రంగప్రవేశం చేయాల్సిన కొత్త తరం పుటుక తగ్గిపోతుంది. దేశ జనాభా పెరుగుదలను స్త్రీల స్థూల సంతానోత్పత్తి సామర్థ్యంతో అంచనా వేస్తారు. స్త్రీలు జీవితకాలంలో సగటున ఎంతమందికి జన్మనిస్తున్నారు అనేది కొలమానం. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఈ నివేదికల్ని రూపొందిస్తుంటుంది. ఈ సంస్థ 2019–21లలో నిర్వహించిన సర్వేల్లో భారత సగటు టిఎఫ్ఆర్ 2 అని తేల్చింది. అంటే కనీస స్థాయి కన్నా తక్కువగా ఉందని అర్థం. ఇందులో హిందూ స్త్రీల టిఎఫ్ఆర్ 1.94 ఉండగా, ముస్లిం స్త్రీల సామర్థ్యం 2.36 ఉందని తేల్చారు. క్రైస్తవ, బౌద్ధ, జైన స్త్రీల టిఎఫ్ఆర్ వరుసగా 1.88, 1.61, 1.39 ఉందట.

ఆర్థిక స్తోమతకు సంతానోత్పత్తికి విలోమ నిష్పత్తి ఉంటుందని గణాంకాలు చెపుతున్నాయి. సాధారణంగా మధ్యతరగతి ఆపైన ఉండే ఆర్థిక సమూహాలు ప్రణాళికబద్ధ కుటుంబాలను రూపొందించుకుంటాయి. పేద వర్గాలకు అలాంటి ఆలోచనలు ఉండవు. ఆ సమూహాల్లో సంతానోత్పత్తి అధికంగా ఉంటుంది. ప్రపంచంలో అత్యంత పేద దేశం అయిన సోమాలియలో టిఎఫ్ఆర్ 6.12. ఇది ప్రపంచంలోనే అత్యధికం. విచిత్రం ఏమంటే ముస్లిం ఛాందస దేశాలనిపించే ఇరాన్, సౌదీ అరేబియాల్లో టిఎఫ్ఆర్ 2, 2.31 మాత్రమే ఉంది.

లాభాల వేటలో పడిన పెట్టుబడిదారులు నిరంతరం అధికోత్పత్తిని చేసే యంత్రాలను ప్రవేశపెడుతుంటారు. ఆ కొత్త యంత్రాలు తమను సృష్టించిన కార్మికుల్నే స్థానభ్రంశానికి గురిచేస్తాయి. అప్పటి వరకు ఉపాధి గలవారు మరునాడు నిరుద్యోగులుగా మారిపోతారు. ఈ పాపం పెట్టుబడిదారుల అత్యాశది. కానీ వాళ్ళు దాన్ని ఒప్పుకోరు. జనాభా పెరిగిపోతున్నదని రోడ్డెక్కి గావుకేకలు పెడతారు. బయట నిరుద్యోగుల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే అంత చవకగా వాళ్ళకు శ్రామికులు రిజర్వు సైన్యంగా అందుబాటులో ఉంటారు. ఇదొక పెద్ద వలయం. పేదరికాన్ని సృష్టించే వారే పేదల్ని విమర్శిస్తుంటారు.

దేశంలో ముస్లిం పురుషులు తలా పాతిక మంది పిల్లల్ని కంటున్నారనడం ఒక అభూత కల్పన. టిఎఫ్ఆర్‌లో 1.94–2.36ల మధ్య ఉన్న ఆ కొద్దిపాటి ఆధిక్యత కూడా భారత ముస్లిం సమాజపు పేదరికాన్ని సూచిస్తోంది. టిఎఫ్ఆర్ తేడాలు ప్రాంతీయ విభేదాలను కూడా సృష్టిస్తాయి. దక్షిణాదివారు కుటుంబ నియంత్రణను పాటించినట్టు ఉత్తరాదివారు పాటించలేదు. దక్షిణాదికి చెందిన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో టిఎఫ్ఆర్ 1.7గానూ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 1.8గానూ ఉంది. మరోవైపు, ఉత్తరాదికి చెందిన బిహార్‌లో 2.9గానూ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా 2.4, 2.3, 2.2గానూ ఉంది. దీనర్థం ఏమంటే, దక్షిణాది జనాభా నిదానంగా పెరుగుతుంటే, ఉత్తరాది జనాభా వేగంగా పెరుగుతోంది. ఇప్పటికే లోక్‌సభలో ఉత్తరాది ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. రేపు నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ జరిగితే ఉత్తరాది రాష్ట్రాల్లో మరిన్ని ఎక్కువ లోక్‌సభ నియోజకవర్గాలు ఏర్పడతాయి. అప్పుడు దక్షిణాది ఓటర్ల మనోభావాలకు పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఉండదు.

కుటుంబ నియంత్రణను చైనా చాలాకాలం బలవంతంగా అమలు చేసింది. 2022లో సగటు టిఎఫ్ఆర్ 1.18కు పడిపోవడంతో చైనా పాలకులు బెంబేలెత్తిపోయారు. ఇప్పుడు ఎక్కువమంది పిల్లల్ని కనండి అని బతిమాలుతున్నారు. ఆ పరిస్థితి రాకముందే మనం కళ్ళు తెరవాలి.

■ డానీ
సమాజ విశ్లేషకులు

డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త ఆంక్షలు, సుంకాలకు ప్రతిస్పందనగా కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో చేసిన ఆగ్రహ ప్రకటన ఇది.

కొలంబియా ధిక్కారం

ట్రంప్,

అమెరికా రావడం నాకేమంత సంతోషాన్నిచ్చే విషయంకాదు. నిజానికి, కొంత విసుగు కూడా వస్తుంది. అయితే, కొన్ని నచ్చిన విషయాలు కూడా లేకపోలేదు. వాషింగ్టన్ నగరంలో నల్లజాతి ప్రజలు నివసించే ప్రాంతాలని సందర్శించడం నాకు అక్కడ ఇష్టం. అమెరికా రాజధాని నగరంలో బారికేడ్లతో నల్లజాతి ప్రజలు, లాటినో ప్రజల మధ్య ఘర్షణని నేను చూశాను. వారూ వీరూ ఏకం కావాల్సి ఉంది కాబట్టి, ఆ ఘర్షణ అర్థంలేనిది.

కవి వాల్ట్ విట్మన్, వాగ్గేయకారుడు పాల్ సైమన్, మేధావి నోమ్ చామ్‌స్కీ, నవలా రచయిత హెన్రీ మిల్లర్ అభిమానిని నేను. నా రక్త సంబంధీకులైన శాకో, వాంజెట్టిలు అమెరికా చరిత్రలో చిరస్మరణీయులు. వాళ్ళ వారసత్వాన్ని నేను అనుసరిస్తాను. కార్మిక నాయకులు అయినందుకు వాళ్ళని అమెరికాలోని ఫాసిస్టులు మరణశిక్ష విధించి చంపేశారు. అలాంటి ఫాసిస్టులే మా దేశంలోనూ ఉన్నారు.

ట్రంప్, మీ దేశపు చమురు అంటే నాకు అసహ్యం. అది దురాశతో మానవాళికి చేటు కలిగిస్తుంది. నాకు జీర్ణాశయవ్యాధి ఉంది గనక తాగకూడదు. అయినా, ఏదో ఒకరోజు విస్కీ తాగుతూ, మనం దీని గురించి సూటిగా మాట్లాడుకోవచ్చు. అయినా, అది సాధ్యం కాదేమో. మీరు కొలంబియన్లని హీనజాతికి చెందినవాళ్ళని అనుకుంటూ ఉంటారు. మేము హీనులం కాదు. కొలంబియన్లు ఎవరూ హీనజాతీయులు కాదు.

మీరు ఒక మొండి ఘటం కోసం చూస్తుంటే, ఆ వ్యక్తిని నేనే. ఇందులో వేరే మాట లేదు. మీ ఆర్థిక బలిమితోటి, మీ దురహం కారంతోనూ అల్లెండీ ప్రభుత్వాన్ని కూల్చినట్టు, నా ప్రభుత్వాన్ని కూడా కూల్చే కుట్రకి తెరదీయవచ్చు. కానీ, నేను నా విశ్వాసాలకి దృఢంగా కట్టుబడతాను. నేను చిత్రహింసలని ప్రతిఘటించాను. మిమ్మల్ని కూడా ఎదిరిస్తాను. మేము చాలామందిని భరించాం, మా స్వేచ్ఛని సాధించుకున్నాం. కొలంబియాలో స్వేచ్ఛాప్రియులు ఉండాలని నేను కోరుకుంటాను. మీరు కలిసిరాకపోతే, నేను ఇతర దేశాలవైపు చూస్తాను. కొలంబియా ప్రపంచం మధ్యలో ఉంది. ఇది పసుపుపచ్చ సీతాకోక చిలుకల దేశం, ఔరెలియానో బెండియా వంటి సేనానాయకుల దేశం. ఆ పరంపరకు చెందివాడినే నేను. బహుశా ఆఖరువాడినేమో.



> ట్రంప్, మీరు కొలంబియన్లని ఒక హీనజాతికి చెందినవాళ్ళని అనుకుంటూ ఉంటారు. మేము హీనులం కాదు. నేను ధిక్కార పతాకాన్ని ఎగరవేస్తున్నాను. నేను ఒంటరిగానే నిలబడినా, మా పూర్వీకుడు గైటాన్ చెప్పినట్లు ఈ జెండా లాటిన్ అమెరికన్ ఆత్మగౌరవంతో తలెత్తుకుని సగర్వంగా నిలబడుతుంది. అమెరికా దేశాధిపతీ, మీ పూర్వీకులు అమెరికాకి వలస వచ్చిన మనుషులు. మీ దిగ్బంధం మమ్మల్ని భయపెట్టబోదు.

మీరు నన్ను హత్య చేయవచ్చు. కానీ, నేను నా జనంలో జీవించి ఉంటాను. మేము అమెరికా దేశాలలో మీకంటే ముందునుంచే జీవిస్తూ ఉండిన జనాలం. గాలీ, పర్వతాలూ, కరీబియన్ సముద్రమూ, స్వేచ్ఛా కలగలిసి ఊపిరిపోసుకున్న ప్రజలం మేము. మీకు మా స్వేచ్ఛ అంటే నచ్చదు. సరే. నేను శ్వేత జాతికి చెందిన బానిస యజమానులతో కరచాలనం చేయబోను. శ్వేతజాతికి చెందిన స్వేచ్ఛాప్రియులతోటీ, అబ్రహాం లింకన్ వారసులతోటీ, అమెరికాలోని నల్ల రైతులు, శ్వేతజాతి రైతులతోటీ చేయి కలుపుతాను. కోవిడ్ నుంచి బతికి బట్టకట్టాక, ఇటలీ టుస్కనీ పర్వతాల అవతల యుద్ధరంగాన్ని చేరుకున్న తర్వాత వాళ్ళ సమాధుల దగ్గర నేను కన్నీరు కార్చాను, ప్రార్థనలు చేశాను. అమెరికా అంటే, నా దృష్టిలో వాళ్ళు మాత్రమే. వాళ్ళకే నేను తల వంచుతాను. మరెవ్వరికీ కాదు. దేశాధిపతీ, నన్ను పడగొట్టు. అమెరికా దేశాల ప్రజలూ, మానవాళీ స్పందిస్తారు.

కొలంబియా ఇక ఉత్తర దిశవైపు చూడదు. ప్రపంచం వైపు చూస్తుంది. కొర్డోబా ఖలీఫా నాగరికతలో మా మూలాలు ఉన్నాయి. రిపబ్లిక్‌ని ఏర్పాటుచేసిన మధ్యధరా ప్రాంత రోమన్ లాటిన్ జనాలలోనూ, ప్రజాస్వామ్యాన్ని స్థాపించిన ఏథెన్స్ జనాలలోనూ మా మూలాలు ఉన్నాయి. మీరు ఇక్కడికి బానిసలుగా కొనితెచ్చిన నల్ల జాతీయుల ప్రతిఘటనా స్ఫూర్తి మా రక్తంలో ప్రవహిస్తుంది. వాషింగ్టన్ నగరం నిర్మాణమయినదానికంటే ముందే, అమెరికా దేశాలన్నిటిలో స్వేచ్ఛాయుతంగా పరిఢవిల్లిన ప్రాంతం కొలంబియా. అక్కడ, ఆ నల్లజాతి ప్రజల ఆఫ్రికా గీతాలలో నేను సేదదీరుతూ ఉంటాను.

ఈజిప్షియన్ ఫారోల కాలంలోనే హస్తకళలు వికసించి, చిరిబికెట్ తొలి చిత్రకారులు నడయాడిన నేల మాది. మీరు మమ్మల్ని ఎప్పటికీ శాసించలేరు. స్వేచ్ఛ కోసం గర్జించి, సైమన్ బొలివర్ నాయకుడై కాపాడిన సీమ మాది. మా ప్రజలు కొంచెం భయస్థులు, సిగ్గరులు, అమాయకులు, దయగల మనుషులు. మా నుంచి మీరు దౌర్జన్యంగా లాక్కున్న పనామా కాలువని తిరిగి ఎలా స్వాధీనం చేసుకోవాలో మా జనాలకు తెలుసు. ఒకనాడు కొలంబియాగా, ఇప్పుడు పనామాలో భాగంగా కొనసాగుతున్న బొకాస్ డెల్ టోరో ప్రాంతంలో మీరు హతమార్చిన రెండువందల మంది లాటిన్ అమెరికా యోధులు అక్కడే విశ్రమిస్తున్నారు.

నేను ధిక్కార పతాకాన్ని ఎగరవేస్తున్నాను. నేను ఒంటరిగానే నిలబడినా, మా పూర్వీకుడు గైటాన్ చెప్పినట్లు ఈ జెండా లాటిన్ అమెరికన్ ఆత్మగౌరవంతో తలెత్తుకుని సగర్వంగా నిలబడుతుంది. అమెరికా దేశాధిపతీ, మీ పూర్వీకులు అమెరికాకి వలస వచ్చిన మనుషులు. మీ దిగ్బంధం మమ్మల్ని భయపెట్టబోదు. కొలంబియా అందమైన దేశం మాత్రమే కాదు, అది భూమికి మధ్యలో, ప్రపంచపు హృదయమై వుంది.

ఈ రోజు నుంచి కొలంబియా ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. చేతులు చాచి అందరినీ ఆహ్వానిస్తున్నది. మేము స్వేచ్ఛ, జీవితం, మానవతా నిర్మాతలం. మా శ్రమ ఫలితంగా అమెరికాలో ప్రవేశించే వస్తువుల పైన మీరు 50శాతం సుంకం విధించబోతున్నారని తెలిసింది. మేమూ అదే పని చేస్తాము. మా ప్రజలు ఇక మొక్కజొన్న పండిస్తారు. మొక్కజొన్న పంటని కనిపెట్టింది కొలంబియాలోనే. మా ప్రజలు మొక్కజొన్నతో ప్రపంచం కడుపునింపుతారు.

అనువాదం: సుధాకిరణ్

సుప్రీంకోర్టుకు 75 ఏళ్లు

1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజునే సుప్రీంకోర్టు ఏర్పడినా, దాని కార్యకలాపాలు మాత్రం జనవరి 28న ప్రారంభమయ్యాయి. అంటే ఇప్పటికి 75 సంవత్సరాల క్రితం. ఈ కాలాన్ని ఇంగ్లీషులో 'డైమండ్ జూబ్లీ'గా పిలుస్తారు. ఇంగ్లీషులో 60 సంవత్సరాల కాలాన్ని కూడా ఇలాగే పిలుస్తారు. తెలుగులో వజ్రోత్సవాలు అన్నా, ఇటీవల ఈ కాలాన్ని 'అమృతోత్సవాలు'గా కూడా పిలుస్తున్నారు. 1950లో సుప్రీంకోర్టు ఏర్పడక ముందు 1937 నుండి 1950 వరకు ఫెడరల్ కోర్టుగా దీన్ని వ్యవహరించేవారు. ఇంకా ముందు దేశంలోని వివిధ హైకోర్టు తీర్పులపై అప్పీళ్లకు లండన్‌లోని ప్రివీ కౌన్సిల్‌కి ఎంతో వ్యయప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. దాంతో మహమ్మద్ ఆలిజిన్నా, హరిసింగ్ గౌర్‌లు భారతదేశంలోనే సర్వోన్నత న్యాయస్థానం ఉండాలనే ఆలోచనకు బీజం వేశారు. న్యాయవాదులంతా సహజంగానే సానుకూలంగా స్పందించారు. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఫెడరల్ కోర్టు ఆవిర్భవించింది.



సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హెచ్.జె. కనియా, న్యాయమూర్తులుగా జస్టిస్ ఫజల్ ఆలి, జస్టిస్ పతంజలి శాస్త్రి, జస్టిస్ మెహర్‌చంద్ మహాజన్, జస్టిస్ బిజన్ కుమార్ ముఖర్జి, జస్టిస్ యస్.ఆర్‌లు వ్యవహరించారు. అంతకుముందు 1937–47ల మధ్యకాలంలో కేవలం ముగ్గురు న్యాయమూర్తులకు మించి ఎప్పుడూ లేరు. పైగా ప్రధాన న్యాయమూర్తి ఖచ్చితంగా ఆంగ్లేయుడే ఉండేవాడు. 1950 జనవరి 28న పార్లమెంటు భవనంలోని ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్‌లో తొలి విచారణ జరిగింది. ఏడాదికి మొదట 28 రోజులు పనిచేసిన కోర్టు, క్రమంగా 190 పనిదినాల స్థాయికి చేరింది. ఏడుగురు న్యాయమూర్తులతో ప్రారంభమై ప్రస్తుతం 34కు చేరింది. ఆవిర్భవించిన 39 సంవత్సరాలకు తొలి మహిళా న్యాయమూర్తిగా ఫాతిమా బీవీ 1989లో నియమితులయ్యారు. ఇంతవరకు మహిళ ఎవరూ ప్రధాన న్యాయమూర్తి కాలేదు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2027 సెప్టెంబర్‌లో జస్టిస్ నాగరత్న ప్రధాన న్యాయమూర్తి అవుతారు. ప్రస్తుతం ముగ్గురు మహిళలు న్యాయమూర్తులుగా ఉన్నారు.

ప్రస్తుతం తిలక్‌మార్గ్‌లో ఉన్న సుప్రీంకోర్టు భవనాన్ని 1954 అక్టోబర్ 29న శంకుస్థాపన చేసి, 1958 ఆగస్టు 4న తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. సారనాథ్‌లోని అశోకుడి ధర్మచక్రాన్ని లోగోగా స్వీకరించారు. 'యత ధర్మః తతో జయః' అన్న సూక్తి ఈ చిహ్నంలో ఉంటుంది. న్యాయం ఎక్కడ ఉంటే విజయం అక్కడే ఉంటుంది అని దాని అర్థం. మన తెలుగు వారైన కోకా సుబ్బారావు, నూతలపాటి వెంకటరమణలు ప్రధాన న్యాయమూర్తులుగా పని చేశారు. ఈ డెబ్బయి ఐదేళ్ల కాలంలో కోకా సుబ్బారావు, పతంజలి శాస్త్రి, వి.ఎస్. బోస్, కపాడియా, కృష్ణయ్యర్, చిన్నపురెడ్డి, వశిష్ట భార్గవ, గజేంద్ర గడ్కర్, హెచ్.ఆర్. ఖన్నా లాంటి నీతివంతమైన మహామహుల్ని చూసిన సుప్రీంకోర్టు, తమ స్థాయికి సరిపోని పదవుల్ని ఆశించే అధముల్ని కూడా చూసింది. రాజ్యాంగ మౌలిక సూత్రాల్ని విస్మరించి, మార్చే అధికారం పార్లమెంటుకు లేదని కేశవానంద భారతి కేసు సాక్షిగా కత్తి ఝళిపించిన సుప్రీంకోర్టు, దేశ లౌకికత్వాన్ని దెబ్బతీసే కేసుల్లో 'భట్టిప్రోలు పంచాయితీ' చేసే స్థాయికి జారిపోయింది. మున్ముందు సర్వస్వతంత్ర వ్యవస్థగా క్రియాశీలక న్యాయవ్యవస్థను తీర్చిదిద్దే ఆలయంగా సర్వోన్నత న్యాయస్థానం మారాలని ఈ శుభసందర్భంలో కోరుకుందాం.

– చెరుకూరి సత్యనారాయణ

శ్రీకాళహస్తిలో కమ్యూనిస్టు కేతనం

బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం విజయం సాధించటం ప్రపంచ చరిత్రలోనే అపూర్వ సంఘటన. ప్రజా సంకల్పబలానికి, పోరాట పటిమకు జాతీయోద్యమం నూతన భాష్యం చెప్పింది. మానవ చరిత్రలో సామాన్య ప్రజలు సాగించిన మహోజ్వల పోరాటాల్లో అద్వితీయ స్థానాన్ని సంపాదించుకుంది. 1885 నుంచి 1947 వరకూ వివిధ దశల్లో సాగిన జాతీయోద్యమం వివిధ వర్గాల ప్రజల శక్తియుక్తులను తనలో ఇముడ్చుకోగలిగింది.

జాతీయోద్యమ వాతావరణంలో ఎదిగిన పసుపులేటి వెంకటప్పయ్య ఒక సామాన్య కుటుంబంలో పుట్టి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడంతో పాటు కమ్యూనిస్టు నాయకుడుగా ఎదుగుతూ ఉద్యమాలు చేసి చిత్తూరు జిల్లా తూర్పు మండలాల్లో విప్లవ కెరటంలా వెలుగొందాడు. శ్రీకాళహస్తి పట్టణంలో రాధాకృష్ణ, కమ్మలమ్మ దంపతులకు 1925 జనవరి 25న వెంకటప్పయ్య జన్మించాడు. ఎస్ఎస్ఎల్‌సి వరకు చదివాడు. చిన్నతనంలోనే కమ్యూనిస్టు భావాల్ని జీర్ణించుకొని జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. పదహారేళ్ల వయసులోనే 'తెల్లదొరలారా! ఇక మీ ఆటలు కట్టిపెట్టి ఇండియాను వదిలి ఇంగ్లండ్ పారిపోవాలి' అంటూ క్విట్ ఇండియా ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. చిత్తూరు జిల్లా తూర్పున తొలి తరం కమ్యూనిస్టు నాయకత్వానికి చుక్కానిలా నిలిచాడు. సీపీఎం జిల్లా ప్రప్రథమ కార్యదర్శిగానూ పనిచేశాడు. స్వాతంత్ర్య పోరాటంలో, కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. 17వ ఏట క్విట్ ఇండియా పోరాటం జరుగుతున్న సమయంలో శ్రీకాళహస్తి మీదుగా వెడుతున్న గూడ్సురైలు పట్టాలను అక్కుర్తి వద్ద తొలగించాడు. ఈ సంఘటనలో రైల్వేకి రూ.40వేల నష్టం సంభవించింది. దీంతో ఆయన్ని అరెస్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో రహస్య ప్రదేశంలో తలదాచుకున్నాడు. అయినా బ్రిటిష్ ప్రభుత్వం 1942లో వెంకటప్పయ్యను మూడు నెలల పాటు వేలూరు సెంట్రల్ జైల్‌లో, కొంతకాలం కడలూరు జైల్లో నిర్బంధించింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వెంకటప్పయ్యకు వెయ్యి రూపాయలు జరిమానా విధించడంతో ఆ డబ్బును కోర్టులో కట్టి జైలు నుంచి బయటికి వచ్చాడు. ఈయనకు వలె పసుపులేటి సుబ్బరామదాస్‌కు ప్రభుత్వం అక్కుర్తి డీరైల్‌మెంట్ కేసులో 1942 అక్టోబర్ 17న కఠిన కారాగారశిక్ష విధించి ఆలీపురం క్యాంప్ జైలులో కొంతకాలం బందీగా ఉంచి, తరువాత బళ్లారి వెల్లసీ శానిటోరియం జైలులో ఉంచింది. కడకు 1946 మార్చి 30న ఆయన విడుదలయ్యారు. అక్కుర్తి సంఘటనకు పసుపులేటి వెంకటప్పయ్య, పసుపులేటి సుబ్బరామదాస్, గున్నేరి నారాయణరెడ్డి, పి.డి. వీరాస్వామి, అప్పలకూటి వెంకటేశం, ఎస్. వెంకటసుబ్బయ్య, మార్కొండ సుబ్రమణ్యం, పి. వేణుగోపాల్, ఎస్. అనంతరామన్, పి. బాలగంగయ్య, మేలచ్చూరు కిష్టమ్మ, ఎల్. రామలింగారెడ్డి, నాగోలు సుబ్బారెడ్డి, నాగోలు ఈశ్వరరెడ్డి, రుమ్మాల అంకిరెడ్డి, జి. వెంకటరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తొండగంగడు, పోలుగాడు, కె. గుండయ్య (గున్నయ్య), వెంకాయల వెంకటయ్య, వెంకట్రాయలు, సంగవరం వెంకటరామ నాయుడు, ఇరగంటి పురుషోత్తం, ముచేలి వీరరాఘవ చెట్టి, కాళప్పనాయుడు.



కమ్యూనిస్టు నేతగా వెంకటప్పయ్య బందీ కావడానికి ముందు 17 సంవత్సరాల వయసులోనే కంచుపత్ర కార్మికసంఘం, చేనేత, బీడీ కార్మిక, పారిశుద్ధ్య కార్మికుల కోసం సంఘాలు ఏర్పాటు చేసి వారి సమస్యల కోసం పోరాటాలు నిర్వహించారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం వెంకటప్పయ్యపై నిఘా ఉంచింది. 1942లో శ్రీకాళహస్తి కమ్యూనిస్టు పార్టీ స్థాపించి కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారు. స్వాతంత్ర్యానంతరం 1948లో తన మేనత్త కుమార్తె తులసమ్మను వివాహం చేసుకున్నారు. తులసమ్మ కూడా భర్తనే అనుసరించింది. పత్రికలు ప్రాచుర్యంలో లేని ఆ రోజుల్లో చైనా దేశం నుంచి నెలనెలా వెంకటప్పయ్యకు పత్రికలు వచ్చేవి. తన భావాలను, ఉద్యమాలను పదిమందికీ తెలియజేయాలనే లక్ష్యంతో కరపత్రాల ముద్రణ కోసం సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ ముద్రణాయంత్రం ఇప్పటికీ ఆయన నివాసంలో ఉంది. జర్నలిజంపై మక్కువతో తన చిన్న కుమార్తెను ఆ రంగంలో ప్రవేశపెట్టారు. ఎమర్జెన్సీ కాలంలో వెంకటప్పయ్యపై నిఘా ఉంచడంతో ఒకటిన్నర సంవత్సరాలు మారువేషంలో తిరిగారు. ఆయన జీవితంలో ఎనిమిది సంవత్సరాలు జైలులోనే గడిపారు. 1958లో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎనిమిది రోజులు నిరాహారదీక్ష చేపట్టి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

1964లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నుంచి విడిపోవడంతో వెంకటప్పయ్య సీపీఎం వెంట నిలబడ్డారు. చిత్తూరు జిల్లా సీపీఎం ప్రప్రథమ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ముఖ్యంగా కంచుపత్ర ఉద్యమంలో కార్మికులకు అండగా నిలిచి ఎనలేని పోరాటాలు చేశారు. అప్పట్లో పానగల్ రైల్వే స్టేషన్ సమీపంలో పదుల కొద్దీ కంచుపత్ర ప్రైవేటు కర్మాగారాలు ఉండేవి. అక్కడ కార్మిక యూనియన్లు ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పోరాటాలు చేశారు. కాళంగి రిజర్వాయర్ నిర్మాణ క్రమంలో ముంపునకు గురయ్యే పొలాల రైతులతో కలసి పోరాటం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్యతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి వుండేవారు. సామాజిక రుగ్మతలను తొలగించడంలో కీలకపాత్ర పోషించారు. వెంకటప్పయ్యకు శ్రీకాళహస్తిలోని పాత మధు థియేటర్ (ప్రస్తుతం అమరజ్యోతి కల్యాణమండపం), రాధాకృష్ణా టూరింగ్ టాకీస్ (ఒకప్పటి వెంకటేశ్వర మహల్, ప్రస్తుతం చైతన్య స్కూల్)తో పాటు సినిమా వీధిలో నాలుగు గృహాలు ఉండేవి. అయితే తన పోరాటాల కోసం ఆస్తిని సైతం పోగొట్టుకున్నారు వెంకటప్పయ్య. 1962 శ్రీకాళహస్తి నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి బలరామరెడ్డి చేతిలో కేవలం 1100 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో కుప్పం నుంచి వజ్రవేలు శెట్టి, పుత్తూరు నుంచి శివయ్య, తంబళ్లపల్లి నుంచి సి.కె. నారాయణ రెడ్డి సీపీఎం తరఫున ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వెంకటప్పయ్య ఉపన్యాసానికి శత్రువులు కూడా చెవులప్పగించి వినేవారు. వెంకటప్పయ్య శ్రీకాళహస్తిలో స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎనలేని సేవలందించారు. 1996 నవంబర్ 28న శ్రీకాళహస్తిలో వెంకటప్పయ్య మరణించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, కమ్యూనిస్టు నేతగా నేటితరానికి ఆయన ఆదర్శనీయుడు.

◆ డా. ఎం. దీనదయాళ్
అకడమిక్ కన్సల్టెంట్, చరిత్ర శాఖ,
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

రాయితీ అవసరం

రైల్వే శాఖ ప్రస్తుతం సీనియర్ సిటిజన్‌లకు ఉన్న టికెట్ రాయితీ రద్దుచేసింది. కేవలం కింది బెర్త్ మాత్రమే కేటాయిస్తోంది. జనరల్ టికెట్ మినహా స్లీపర్, ఆపై తరగతులకు కనీసం కొంత శాతాన్ని ఇవ్వడం సీనియర్ సిటిజన్లను గౌరవించడమే కదా. 60–70 ఏళ్ల వాళ్ల ప్రయాణాలు తక్కువ ఉంటాయి. 70 దాటితే అవి చాలా అరుదు. వయస్సు మీరిన వారి వల్ల ఉత్పాదక ఉండదనే ఆలోచన సరైనది కాదు. పెన్షనర్లు ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడు అన్ని పన్నులు ప్రభుత్వానికి చెల్లించారు. ఇప్పుడు ఆరోగ్య బీమా వంటి పన్నులు చెల్లిస్తున్నారు. ఈ స్థితిలో పెన్షన్ అన్ని అవసరాలకు సరిపోదు. ఈ పరిస్థితులను ప్రభుత్వం వాస్తవ దృష్టితో చూసి, తగిన రక్షణ కల్పించడం భావ్యం. వృద్ధులకు వీలైనంత వరకు వైద్యం, ప్రయాణాలలో ఏదో విధమైన రాయితీ అత్యవసరం.

–బొల్లోజు మేఘనాథం
విశాఖపట్నం

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు 8లో

ప్రజా సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి మరో అడుగు

నేడు నగరంలోని 13వ డివిజన్, మచిలీపట్నం ఒకటో డివిజన్‌లో సమస్యలపై సదస్సులు

ప్రజల చెంతకే రానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నేరుగా సమస్యలు విన్నవించుకునే వెసులుబాటు



'అక్షరమే ఆయుధం'గా అక్షర సేద్యం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి' ప్రజా సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్ వాసులు తాగునీరు, వరదనీటి మళ్లింపు కాల్వలు (స్టామ్ వాటర్ డ్రెయిన్లు), గుంతలమయంగా ఉన్న రోడ్లు, భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ), దోమల, కుక్కల బెడద, విద్యుత్ సరఫరా, పార్కులు, పారిశుధ్యలోపం వంటి సమస్యలతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన 'ఆంధ్రజ్యోతి' అధికారులు, ప్రజాప్రతినిధులను ఆ ప్రాంతానికి తీసుకొచ్చేందుకు ఆటోనగర్ గేటు ఎదురు ఆర్టీసీ కాలనీ రామాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రజలు నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవచ్చు. ఆయా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు 'ఆంధ్రజ్యోతి' ప్రజలకు తోడుగా ఉంటుంది.

● కృష్ణాజిల్లా మచిలీపట్నం ఒకటో డివిజన్‌లోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, సోమలీల, దేవుడిచెరువు, ఆనందపేట, పీకేఎం కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. అధ్వానంగా రోడ్లు, పారుదలలేని మురుగు, కనీస వసతులు కరువైన పార్కు, వెలగని వీధి దీపాలు, కోతుల బెడద, నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసులతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని గుర్తించిన 'ఆంధ్రజ్యోతి' అధికారులు, ప్రజాప్రతినిధులను ఆ ప్రాంతానికి తీసుకొచ్చేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని మున్సిపల్ పార్కులో సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రజలు నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవచ్చు.

● అమ్మలా అండగా..



ఎన్టీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థులతో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

చల్లపల్లి మండలం పాగోలులో అనాథలు, పేదలకు విద్యనందిస్తున్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. క్లాస్ రూమ్, డిజిటల్ క్లాస్‌రూమ్, హాస్టల్ గదులను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్నత లక్ష్యాలు సాధించాలని, అమ్మ వలే అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

6లో

సూర్యఘర్ లక్ష్యం 1,10,000

» కలెక్టర్ లక్ష్మీశ 6లో


దారి మారింది..!

ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో స్వల్పంగా మార్పులు చేశారు. తుది డీపీఆర్ సిద్ధం చేసేలోపు ఈ మార్పులు, చేర్పులు జరిగాయి. అటవీ, కొండప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని అలైన్‌మెంట్‌లో మార్పులు జరిగాయి. మొత్తం తొమ్మిది లొకేషన్లను మార్చగా, రెండు లొకేషన్లలో మాత్రమే అలైన్‌మెంట్ బయటకు వచ్చింది. ఏడుచోట్ల లోపలికి జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలో ఐదు, కృష్ణాజిల్లాలో రెండు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండుచోట్ల అలైన్‌మెంట్ మార్పులు జరిగాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 చోట్ల

- ఎన్టీఆర్ జిల్లాలో 5, కృష్ణాజిల్లాలో 3 ప్రాంతాల్లో మార్పులు
- మున్నలూరు, వల్లూరుపాలెం వద్ద కృష్ణానదిపై వంతెనలు
- పేత్రంపాడు దగ్గర రెండు భారీ టన్నెల్స్
- ఏపీ-తెలంగాణ సరిహద్దులో 8 కి.మీ రోడ్డు మార్గం



ఎక్కడెక్కడ?

ఎన్టీఆర్ జిల్లాలో.. : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో కంచికచర్ల దగ్గర నాలుగు కిలోమీటర్ల మేర ఎగువకు పెరిగింది. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ప్రాంతం దిగువన చెన్నారావుపాలెం దగ్గర 6 కిలోమీటర్ల దూరం మేరకు బయటకు జరిగింది. మైలవరం దిగువ ప్రాంతం పూరగుట్ట కంటే దిగువన లొకేషన్-3లో మరో మూడు కిలోమీటర్ల మేర లోపలికి జరిగింది. ఆ తర్వాత లొకేషన్-4లో భాగంగా గణపవరం గణపతి ఆలయం దిగువన 3 కిలోమీటర్ల మేర తగ్గుతూ లోపలికి జరిగింది. లొకేషన్-5లో భాగంగా ఈదర, పోతవరప్పాడు, ఆగిరిపల్లి ప్రాంతాల మధ్య నుంచి వెళ్తున్న అలైన్‌మెంట్‌లో 44వ కిలోమీటర్ నుంచి 48వ కిలోమీటర్ వరకు నాలుగు కిలోమీటర్ల దూరం లోపలికి జరిగింది.

కృష్ణాజిల్లాలో.. : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో లొకేషన్-6లో భాగంగా నరసింగపాలెం, మిగతా 6లో..

ఇది వజ్రోత్సవ విజయం

60 ఏళ్లు పూర్తిచేసుకున్న కృష్ణా మిల్క్ యూనియన్

ఫిబ్రవరి 11 నుంచి గ్రామాల్లో వేడుకలు

బ్రోచర్ ఆవిష్కరణలో చైర్మన్ చలసాని ఆంజనేయులు



వజ్రోత్సవ పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పలువురు డైరెక్టర్లు

చిట్టినగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ విజయవంతంగా 60 ఏళ్ల పూర్తి చేసుకుని వజ్రోత్సవం జరుపుకొంటోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేశారు. పాలఫ్యాక్టరీలోని సమావేశపు హాల్లో సోమవారం పాలకవర్గం, అధికారులు.. వజ్రోత్సవ వేడుకల బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్షీరవిప్లవ పితామహుడు డాక్టర్ కురియన్ సహకారంతో యూనిసెఫ్ ద్వారా ఎయిడెడ్ ఇంటిగ్రేటెడ్ మిల్క్‌ప్రాజెక్ట్ మంజూరైందని, 1965, ఫిబ్రవరి 11న ఈ యూనియన్‌కు తొలి అడుగు పడిందని, నాటి నుంచి ఆరు దశాబ్దాలుగా పాడి రైతుల అభివృద్ధికి, పాడి పరిశ్రమకు చిరునామాగా కృష్ణా యూనియన్ మారిందన్నారు. ఎందరో మహానుభావులు నిస్వార్థంగా సంస్థ ప్రగతికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు స్వయం ప్రతిపత్తి కల్పించారని చెప్పారు. 1997 తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు, వేతనాలు సైతం సకాలంలో చెల్లించలేని పరిస్థితిలో మిగతా 6లో..



కబ్జా స్థలంలో పసుపు రంగుతో వేసిన సరిహద్దు రాళ్లు

కార్పొరేషన్ స్థలం కబ్జా



సరిహద్దు రాళ్లను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

వైసీపీ నేత అనుచరుడి బరితెగింపు

» వెంచర్ వేసి ప్లాట్ల అమ్మకాలు
» సరిహద్దు రాళ్లను తొలగించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
» స్థలం విలువ రూ.10 కోట్ల పైమాటే

ప్రభుత్వం మారినా వైసీపీ నేతలు, వారి అనుచరుల ప్రవర్తనల్లో ఎలాంటి మార్పు రావట్లేదు. తమ ప్రభుత్వ హయాంలో ఎలా అయితే భూ కబ్జాలు, అక్రమణలకు దిగారో, అదే తరహాలో టీడీపీ కూటమి ప్రభుత్వంలోనూ ప్రవర్తిస్తున్నారు. పాయకాపురంలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి, ప్రైవేట్ వెంచర్‌గా బిల్డప్ ఇచ్చి, ప్లాట్లను అమ్ముకుంటున్నారు. ఇందులో సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన ఓ వివాదాస్పద వైసీపీ బడానేత అనుచరుడు ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం సరిహద్దు రాళ్లను తొలగించారు.

ఆంధ్రజ్యోతి, పాయకాపురం : పాయకాపురంలోని కండ్రిక కాలనీని ఆనుకుని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్‌కు సర్వే నెంబరు 60/2లో వెంచర్ ఉంది. వెంచర్ ఏర్పాటు సమయంలో అసోసియేషన్ ప్రధాన రహదారిని నిర్మించుకుంది. రహదారికి ఎడమవైపు మిగతా 6లో..

నారా లోకేశ్ పాదయాత్రతో..

ఏపీలో సరికొత్త అధ్యాయం



» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : 2024 ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేశ్ నిర్వహించిన 'యువగళం' పాదయాత్ర రాష్ట్రంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భం, లోకేశ్ దావోస్ పర్యటన విజయవంతం చేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ, 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర లోకేశ్ 'యువగళం' పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. తమకు కావాల్సిన ప్రజా ప్రభుత్వాన్ని ఓటు హక్కు ద్వారా సాధించుకున్నారనారు. లోకేశ్ కృషితో పారిశ్రామిక రంగం వెలుగులీనుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల కాలంలోనే రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 4 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించేందుకు కంపెనీలు ముందుకువచ్చాయనారు.

సామాన్య భక్తులే వీఐపీలు

» వారి పట్ల మర్యాదగా వ్యవహరించండి

» దుర్గగుడి ఈవో రామచంద్రమోహన్

వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గామల్లేశ్వరుల దర్శనానికి వచ్చే భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్, దుర్గగుడి పూర్తి అదనపు ఈవో కె.రామచంద్రమోహన్ ఆలయ అధికారులు, ఉద్యోగులకు హితవు పలికారు. ఇటీవల ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు కాంట్రాక్ట్ ఉద్యోగిపై ఈవోకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయడంతో.. సోమవారం ఈఈలు, ఏఈవోలు తదితరులతో ఈవో సమావేశమయ్యారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, సామాన్య భక్తులే వీఐపీలని, వారి పట్ల మర్యాద, మన్ననలు అవసరమని తెలిపారు. భక్తుల రద్దీ ఉండే శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు శీఘ్రంగా కదిలేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల పట్ల సహనంగా ఉండాలని, వారి ఆవేదన అర్థం చేసుకుని సానుకూలంగా మాట్లాడాలని తెలిపారు. భక్తుల వద్ద సెల్‌ఫోన్లు తనిఖీ చేసే విషయమై సెల్‌ఫోన్ కౌంటర్ సిబ్బంది ఎలా జోక్యం చేసుకుంటారని ప్రశ్నించారు. హద్దుమీరితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోజుకు ఎంతమంది అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు.. సమయం ఎంత పడుతోందన్న దానిపై ఆయన ఆరాతీశారు. అన్నదాన డిపాజిట్ల వివరాలు, విరాళాలు వివరాలు ఇవ్వాలన్నారు.



ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటును అడ్డుకుంటున్న వ్యాపారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు

» అడ్డుకున్న వ్యాపారులు.. స్వల్ప వివాదం

నందిగామ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన రూ.15 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతంపై 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారులు స్పందించారు. ఆలయానికి చెందిన 75 సెంట్ల భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి నింపడంపై ధర్మకర్త మురళీరాఘవబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ అధికారులు ఆలయ భూమిలోకి అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తప్పవని సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే సదరు భూమిలో మట్టితోలిన వ్యాపారులు స్థలం ఆలయానిది కాదని, తమవద్ద డాక్యుమెంట్లు ఉన్నాయంటూ అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. స్వామివారి విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు మిన్నకుండిపోవడంపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులను అడ్డుకుని ఫెన్సింగ్ వేయించి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు చెప్పండి

బస్‌స్టేషన్ : ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సంయుక్త సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పరిపాలన విభాగం ఈడీకి, ఆర్టీసీ ఎండీకి లేఖలు రాశారు. గ్యారేజీ, ఇతరత్రా సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని గతం నుంచి కోరుతున్నా సఫలీకృతం కాలేదన్నారు. సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేఖపై అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి సంతకం చేశారు.

ఉద్యాన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 మే నెలలో వడగళ్లు, ఈదురుగాలులు, భారీవర్షాలకు ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకుఇన్‌పుట్ సబ్సిడీచెల్లించేందుకు రూ.4,31,93,000 విడుదలకు ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎస్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం 2,856 మంది ఉద్యాన రైతులకు ఈ మొత్తాన్ని ఇన్‌పుట్ సబ్సిడీగా ఇవ్వనున్నారు. అలాగే 2022 జూలై, ఆగస్టులో కోనసీమ జిల్లాలో వరద ప్రాంతాల పశువులకు టీఎంఆర్ దాణా సరఫరా చేసినందుకు రూ.2,12,64,200 పెండింగ్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

మున్సిపల్ పదవుల ఎంపికకు నోటిఫికేషన్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లు, డిప్యూటీ మేయర్ల ఎంపిక కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 30 లోగా ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. వచ్చే నెల 3న పరోక్ష పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తారు. తిరుపతి, నెల్లూరు, ఏలూరు కార్పొరేషన్‌లకు డిప్యూటీ మేయర్లు, నందిగామ, హిందూపురం, పాలకొండ మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్‌ల కోసం ఎన్నికలు జరగనున్నాయి. ఆయా సంస్థల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన పదవుల భర్తీ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఫిబ్రవరి 6, 7 తేదీల్లో డ్వామా పీడీలకు శిక్షణ

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న డ్వామా పీడీలకు ఫిబ్రవరి 6, 7 తేదీల్లో ఉపాధి హామీ పథకం అమలుపై శిక్షణ ఉంటుందని, ఈ శిక్షణకు హాజరయ్యేందుకు పీడీలకు అనుమతి ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. తాడేపల్లిలోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఈ శిక్షణలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల కార్యక్రమాలకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసే విషయంపై మరింత అవగాహన కల్పిస్తారు. ఏయే పనులకు ప్రాధాన్యమివ్వాలన్న దానిపై డ్వామా పీడీలతో ఉన్నతాధికారులు చర్చలు జరపనున్నారు. ఈ శిక్షణ అనంతరం ఫీల్డ్ విజిట్ కూడా చేయనున్నారు.

సూర్యఘర్ లక్ష్యం 1,10,000 మంది లబ్ధిదారులు

» రుణాల మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్ కనెక్షన్‌ల ఏర్పాటుకు లక్షా పదివేలమంది లబ్ధిదారులకు రుణ మంజూరు లక్ష్యాలను పూర్తిచేసేందుకు బ్యాంకర్లు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రుణాల మంజూరులో వెండర్స్ బ్యాంకర్స్ మధ్య సమన్వయం అవసరమని, సమష్టి కృషితో లక్ష్యాలను సాధించి ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సూర్యఘర్ రుణాల మంజూరుపై సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను అమర్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. లక్షా పదివేల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ధారించామన్నారు. ఇప్పటివరకు 787 మంది లబ్ధిదారులు రుణాలకు దరఖాస్తు చేసుకోగా.. 651 మంది 10 శాతం భాగస్వామ్యాన్ని చెల్లించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఇంటి కప్పుపై ప్రభుత్వ రాయితీతో పాటు అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌దను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకొని ప్రజలకు కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూర్యఘర్ పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాయన్నారు. లబ్ధిదారులు రూ. 2 లక్షల విలువైన 3 కేడబ్ల్యు సోలార ప్యానెలను రూ.78 వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి పైకప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవలసి వుంటుందన్నారు. ప్రభుత్వ రాయితీ మినహా మిగలిన సొమ్మును బ్యాంకర్లు రుణంగా మంజూరు చేయవలసి వుంటుందన్నారు. కేటాయించిన లక్ష్యాల సాధనలో వెండర్లకు బ్యాంకర్లకు మధ్య సమన్వయం అవసరమన్నారు. బ్యాంకర్లు కాలయాపన చేయకుండా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే రుణాలను మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసిన నివేదికల వివరాలను ప్రతిరోజు సమర్పించాలని ఆయన అన్నారు. పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకొన్నామని ఇప్పటివరకు దాదాపు 65 వేల మంది లబ్ధిదారులు ప్యానెల్‌ను పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. స్వయం సహాయక సంఘం మహిళలు కూడా పెద్దయెత్తున రిజిస్ట్రేషన్ చేయించుకొంటున్నారన్నారు. సౌర శక్తి ద్వారా కాలుష్యం లేని పర్యావరణ హిత ఇంధనాన్ని పొందవచ్చునని, దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులకు అవసరమైన రుణాలను తక్షణమే మంజూరు చేసి పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం కె.ప్రియాంక, కేడీసీసీ బ్యాంకు ఏజీఎం వాసవి కుమారి, బ్యాంక్ ఆఫ్ బరోడ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు అధికారులు, సెవెన్ రేస్ నెట్ మ్యాటరింగ్, విజేత సోలార్ మార్కెటింగ్ ఏజెన్సీ, సూర్య పవర్ ట్రీ, ఆల్ఫా సోలార్ ఇంజినీర్స్, దక్షిణ్ సోలార్ పవర్, శ్రీ లక్ష్మీ మారుతీ ఇంజినీరింగ్, తదితర సోలార్ ప్యానెల్ పంపిణీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



చాంపియన్ ఆంధ్రప్రదేశ్ బాలికలు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సెపక్ తక్రా చాంపియన్లు

ఆంధ్రా, మణిపూర్

లబ్బీపేట(స్పోర్ట్స్), జనవరి 27: (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్ 14జాతీయ సెపక్ తక్రా ఫైనల్స్‌లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్, బాలుర విభాగంలో మణిపూర్ జట్లు చాంపియన్‌లుగా నిలిచాయి. పటమట జడ్పీ హైస్కూల్‌లో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు మణిపూర్‌పై 15-13, 17-15తో గెలుపొందింది. బాలుర విభాగంలో మణిపూర్ జట్టు, బీహార్‌పై 15-2, 15-5తో గెలుపొందింది. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అభివృద్ధి

» ఏడాదిలో నెలకో థీమ్

» స్వచ్ఛాంధ్ర నిర్వహణకు రాష్ట్ర, జిల్లా సమన్వయకర్తల నియామకం

» కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తలపెట్టిన స్వచ్ఛదివస్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు ఏడాదిలో ప్రతినెలకో థీమ్ ఉంటుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంబంధిత అధికారులతో అన్నారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్‌ను నిర్వహిస్తామని, ఇందుకు ప్రతినెలకూ ఒక థీమ్ ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ పేరిట ఇప్పటికే కార్యక్రమాన్ని నిర్వహించామని, ఫిబ్రవరి నెలకు సోర్స్ రిసోర్స్, మార్చి నెలకు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్టాప్ చెప్పండి' అనే థీమ్‌తో కార్యక్రమాలు నడుస్తాయన్నారు. ఇదే సమయంలో త్వరలో బ్రాండ్ అంబాసిడర్‌ను కూడా నియమిస్తామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయడం కోసం రాష్ట్ర, జిల్లాస్థాయి నోడల్ అధికారులను నియమిస్తున్నట్టు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ అధికారులను కూడా భాగస్వాములను చేస్తున్నారన్నారు. నోడల్ అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తే స్వాగతిస్తామని తెలిపారు. పరిశుభ్రత లేకపోతే ఎంత అభివృద్ధి జరిగినా వృథానేనని తెలిపారు. నోడల్ అధికారులుగా అన్ని శాఖలకు చెందిన అధికారులు ఉన్నారని, వారందరి సహకారం ఉంటేనే ముఖ్యమంత్రి తలపెట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహాయంతో స్వచ్ఛాంధ్రను విజయవంతం చేస్తామన్నారు.

పేద, అనాథ పిల్లలకు విద్యా ప్రదాయిని

పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్

» స్కూల్‌ను సందర్శించిన నారా భువనేశ్వరి » పిల్లలతో కలిసి భోజనం.. వసతి సౌకర్యాలపై ఆరా





నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న స్కూల్ విద్యార్థులు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి, టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

చల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం సందర్శించారు. చల్లపల్లి మండలం పాగోలులో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మోడల్ స్కూల్‌లో సుమారు 350 మందికి పైగా విద్యార్థినీవిద్యార్థులు చదువుకుంటున్నారు. సోమవారం ఉదయం భువనేశ్వరి పాఠశాలను సందర్శించగా విద్యార్థులు ట్రస్ట్ జెండాలు చేతబూని కవాతు నిర్వహిస్తూ స్వాగతం పలికారు. ఎన్టీఆర్ ట్రస్ట్ పతాకాన్ని ఆవిష్కరించిన భువనేశ్వరి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. క్లాస్ రూమ్, డిజిటల్ క్లాస్‌రూమ్, హాస్టల్ గదులు పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి విద్యార్థులతో సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ ఆరాతీశారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.వెంకటేశ్వర్లు, సీవీవో అడుసుమిల్లి గోపి, యోగంనాయుడు, ప్రిన్సిపాల్ జి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్కూల్‌ను తరచుగా సందర్శిస్తు.. స్కూల్‌లో పిల్లలను ఎలా చూసుకుంటున్నారు, ఫ్యాకల్టీ ఎలా చెబుతున్నారనే విషయాలు గ్రౌండ్ లెవల్‌లో చూస్తేనే నమ్ముతానని భువనేశ్వరి అన్నారు. గండిపేటలో స్కూల్, ఉమెన్స్ కాలేజీ నడుపుతున్నామనీ, వాటిలో వచ్చిన లాభాలను స్కూల్ నిర్వహణకు ఖర్చుచేస్తామన్నారు. ప్రస్తుతం హైస్కూల్‌లో 350కి పైగా పిల్లలు చదువుతున్నారనీ, ఏటా 40మందిని కొత్తగా తీసుకుంటున్నామని తెలిపారు. చదువుతోపాటు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం నారా భువనేశ్వరి తిరిగివెళుతూ చల్లపల్లి రాజా కోటను సందర్శించారు. శాఖమూరి వెంకట చలపతిబాబు కోట వివరాలను భువనేశ్వరికి తెలియచేశారు. చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నారా భువనేశ్వరి నివాళులు అర్పించారు. టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని భువనేశ్వరికి స్వాగతం పలికారు. భువనేశ్వరిని ఎన్నారై బొబ్బా గోవర్ధన్, టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, మండల నేతలు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్పొరేషన్ స్థలం కబ్జా

(5వ పేజీ తరువాయి)

కండ్రిక కాలనీ సరిహద్దుల్లో సర్వే నెంబరు 63/1బీలో అవుట్ ఫాల్ డ్రెయిన్ పక్కన సుమారు 4వేల గజాల వరకు కార్పొరేషన్ స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.10 కోట్ల పైమాటే. ఆ స్థలంపై కన్నేసిన వైసీపీ నేత అనుచరుడు, అసోసియేషన్ అధ్యక్షుడి కొడుకు కబ్జాకు రంగం సిద్ధం చేశారు. అసోసియేషన్ పత్రాల ఆధారంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కార్పొరేషన్ స్థలాన్ని 36 ప్లాట్లుగా విభజించి ఇటీవల సరిహద్దు రాళ్లను పాతారు. పైగా సరిహద్దు రాళ్లకు పసుపు రంగు వేసి టీడీపీ నేతల వెంచర్‌గా బిల్డప్ ఇచ్చి అమ్మకానికి పెట్టాడు. విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి'.. టౌన్‌ప్లానింగ్ అధికారులకు సమాచారం ఇచ్చింది. కబ్జా జరిగిన స్థలానికి చేరుకున్న అధికారులు సరిహద్దు రాళ్లను తొలగించారు. సరిహద్దు రాళ్లు వేసిన స్థలం కార్పొరేషన్‌కు సంబంధించినదిగా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణానాయక్ తెలిపారు. అయితే, సదరు స్థలంలో అధికారులు బోర్డులు ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ హయాంలోనే ప్లాట్ల అమ్మకాలు

కబ్జా వ్యవహారంపై ఆరా తీయగా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఇది జరిగిందని తెలిసింది. ఎన్నికల ముందు హడావిడిగా ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. మొత్తం 36 ప్లాట్లకు గానూ సుమారు 20 ప్లాట్లు మార్కెట్ రేటుపై అతి తక్కువకు అమ్మినట్లు తెలిసింది.

కార్పొరేట్ దోపిడీ అరికట్టాలి

» కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నేతల వినతి

కృష్ణలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వాలని, విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ కమిటీ వేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ, నగరంలో కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక సంఖ్యలో ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ఫీజులు మాత్రమే ముఖ్యమనే తీరులో వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ఫీజులు చెల్లించకపోతే మానసికంగా హింసిస్తున్నారన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తామని తెలిపారు. విద్యార్థి సంఘాల నేతలు సాదిక్ బాబు, కార్తీక్, అవినాష్, మధు, కుమార్‌స్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రిజర్వేషన్ లిక్కర్‌కు నోటిఫికేషన్ విడుదల

» జిల్లాలో 11 షాపులు గీత కార్మికులకు కేటాయింపు

» దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీ ఫిబ్రవరి 5

» ఎక్సైజ్ స్టేషన్లలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం

» 10న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గీత కార్మికులకు మద్యం షాపులను కేటాయించే ప్రక్రియకు అడుగులు పడ్డాయి. ఎన్టీఆర్ జిల్లాలో 11 షాపులను గీత కార్మికులకు కేటాయిస్తున్నట్టు కొద్దిరోజుల క్రితం అధికారులు ప్రకటించారు. ఏఏ ప్రాంతాల్లో షాపులను కేటాయించారో దానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కలెక్టర్ లక్ష్మీశ సోమవారం వెల్లడించారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా జిల్లాలో ఉన్న ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇచ్చారు. అభ్యర్థులు ఫిబ్రవరి 5 సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కాపీని సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌లో అందజేయాలి. దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీని ఈనెల 7న ఉదయం 10గంటలకు గొల్లపూడిలో ఉన్న బీసీ భవన్‌లో తీస్తారు. అభ్యర్థులు నివాస, కుల ధ్రువీకరణపత్రాలను జత చేస్తూ రూ.2లక్షలను దరావత్తు రుసుముగా చెల్లించాలి.

రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఇవే..

విజయవాడ గురునానక్ కాలనీలో ఎక్సైజ్ తూర్పు స్టేషన్, సీతారామపురంలోని విజయ వెస్ట్, పాత హెచ్‌బీ కాలనీలో ఉన్న భవానీపురం ఎక్సైజ్ స్టేషన్, మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు ఎక్సైజ్ స్టేషన్లు.

ఇది వజ్రోత్సవ విజయం

(5వ పేజీ తరువాయి)

ఉన్న యూనియన్‌ను ఆదుకోవడానికి అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చూపిన చొరవ మరువలేనిదన్నారు. కాగా, 60 ఏళ్ల కిందట పామర్రులో తొలి పాలసేకరణను 646 లీటర్లు, లీటరుకు 50 పైసల కొనుగోలుతో ప్రారంభించారని, ప్రస్తుతం 1,200 గ్రామాల్లో ఏటా 11 కోట్ల లీటర్ల పాలసేకరణ, రూ.1,200 కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరుకున్నామని చెప్పారు. రూ.200 కోట్ల మిగులు నిధులను సాధించగలిగిందన్నారు. లక్షా50వేల మంది పాడి రైతుల కుటుంబ సంస్థగా, ఉపాధి కల్పించే వనరుగా కొనసాగుతోందని చెప్పారు. దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర అందిస్తున్న సంస్థగా నిలిచిందన్నారు. ఐదేళ్లలో వార్షిక టర్నోవర్‌ను రూ.570 కోట్ల నుంచి రూ.1,200 కోట్లకు పెంచుకోగలిగామని, ఇతర పాల సహకార సంస్థలకు భిన్నంగా ప్రతి నాలుగు నెలలకోసారి లాభాలను పంచేలా రైతులకు బోనస్ అందజేస్తున్నామని చెప్పారు. 100కు పైగా ప్రోడక్టులను అందిస్తున్నామన్నారు. సభ్యుడైన పాడిరైతు చనిపోతే.. క్షీర బంధు పథకం కింద రూ.50 వేల సాయం అందిస్తున్నామని, ఇప్పటి వరకు 3 వేల కుటుంబాలను ఆదుకున్నామని పేర్కొన్నారు. సభ్యుల పిల్లలకు పెళ్లిళ్లు జరిగితే సంస్థ తరఫున బంగారు కాయిన్ అందజేసే 'కల్యాణమస్తు' పథకాన్ని చేపట్టామని, 4 వేల జంటలకు అందించామని చలసాని తెలిపారు. పిల్లలకు ప్రతిభ పథకం, రైతులకు హెల్త్‌కార్డులు, వైద్య శిబిరాల నిర్వహణ, గుండె శస్త్రచికిత్సలు వంటివి చేస్తున్నామన్నారు. నిరంతరం పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు 12 వెటర్నరీ అంబులెన్సులు కొనడంతో పాటు 40 మంది వరకూ వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పశువులకు రూ.లక్ష బీమా సదుపాయం కల్పించామని, రాయితీపై పశుదాణా, ఆరోగ్యకరమైన పశు సంతానంలో మేలుజాతి వృద్ధికి కృత్రిమ వీర్య పంపిణీ వంటి ఏర్పాట్లనూ సంస్థ చేపట్టిందన్నారు. ప్రతి లీటర్ పాలపైనా రూ.2 సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నామన్నారు. దీర్ఘకాలంగా కన్సాలిడేటెడ్ వేతనంపై పనిచేస్తున్న 390 మంది ఉద్యోగులను ఈ ఐదేళ్లలో పర్మినెంట్ చేశామన్నారు.

వైసీపీ కుటిల ప్రయత్నాలను వమ్ము చేస్తూ..

కృష్ణా మిల్క్ యూనియన్ అంటే.. లక్షన్నర కుటుంబాల సమష్టి కృషి అని, గత ప్రభుత్వం అమూల్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థను తెచ్చి, పోటీకి పెట్టి దెబ్బతీయాలని చూసినా.. సమష్టి కృషితో ఆ ప్రయత్నాలను వమ్ము చేయగలిగామన్నారు. ఎన్నో ఇబ్బందులు అధిగమించి సుమారు రూ.165 కోట్లతో వీరవల్లిలో నిర్మించిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కామధేను ప్లాంటును త్రిదండి చినజీయర్‌స్వామి చేతులమీదుగా ప్రారంభించామన్నారు. ఈ విజయం కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులందరిదన్నారు. ఈ వజ్రోత్సవాల్లో పాడిరైతు సంక్షేమం, వినియోగదారుల సంతృప్తి, ఉద్యోగుల ప్రయోజనం.. అనే మూడు సూత్రాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతిన పూనుతున్నామని, ఫిబ్రవరి 11 నుంచి గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పలువురు డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

దారి మారింది..!

(5వ పేజీ తరువాయి)

నగ్గూరు గ్రామాల్లో 52వ కిలోమీటర్ నుంచి 58వ కిలోమీటర్ వరకు 6 కిలోమీటర్ల దూరం మేర అలైన్‌మెంట్ బయటకు జరిగింది. లొకేషన్ నెంబర్ 7లో తరిగొప్పల, వేంపాడు, మారేడుమాక, తెన్నేరు మీదుగా వెళ్లే అలైన్‌మెంట్ 76వ కిలోమీటర్ నుంచి 80వ కిలోమీటర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర లోపలికి జరిగింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో.. : లొకేషన్ నెంబర్ 8లో భాగంగా సేలపాడు, వేజెండ్ల ప్రాంతాల్లో 116వ కిలోమీటర్ నుంచి 123వ కిలోమీటర్ వరకు 7 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ లోపలికి జరిగింది. లొకేషన్-9లో భాగంగా మున్నలూరు, మోగులూరు ఎగువ ప్రాంతాల్లోనూ అలైన్‌మెంట్ లోపలికి, బయటకు మారింది.

తెలంగాణ సరిహద్దుగా..

ఓఆర్ఆర్.. ఎన్టీఆర్ జిల్లాలో దుగ్గిరాలపాడు దాటాక తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు ప్రాంతం వెంబడి 16వ కిలోమీటర్ నుంచి 24వ కిలోమీటర్ వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర సాగుతుంది. రెండు రాష్ట్రాల మధ్య అవుటర్ రింగ్‌రోడ్డు ద్వారా చక్కటి కనెక్టివిటీ ఏర్పడుతుంది. సరిహద్దు వెంట ఓఆర్ఆర్ ప్రారంభమైన చోట నుంచి కిలోమీటర్ దాటాక విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు అనుసంధానమవుతుంది.

ఇన్నర్ రింగ్-అవుటర్ రింగ్‌రోడ్డు ఎంత దూరం?

ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి అవుటర్ రింగ్‌రోడ్డు మధ్య దూరం చూస్తే.. ఎన్టీఆర్ జిల్లాలో కట్టుబడిపాలెం నుంచి కుంటముక్కల వరకు 15 కిలోమీటర్లు ఉంటుంది. కృష్ణాజిల్లాలో దోనె ఆత్కూరు నుంచి పొట్టిపాడు వరకు 14 కిలోమీటర్ల దూరం ఉంది. నూతక్కి నుంచి మున్నంగి వరకు 11 కిలోమీటర్ల దూరం ఉంది. కాజా నుంచి వెంకటాయపాలెం వరకు 23.14 కిలోమీటర్ల దూరం ఉంది.

తెలంగాణ సరిహద్దులో రెండు భారీ టన్నెల్స్

ఓఆర్ఆర్‌లో భాగంగా తెలంగాణ-ఏపీ సరిహద్దు దిగువన పేత్రంపాడు సమీపంలోని కొండప్రాంతం మీదుగా రెండు టన్నెల్స్‌కు జాతీయ రహదారుల సంస్థ అధికారులు ప్రతిపాదించారు. దట్టమైన అటవీ ప్రాంతంతో కూడిన కొండప్రాంతం కావటంతో ఇక్కడ టన్నెల్స్‌ను ప్రతిపాదించారు. మొదటి టన్నెల్ 20వ కిలోమీటర్ నుంచి 23వ కిలోమీటర్‌కు కాస్త ఎగువ వరకు వస్తుంది. రెండో టన్నెల్ 24వ కిలోమీటర్‌కు కాస్త ఎగువ నుంచి 26వ కిలోమీటర్‌కు కాస్త ఎగువ వరకు ప్రతిపాదించారు.

కృష్ణానదిపై రెండు వంతెనలు

ఓఆర్ఆర్‌లో అంతర్భాగంగా.. కృష్ణానదిపై రెండుచోట్ల వంతెనలు రాబోతున్నాయి. కృష్ణాజిల్లాలో వల్లూరుపాలెం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా వల్లభాపురం వరకు 4.8 కిలోమీటర్ల పొడవైన బ్రిడ్జికి ప్రతిపాదించారు. అలాగే, రెండో బ్రిడ్జి ఎన్టీఆర్ జిల్లాలోని మున్నలూరు నుంచి గుంటూరు జిల్లాలో ముత్తాయిపాలెం వరకు 3.15 కిలోమీటర్ల మేర ఉంటుంది.

విజయవాడ తూర్పు

జాతీయ స్థాయి పురస్కారాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట: సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ సర్వేజన సుఖినో భవంతు (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా నిర్వహించే సేవా భూషణ్, విద్యా భూషణ్ జాతీయ స్థాయి పురస్కారాల ఎంపికకు వివిధ రంగాల్లో సేవలందించే ఉభయ తెలుగు రాష్ట్రాలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ ఈ.ఎస్.ఎస్ నారాయణ మాస్టారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వివరాలకు 96523 47207 నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో పనిచేయని లిఫ్టు

● లిఫ్టుకు అడ్డుగా చెక్కలు, అట్టపెట్టెలు పెట్టిన వైనం ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

(ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వాసుపత్రిలో ఏ బ్లాక్‌లో రోగులను పై అంతస్తుకు తరలించే లిఫ్టు ఏళ్ల తరబడి పనిచేయడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి యాజమాన్యం ఎంతో తెలివిగా పని చేయని లిఫ్టు కనిపించకుండా దానికి అడ్డుగా అట్టపెట్టెలు, చెక్క తలుపు పెట్టారు. రోగుల బంధువులు లిఫ్టు వద్దకు రావడం వెను తిరగడం పరిపాటిగా మారిపోయింది. లిఫ్టు పని చేయకపోవడంతో రోగుల బాధలు వర్ణనాతీతంగా మారిపోయాయి. ఆపరేషన్ చేయించి కుట్లు వేయించుకున్న రోగులు, కాళ్లు, చేతులు విరిగిన రోగులు, ముఖ్యంగా అత్యవసర సేవలు పొందాల్సిన రోగుల బాధలు లిఫ్టు లేకపోవడంతో చెప్పనలవి కావు. వారితో పాటు వారి వెంట వచ్చే బంధువులు సైతం లిఫ్టు లేక మెట్లు ఎక్కలేక నానా యాతన పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం లిఫ్టునకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.


పనిచేయని లిఫ్టుకు అడ్డుగా నిలిపిన చెక్కలు, అట్ట పెట్టెలు

యోధ పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : యోధ కథా సంకలనం మాతృత్వం అనే భావనను విభిన్న కోణాల నుంచి పరిశీలించి, సమాజంలోని స్త్రీల ప్రాధాన్యాన్ని, వారి ఆత్మాభిమానం, ధైర్యాన్ని అత్యద్భుతంగా వివరించిందని మాజీ ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ ప్రశంసించారు. అనువాద మిత్రమండలి, జీఆర్‌కే - పోలవరపు సాంస్కృతిక సమితి, జాషువా సాహితీ స్రవంతి విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయ భండారు రచించిన యోధ పుస్తకావిష్కరణ సోమవారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకంలో ఉన్న 53 కథలు సమాజం ఎదుర్కొనే సమస్యలను ప్రతిబింబిస్తున్నాయన్నారు. మాతృత్వాన్ని శారీరకంగా కాకుండా భావోద్వేగపరమైన ఆత్మీయ అనుభూతిగా రచయితలు భావించారన్నారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, రచయిత్రి కపూరి పుష్పాదేవి, ఉషారాణి, వడ్లమూడి పద్మ, దుట్టా శమంతకమణి, అరసవెల్లి కృష్ణ, అనిల్ డానీ, కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు.


యోధ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, చలపాక ప్రకాశ్ తదితరులు

కూటమి విజయంలో లోకేశ్ పాత్ర కీలకమైనది

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విజయంలో లోకేశ్ పాత్ర కీలకమైనదని, ఆయన్ని ఎదుర్కొనడం ఎవరి వల్ల కాదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం 13 వ డివిజన్‌కు చెందిన ఎండీ కరీముల్లా, బొజ్జగ్లపూడి సుమలతలకు రూ.30 విలువ చేసే రెండు తోపుడు బండ్లను ఆయన తన సొంత నిధులతో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ యువగళం పూర్తి చేసిన రెండేళ్లు పూర్తయిందన్నారు. పాద యాత్రలో ఆయన తెలుసుకున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మరో 50 ఏళ్ల పాటు టీడీపీకి నాయకత్వానికి ఢోకా లేదని లోకేశ్ నిరూపించారన్నారు. యువగళం పేరుతో ప్రజలు సమీకరించి ఒక ఉద్యమం మాదిరిగా నిర్వహించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన బుజ్జి, తుమ్మల శ్రీను, కోడే సాంబశివరావు, యలమంచలి రవీంద్ర, చలసాని రమణ, రాధారాపు ఎల్లబాబు తదితరులు పాల్గొన్నారు.


తోపుడు బండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రభుత్వాసుపత్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాచవరం ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జాతీయ ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని థామస్ ఆల్వా ఎడిషన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెండాను ఆవిష్కరించారు. థామస్ ఆల్వా ఎడిషన్ బల్బును కనిపెట్టిన రోజున జాతీయ ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అసోసియేషన్ నగర్ అధ్యక్షుడు కె.శ్రీహరిరావు మాట్లాడుతూ కార్మికుల సంఘటితంగా ఉండాలని, అసోసియేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మిఠాయిలు పంచారు. ప్రధాన కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, వై.శంకరరావు, కె.బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.


ఆల్వా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, డైరెక్టర్ బాబూరావు

ఓటరు చైతన్య పోటీల్లో పీబీ సిద్ధార్థకు బహుమతులు

మొగల్రాజపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డేటా సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్న రామవరపు స్రవంతి వ్యాసరచనలో, పి.హనిత వక్తృత్వ పోటీలలో ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థినులను డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, డేటా సైన్స్ హెడ్ డాక్టర్ కె. ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ మూడో యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.వెంకటన రమణ, తెలుగు అధ్యాపక బృందం అభినందించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి, వేదికపై కె.చంద్రమౌళి, క్రాంతి కుమార్

నా గెలుపునకు సహకరించండి

● ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

విజయవాడ లీగల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో న్యాయవాదులంతా తనకు ఓటు వేసి తన గెలుపునకు సహకరించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్‌ను సందర్శించిన ఆయన న్యాయవాదులను కలిసి తన గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, బార్ మాజీ అధ్యక్షుడు చేకూరి శ్రీపతి, వి.గురునాథం, చిగులూరి కృష్ణారావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బార్ కార్యవర్గసభ్యుడు కలతోటి క్రాంతి కుమార్, న్యాయవాదులు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ శర్మ, బాషా, లాం ఇజ్రాయేలు పాల్గొన్నారు.


రహదారి భద్రత మాసోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, బహుమతులు అందుకున్న ఆర్టీసీ డ్రైవర్లు

ప్రమాదాల నివారణకు కృషి చేయండి

ఆర్టీసీ డ్రైవర్లకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పద్మాకర్ పిలుపు

ఆటోనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో బస్సు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలని, ఆర్టీసీలో ప్రయాణం సుఖవంతమనే మన లక్ష్యం డ్రైవర్లు నిలబెట్టాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి. పద్మాకర్ సూచించారు. ప్రమాదాల నివారణలో ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. తొలుత వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం డిపో స్థాయిలో ప్రమాదరహితంగా నడిపిన ముగ్గురు సీనియర్ డ్రైవర్లైన సీ.హెచ్.ఎస్ రావు, ఎం.ఎస్ రెడ్డి, ఎస్.కె షరీఫ్‌లకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులను వినియోగించడానికి ప్రధాన కారణం డ్రైవర్లు సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుస్తారనే నమ్మకమేనని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, ఫైర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజ, హోండా రోడ్ సేఫ్టీ కో- ఆర్డినేటర్ వెంకట దుర్గా ప్రసాద్, డ్రైవర్లు పాల్గొన్నారు.

డిస్పేస్‌తో పుస్తక పఠనాన్ని ఉద్యమంగా తీసుకురండి

ప్రొఫెసర్ ఎం.కృష్ణమూర్తి


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎం.కృష్ణమూర్తి

భారతీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనాన్ని ఒక ఉద్యమంగా తీసుకురావడానికి డిస్పేస్ అనే సమాచార వ్యవస్థ ద్వారా గ్రంథాలయ అధిపతులు, అధ్యాపకులు కృషి చేయాలని బెంగళూరుకి చెందిన ప్రొఫెసర్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఫాదర్ గోర్డెన్ లైబ్రరీ ఆంధ్ర లయోలా కళాశాల ఆధ్వర్యంలో డిస్పేస్(గ్రంథాలయ అభివృద్ధి, పుస్తక పఠనం పెంచడం)అనే అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎం.కృష్ణమూర్తి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్థాగత సమాచార వ్యవస్థ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ సగాయరాజ్ మాట్లాడుతూ కళాశాల సమాచారాన్ని, పుస్తక వివరాలను క్రమపద్ధతిలో భద్రపరిచేదే డిస్పేస్ అనే సమాచార వ్యవస్థ అని అన్నారు. ఫాదర్ పి.ఆర్.జాన్ మాట్లాడుతూ మానవ వికాసానికి దోహదపడేదే గ్రంథాలయమని, విజ్ఞానానికి డిస్పేస్ అనే సమాచార వ్యవస్థ మైలురాయి కాగలదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.రోజా మణి, కన్వీనర్ డాక్టర్ జి.ఎ.ప్రసాద్‌రావు, ఆంధ్రా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సోమశేఖర్, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఫాదర్ ప్రభుదాస్, ఎస్.ఎ.బి.నెహ్రూ, డాక్టర్ జి.మురళీకృష్ణ, కె.టి.ఎస్.ఎస్.తోమాస్, తుమ్మల శ్రీకుమార్, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల నుంచి 80మంది గ్రంథాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌లో

విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ జట్టుకు తృతీయస్థానం


తృతీయస్థానం పొందిన విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ జట్టు

లబ్బీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ దాసరినేని గోపిచంద్ నిర్వహణలో వెంకటగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజయవాడ వాణిజ్య పన్నుల శాఖ తృతీయ స్థానంలో నిలిచింది. తృతీయ బహుమతిని కెప్టెన్ జి.కిరణ్, టీమ్ సభ్యులు అందకోగా, ఉత్తమ బౌలింగ్ విభాగంలో కె.ఆర్.ఎస్.గణేష్ బహుమతి అందుకున్నారు.

పాత శివాలయంలో మల్లేశ్వరస్వామికి అభిషేకం

వన్‌టౌన్: త్రయోదశి తిథిని పురస్కరించుకుని సోమవారం వన్‌టౌన్‌లోని పాత శివాలయంలో ఉదయం మల్లేశ్వర స్వామి లింగానికి, సాయంత్రం నందీశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పుష్పాలంకరణ, పంచహారతులు, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణలు జరిగాయి ఈవో నటరాజన్ షణ్ముగం, ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ బొమ్ము మధుల పర్యవేక్షణలో జరిగాయి.

హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన

పటమట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సీటు బెల్టు, హెల్మెట్‌లు ధరించాలని ట్రిపుల్ రైడింగ్, డ్రంకన్ డ్రైవ్ చేయవద్దని ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు బెంజిసర్కిల్ వద్ద సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. 8,9 తరగతి విద్యార్థులు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకున్నా, కారులో సీటు బెల్ట్ ధరించకుంటే మేము తల్లిదండ్రుల వాహనాలు ఎక్కం అని ప్రతిజ్ఞ చేశారు. వాహనదారులకు కరపత్రాలు పంచుతూ ట్రాఫిక్ నియమాలు పాటించి ఇంటికి క్షేమంగా చేరుకోవాలని మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తూ ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ ఎ.ప్రసన్న కుమార్, సీఐ రవికుమార్, ఎస్సై జి.వి.ఎన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




ఎగ్జిబిషన్‌లో వస్త్రాలు తిలకిస్తున్న సందర్శకులు

నేషనల్ సిల్క్ ఎక్స్‌పోలో సరికొత్త డిజైన్లు

లబ్బీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళామణుల మనసుదోచే సరికొత్త డిజైన్‌లతో, దేశంలోని పలు ప్రాంతాల నుంచి పేరుగాంచిన వస్త్రాలతో నేషనల్ సిల్క్ ఎక్స్ పోను లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసినట్లు ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ ఎక్స్ పోలో వెడ్డింగ్, ఫెస్టివల్ స్పెషల్ కలెక్షన్స్ అందుబాటులో ఉంచామని, పంజాబ్, అస్సాం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, తెలంగాణా, జమ్ము అండ్ కాశ్మీర్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పేరుగాంచిన హ్యాండ్లూమ్స్, కాటన్, ప్యూర్‌సిల్క్, డిజైనర్ వస్త్రాలు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్ ఫ్యాషన్ జ్యూయలరీ అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ఎక్స్ పో ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.


వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 16 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ (పాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- కుదేలైన కొండపల్లి స్టేషన్ సెంటర్ వ్యాపారం
- ఎర్రబ్రిడ్జ్ ఎత్తుతో తెగిన సంబంధాలు
- ప్రయాణ సాధనాల కుదింపుతో తారుమారు
- వ్యాపారుల విలవిల, ప్రయాణికులకు కష్టాలు

మనిషికి మనిషి, వాహనానికి వాహనం తప్పుకోలేనంత రద్దీతో నిత్యం ప్రయాణికులు, వినియోగదారులతో వాణిజ్యపరంగా ఒక వెలుగు వెలిగిన కొండపల్లి రైల్వే స్టేషన్ సెంటర్ ఇప్పుడు జన, వాహన సంచారం లేక వెలవెలబోతోంది. నేటి ఈ దుస్థితికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా రాజకీయ కారణాలు రైల్వేస్టేషన్ అభివృద్ధికి అవరోధంగా మారాయి. ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారి 30పై ఎర్ర బ్రిడ్జ్ ఎత్తు పెంచి కొత్త వంతెన నిర్మించడంతో కొండపల్లి స్టేషన్ సెంటర్‌తో నేరుగా సంబంధం తెగిపోయింది. ప్రయాణ సాధనాలు ఎప్పుడైతే తగ్గిపోయాయో సెంటర్ అభివృద్ధి కూడా క్రమంగా పతనం కావడం మొదలైంది. కొండపల్లి స్టేషన్ సెంటర్ పూర్వ వైభవంగా మళ్లీ కన్నులారా చూస్తామా అన్న సందేహంలో ఈ ప్రాంత వాసులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. - ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి



కొండపల్లి రైల్వే స్టేషన్ సెంటర్

కొండపల్లి అనగానే ఖిల్లా, కొయ్యబొమ్మలతో పాటు రైల్వేస్టేషన్ సెంటర్ కూడా కళ్లముందు కదలాడుతుంటాయి. అంతగా అవి పాపులర్ అయ్యా యి. ఒక విధంగా కొండపల్లికివే లాండ్‌మార్క్స్. పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపా రం, ఇతర గృహోపకరణాలు, బంగారం వ్యాపారంతో మంచి వాణిజ్య కేం ద్రంగా కొండపల్లికి గుర్తింపు ఉంది. ఈ క్రమంలో సికింద్రాబాద్ నుంచి వి జయవాడ వరకు నడిచే రైళ్లలో తెలంగాణ రాష్ట్రం విడిపోక ముందు ఖ మ్మం, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు కొండపల్లి వచ్చి దు స్తులతో పాటు ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసుకొని వెళ్లేవారు. జి.కొండూరు మండలంతో పాటు ఇబ్రహీంపట్నం చుట్టుపక్కల మండలాల నుం చి కూడా అనేక మంది కొండపల్లికి వచ్చేవారు. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి ఉదయం వచ్చే ప్యాసింజర్ రైళ్లలో సుమారు 3వేల మంది కార్మికులు ఈ ప్రాంతానికి వచ్చి భవన నిర్మాణ, వ్యవసాయ ఇతర పనులు చేసుకొని తిరిగి సాయంత్రం రైలుకు తిరిగి వెళ్లేవారు. కొండపల్లి స్టేషన్ సెంటర్ నుంచి కంకిపాడు, గన్నవరంతో పాటు విజయవాడలోని అనేక ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులు 5 నిముషాలకు ఒకటి చొ ప్పున నడిచేవి. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సెంటర్‌లో అనేక హోటల్స్, ఇతర షాపులు నిత్యం రద్దీగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. జనం, వాహనాల సంచారం లేక సెంటర్ వెలవెలబోతోంది.

స్టేషన్ సెంటర్‌తో తెగిన సంబంధం

కొండపల్లి రైల్వే స్టేషన్‌తో ఎన్.హెచ్ 30పై నిర్మించిన హైలెవల్ వంతెన దెబ్బకు స్టేషన్ సెంటర్ వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. బస్సులు సంఖ్య తగ్గిపోవడం కూడా ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఒకప్పుడున్న ఎర్రబ్రిడ్జ్‌పైకి స్టేషన్ సెంటర్ నుంచి నేరుగా ఎక్కే వీలుండేది. వంతెన హైట్ పెంచడంతో రోడ్డు పల్లంగా తయారైంది. దీంతో ఎన్‌హెచ్ నుంచి సుమారు 500 మీటర్ల ముందుకు వెళ్లి అక్కడి నుంచి కొండపల్లి స్టేషన్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంది. దూరం పెరిగిపోవడంతో ప్రయాణికులు సైతం ఆటోలు దొరక్క అవస్థలు పడుతున్నారు.



కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్ ప్రాభవాన్ని కోల్పోవడానికి కారణమైన ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారి

రాజకీయ నేతలేం చేస్తున్నట్టు..?

స్టేషన్ సెంటర్ దుస్థితికి రాజకీయ నేతలు కూడా ఒక కారణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎర్ర బ్రిడ్జ్ ఎత్తు పెంచి స్టేషన్ సెంటర్‌కు ఎన్‌హెచ్ 30 నుంచి నేరుగా సంబంధం లేకుండా చేసినా ఒక్క నాయకుడు మాట్లాడలేదని, బస్సుల సంఖ్య తగ్గించినా మాట్లాడలేదని ఆరోపిస్తున్నారు. కొండపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయకుండా రాయనపాడు రైల్వేస్టేషన్ అభివృద్ధి చేస్తున్నా నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేతలు ఐక్యమత్యంగా ఉండి కొండపల్లి స్టేషన్ సెంటర్‌కు పూర్వ వైభవం తీసుకురావాలనేది ప్రజల భావన.



మహా కుంభమేళాకు

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బస్టేషన్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ఎన్టీఆర్ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయాగ్ రాజ్‌తో పాటు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉంటుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైటెక్ సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ (నాన్ ఏసీ స్లీపర్), వెన్నెల (ఏసీ స్లీపర్) బస్సులను నడపనున్నట్టు తెలిపారు. మొత్తం ప్రయాణం 8 రోజులుంటుందని, తొలిరోజు ఉదయం 11 గంటలకు పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుంది. రెండో రోజు సాయంత్రానికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటారు. మూడోరోజు అక్కడే బస. నాలుగో రోజు రాత్రికి ఆయోధ్యకు బయలుదేరుతారు. ఐదో రోజు బాలరాముడిని దర్శించుకుంటారు. తిరిగి రాత్రికి వారణాశికి బయలుదేరుతారు. ఆరో రోజున వారణాశి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. ఏడో రోజు వారణాశి నుంచి బయలుదేరుతారు. ఎనిమిదో రోజు రాత్రికి విజయవాడ చేరుకుంటారు. హైటెక్ సూపర్ లగ్జరీ బస్సులో ఒకరికి రూ 8,000. స్టార్ లైనర్ ఏసీ స్లీపర్‌లో ఒకరికి రూ.11వేలు, వెన్నెల ఏసీ స్లీపర్‌లో రూ.14,500 చార్జి చెల్లించాల్సి ఉంటుంది. భోజనం, వసతి ఖర్చులు భక్తులు ఎవరికి వారే భరించుకోవాలి. 29 మంది గానీ, 35 మందిగానీ సమూహంగా వచ్చినట్టయితే బస్సు ఏర్పాటు చేస్తారు. ఆన్‌లైన్‌లోగానీ, ఏజంట్ ద్వారా గానీ, పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్‌లో గానీ టికెట్లు పొందవచ్చునన్నారు. వివరాలకు 8074298487కు ఫోన్ చేయవచ్చునన్నారు.

ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విజయవాడ రాక

పెనమలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జీ నరేందర్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి బెంగళూరు నుంచి విజయవాడ వచ్చారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు పర్యటనలో భాగంగా ఆయన కుటుంబసభ్యులతో కలిసి వచ్చినట్టు ప్రభుత్వాధికారులు తెలిపారు. జస్టిస్ నరేందర్, కుటుంబసభ్యులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.



అరుణా సుబ్బారావును సత్కరిస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులు

జనరంజకంగా నాటకోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 3 రోజులపాటు నిర్వహించే నాటకోత్సవాలు జనరంజకంగా ప్రారంభమవడం ముదావహమని, ప్రేక్షకాదరణ బాగుందని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళాపరిషత్, కొడాలి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ నందమూరి తారక రామారావు కళాపరిషత్ 8 రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు సోమవారం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై ప్రారంభమయ్యాయి. నటుడు జయప్రకాశ్ రెడ్డి కుమార్తె మల్లికారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, అంబటి మధుమోహన్‌కృష్ణ, కామినేని పట్టాభిరామయ్య, దర్శకుడు డి.రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు పర్యవేక్షించగా, జానపద గాయని అరుణా సుబ్బారావును ఘనంగా సత్కరించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరాజు, భాస్కర్‌రాజు, సూర్యనారాయణ రాజు తదితరులు

కమర్షియల్ వెహికల్ అసోసియేషన్

జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

సత్యనారాయణపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కమర్షియల్ వెహికల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. రామకృష్ణాపురంలో సోమవారం కార్యవర్గసమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా దెందుకూరి సత్యనారాయణరాజు, సెక్రటరీగా డీ భాస్కర్‌రాజు, కోశాధికారిగా డీ సూర్యనారాయణరాజు, గౌరవాధ్యక్షుడిగా పెనుమత్స అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభులతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష,కార్యదర్శులు దెందుకూరి సత్యనారాయణరాజు, డీ భాస్కరరాజు మాట్లాడుతూ అసోసియేషన్ సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన సభ్యులను, అసోసియేషన్ నేతలు, సభ్యులు, పెద్దలు పూలమాల జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.



కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర నేతలు

ధర్నాచౌక్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.రాము, జి.రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభ్యర్థులందరికీ ఫిజికల్ ఈవెంట్స్‌లో అవకాశం కల్పించాలన్నారు. వారికి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. గత ప్రభుత్వం 2022 నవంబర్ 22న 6,100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా ప్రిలిమ్‌లో 95,208 మంది అర్హత సాధించారన్నారు. ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసుల కారణంగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చిందన్నారు. ఇప్పుడు ఫిజికల్ ఈవెంట్స్‌కు వయస్సు సరిపోదని అభ్యర్థులను తిరస్కరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు చేసిన నిర్లక్ష్యానికి అభ్యర్థులను బలి చేయడం సిగ్గుచేటన్నారు. పి.కృష్ణ, ఎన్.నాగేశ్వరరావు, రాజుకుమార్, రాజీవ్, అనిత, మల్లి పాల్గొన్నారు.

రాష్ట్ర అతిథులుగా హైకోర్టు రిటైర్డ్ సీజేలు

ఐదు రోజుల పాటు ప్రొటోకాల్ అమలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన మాజీ ప్రధాన న్యాయమూర్తులను రాష్ట్ర అతిథులుగా గుర్తింపు ఇస్తూ, వారికి ప్రొటోకాల్‌ను కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న సందర్భంలో వారిని రాష్ట్ర అతిథులుగా పరిగణిస్తుంది. వీరితో పాటు రిటైర్డ్ మాజీ సీజేలకు అదే గుర్తింపు ఇవ్వనుంది. ఏపీలో పర్యటిస్తున్న సమయంలో వారికి ఐదు రోజుల పాటు అతిథులుగా గుర్తింపు ఉంటుంది. రాష్ట్ర అతిథులకు ఇచ్చే అన్ని రకాల ప్రొటోకాల్ వారికి అమల్లోకి వస్తాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం సూచించింది.

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా

రవి సుభాష్‌కు అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కంట్రోల్ (ఔషధ నియంత్రణ) అడ్మినిస్ట్రేషన్ డీజీగా పట్టంశెట్టి రవి సుభాష్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవి సుభాష్ ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలి వరకు డ్రగ్స్ డీజీగా వాకాటి కరుణ అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆమె సెర్ప్ సీఈవోగా వెళ్లిపోయారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కీలకమైన ఔషధ నియంత్రణ విభాగాన్ని ఇన్‌చార్జిలతోనే నడిపిస్తున్నారు. నిబంధనల ప్రకారం డ్రగ్స్ డీజీగా ఐపీఎస్ అధికారి ఉండాలి. కానీ ప్రభుత్వం 8 నెలల నుంచి ఆ నియామకం చేపట్టలేదు. మరోవైపు డైరెక్టర్‌గా కూడా రెగ్యులర్ అధికారి లేరు. పదవీ విరమణ పొందిన వ్యక్తిని తెచ్చి కూర్చోబెట్టారు. ఒకవైపు ఇన్‌చార్జి డీజీ, డైరెక్టర్‌గా రిటైర్డ్ అయిన వారితో పాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

నర్సింగ్ కాలేజీలకు కొత్త నిబంధనలు

- ఇకపై షెడ్యూల్ ప్రకారమే కొత్త కళాశాలల ఏర్పాటుకు దరఖాస్తులు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త నర్సింగ్ కాలేజీలు, పాఠశాలల ఏర్పాటులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటి ఏర్పాటుకు ప్రత్యేక షెడ్యూల్‌ను నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం టైమ్ షెడ్యూల్ లేకుండా నిత్యం కొత్త నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు ఏర్పాటుకు దరఖాస్తులు వస్తున్నాయి. ప్రతి నెల భారీగా దరఖాస్తులు వస్తుండడంతో ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పైగా కొన్నిచోట్ల అవసరానికి మించి కాలేజీలు, పాఠశాలలున్నాయి. దీన్ని నియంత్రణకు ప్రభుత్వం దరఖాస్తు చేసేందుకు, నోటిఫికేషన్ విడుదలకు, తనిఖీలకు.. ఇలా ప్రతి దానికి నిర్ణీత సమయం నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే దరఖాస్తు చేసుకోవాలి. ఏటా జనవరి 20 నాటికి నిపుణుల కమిటీ రాష్ట్రంలో ఎన్ని నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు అవసరమో నివేదిక సిద్ధం చేస్తుంది. హైపవర్ కమిటీ ఫిబ్రవరి 1న నోటిఫికేషన్ ఇస్తుంది. కాలేజీలు, మార్చి 1లోగా దరఖాస్తు చేసుకోవాలి. మే 30 నాటికి కాలేజీల్లో తనిఖీలు పూర్తిచేయాలి. జూన్ 30 నాటికి కొత్త కాలేజీలు, పాఠశాలలకు అనుమతులివ్వాలి. ఈ ఏడాది మాత్రం మార్చి 30 నుంచి జూన్ 30ఎనాటికి గ్యాప్ అనాలసిస్, నోటిఫికేషన్, దరఖాస్తులు ఆహ్వానం, తనిఖీలు, కాలేజీల గుర్తింపు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రాజమండ్రి, కాకినాడ సోనోవిజన్‌లో లక్కీ డ్రా తీస్తున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చిత్రంలో సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి

సోనోవిజన్ లక్కీడ్రాలో విజేతకు ఆల్టోకారు

వన్‌టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి, కాకినాడ సోనోవిజన్‌లో గత ఏడాది కొనుగోలుదారులకు సోమవారం రాజమండ్రి జేఎన్ రోడ్డులోని షోరూమ్‌లో విజేతలకు ఆల్టో కారు, ఎల్ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్‌లు బహుమతులుగా అందజేశారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి వందలాది మంది కొనుగోలుదారుల సమక్షంలో డ్రా తీశారు. 017607 నెంబరు కూపన్... కొనుగోలుదారు కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ఎన్ అన్నపూర్ణకు ఆల్టో కారు, 03376 నెంబరు కూపన్.. కొనుగోలుదారు రాజమండ్రికి చెందిన కే చైతన్యకు ఎల్ఈడీ టీవీ, 84452 నెంబరు కూపన్... కొనుగోలుదారు రాజమండ్రి ఇన్నీస్‌పేటకు చెందిన అఖిల్ కుమార్‌కు రిఫ్రిజిరేటర్, 017647 నెంబరు కూపన్.. కొనుగోలుదారు కాకినాడకు చెందిన అల్లం కుమార్‌కు వాషింగ్ మెషిన్ బహుమతులుగా వచ్చాయి.

ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు అందజేసిన నిర్వాహకులు

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సేవ, రాష్ట్రంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ చైన్‌స్టోర్ సోనోవిజన్‌లో రిపబ్లిక్ డే సందర్భంగా రాయితీ ధరల్లో వడ్డీగానీ, డీబీడీ గానీ లేకుండా లభించే ఫైనాన్స్ సౌకర్యం లాభదాయకంగా ఉంటుందన్నారు. అన్ని పెద్ద కంపెనీల నుంచి ఎల్ఈడీ, వాషింగ్ మెషిన్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీ, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు అందరికన్నా తక్కువ ధరల్లో లభిస్తాయన్నారు. ముఖ్యంగా ఈఎంఐ, ఫైనాన్స్ కొనుగోలుపై రూ.26 వేలు వరకు 22.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ లభించడంతో కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. నమ్మకమైన సేవలందిస్తామని షోరూం తరఫున వినియోగదారులను ఆహ్వానిస్తున్నట్టు మేనేజింగ్ పార్టనర్ పీ భాస్కరమూర్తి తెలిపారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలి

వీవోఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ

కృష్ణలంక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్టీఆర్ జిల్లా వెలుగు యానిమేటర్స్ (వీవోఏ) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈసందర్భంగా వీవోఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఏ కమల మాట్లాడుతూ వెలుగు డిపార్ట్‌మెంట్ (డీఆర్‌డీఏ) లో పనిచేస్తున్న డ్వాక్రా వీవోఏలు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 27, 28, 29 తేదీల్లో అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారన్నారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ వీవోఏల మెడకు ఉరితాడులా మారిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28వేల మంది వీవోఏలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలికంగా సేవలందిస్తూ పేద మహిళలను కూడగట్టడంలో, బ్యాంకుల లావాదేవీల్లో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పేద మహిళలను కూడగట్టి కొత్త గ్రూపులను ఏర్పాటు చేయడంలో వీవోఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఈ సర్క్యులర్ అమలుతో వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి, టి.విజయలక్ష్మి, వి.సౌజన్యకుమారి, బి.ప్రగతి, ఎల్.స్వాతి, టి.అనిత, ఎల్.వెంకట్రావు, పి.వెంకటేష్, డి.కుమారి భాయ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వెలుగు యానిమేటర్స్ ఉద్యోగులు

రేపు చేతి వృత్తి కళాకారులకు రుణమేళా

ఆటోనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసి 5 రోజుల ప్రాథమిక శిక్షణ పొందిన చేతివృత్తి కళాకారులకు 29న రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత పొంది న చేతివృత్తి కళాకారులు సంబంధిత పత్రాలతో ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాలో నిర్వహించే రుణమేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 87902 65577ను సంప్రదించాలని కోరారు.

లారీలు అపహరిస్తున్న ముఠా అరెస్టు

తిప్పర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ రోజులపాటు నిలిపి ఉంచిన లారీలను అపహరించి విజయవాడలో విక్రయిస్తున్న నలుగురు ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. నల్లగొండకు చెందిన పాలడుగు రాజు తన లారీని తిప్పర్తి పోలీస్‌స్టేషన్ పక్కనున్న మార్కెట్ యార్డులో నిలిపి ఉంచాడు. గత ఏడాది డిసెంబరు 24న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు లారీని అపహరించినట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం తిప్పర్తి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్లు లేని రెండు ఎర్టిగా కార్లు నకిరేకల్ వైపునకు వెళ్తుండగా అందులోని వ్యక్తులు పోలీసులకు అనుమానాస్పదంగా కన్పించారు. కార్లలో ఉన్న కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన మెండె వెంకన్న, గుజ్జేటి శ్రీనివాస్, కొరుపుల సాయి కుమార్, కొత్తగూడెం జిల్లాకు చెందిన అరికె రవిలను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరితో పాటు కేతేపల్లి మండలం ఇనుపాములకు చెందిన కొండ సురేష్‌కు కూడా భాగస్వామ్యం ఉన్నట్టు చెప్పారు. చీకటి ప్రదేశాల్లో నిలిపి ఉంచిన లారీలను తీసుకువెళ్లి విజయవాడలోని ఆటోనగర్‌లో విక్రయించేవారన్నారు. ఈ నెల 5న చిట్యాల మండలం పెద్దకాపర్తి పెట్రోల్ బంకులో పార్క్ చేసిన మరో లారీని ఎత్తుకెళ్లారు. వీటిని విజయవాడ ఆటోనగర్‌కు చెందిన షేక్ హబీబ్ రహమాన్‌కు విక్రయించారు. కేసులను ఛేదించిన శాలిగౌరారం సీఐ కె. కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, రామును జిల్లా ఎస్పీ అభినందించారు.

మత్స్యశాఖ కమిషనర్‌గా రామశంకర్ నాయక్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌గా 1997 బ్యాచ్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రామశంకర్ నాయక్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఆయన మత్స్యశాఖ కమిషనర్‌గా పని చేశారు. మరోసారి ఆయనకు అవకాశం కల్పించారు. 2018 ఏప్రిల్‌లో చివరి సారిగా తీసుకున్న జీతంలో ఇప్పుడు తీసుకుంటున్న పెన్షన్ మొత్తాన్ని తగ్గించి, మిగతా మొత్తాన్ని ఆయనకు జీతంగా నిర్ణయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొన్నటి వరకూ డిప్యుటేషన్‌పై మత్స్యశాఖ కమిషనర్‌గా వ్యవహరించిన ఐఓఎఫ్ఎస్ అధికారి డోలా శంకర్‌ను మాతృశాఖకు పంపించారు.

సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా సతీశ్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా డాక్టర్ యడ్లపల్లి సతీశ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన అభ్యర్థన మేరకు ఏడాది పాటు డిప్యుటేషన్‌పై సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ(ఏపీఎస్‌సీఏ) డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఏపీఎస్‌సీఏ డైరెక్టర్‌గా ఉన్న జీ వినయ్‌చంద్ ఏపీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ ఏ చంద్రిక డిప్యుటేషన్‌పై గుంటూరు(మిర్చి) మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా నియమితులయ్యారు.

పెండింగ్‌లో ఉన్న 3వేల మందికి

పదోన్నతులు ఇవ్వండి

బస్టేషన్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పెండింగులో ఉన్న 3వేల మందికి పదోన్నతులు వెంటనే ఇవ్వాలని సంస్థ వైస్ చైర్మన్ మునిరత్నంకు ఎంప్లాయిస్ యూనియన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ హౌస్‌లో సోమవారం మునిరత్నంను కలిసిన నేతలు ఆయనకు మర్యాదపూర్వకంగా దుశ్శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి వెంటనే పదోన్నతులకు అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వంలో సంస్థ విలీనం అయ్యాక వచ్చిన నిబంధనలతో పదోన్నతులు ఆగిపోయాయని, నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల స్థాయి వరకు పదోన్నతులు ఆగిపోయాయన్నారు. ఇందుకు సంబంధించిన ఫైళ్ల కదలిక పూర్వాపరాలను నేతలు వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు పాత విధానంలోనే వైద్య సౌకర్యాలు అందచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు 2019లో ఇచ్చిన జీవో-1ను అమలు చేయాలని, ఖాళీగా ఉన్న 10వేల ఉద్యోగాల భర్తీకి చొరవ తీసుకోవాలని కోరారు. పెండింగులోని 2017 పీఆర్‌సీ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య, నేతలు ఎండీఏ సిద్దిక్, మందపాటి శంకరరావు, జీఎస్ నారాయణ, ఏఆర్ సీహెచ్ రెడ్డి పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంను సత్కరిస్తున్న ఈయూ నేతలు పలిశెట్టి, జీవీ

పోషకాహారం

వెన్నకు బదులుగా...

పరాటా, చపాతీ, బ్రెడ్.... వీటికి వెన్నను జోడించి తినడం మన అలవాటు. అయితే వెన్నతో పెరిగే కొలెస్ట్రాల్ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే, వెన్నకు ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. అందుకోసం...

ఆలివ్ ఆయిల్

గుండె ఆరోగ్యాన్ని పెంచే ఆలివ్ నూనె వెన్నకు చక్కని ప్రత్యామ్నాయం. ప్రత్యేకించి వంటల్లో, బేకింగ్‌లో ఈ నూనెను నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా దొరికే ఆలివ్ నూనె గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ నూనెను సలాడ్స్, బేకింగ్ కోసం వాడుకోవచ్చు. వెన్నను ఉపయోగించి వండే వంటకాల కోసం ఒక కప్పు వెన్నకు బదులుగా 3/4 కప్పు ఆలివ్ నూనెను వాడుకోవచ్చు.

కొబ్బరినూనె

కొబ్బరి నూనె బహుళ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆకృతిలో వెన్నను అనుకరిస్తుంది. దీన్ని వెన్నలా వాడుకోవచ్చు. బ్రెడ్ మీద పూసుకుని తినొచ్చు. వెన్నతో సమాన పరిమాణాల్లో బేక్ చేసే వంటకాల్లో వాడుకోవచ్చు. అయితే కొబ్బరి సువాసన చెక్కుచెదరకుండా ఉండడం కోసం రిఫైన్ చేయని కొబ్బరినూనెను వాడుకోవాలి.



అవకాడో

పోషకభరిత వెన్నకు అద్భుతమైన ప్రత్యామ్నాయం.. అవకాడో. గుండెకు మేలు చేసే మోనోశాచురేటెడ్ కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు దీన్లో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వెన్నకు బదులుగా అవకాడోను గుజ్జును చేసి టోస్ట్‌ల మీద స్ప్రెడ్‌గా వాడుకోవచ్చు. అలాగే బ్రౌనీలు, మఫిన్ల తయారీలో కూడా వెన్నకు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు.

నట్ బటర్స్

బాదం, వేరుశనగ, జీడిపప్పు బటర్స్ కూడా మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. ఇవి కూడా వెన్న లాంటి ఆకృతినే కలిగి ఉండి, రుచికరమైన, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. వీటిలోని విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పరిపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి. కాబట్టి స్మూదీలు, బిస్కెట్ల బేకింగ్‌లలో నట్ బటర్స్ నిరభ్యంతరంగా వాడుకోవచ్చు.

ఆరోగ్యం ఆనందం

కొలెస్ట్రాల్‌ను ఇలా నియంత్రిద్దాం

మనం రోజును ఎలా మొదలుపెడుతున్నామనేదాని మీదే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కొన్ని అలవాట్లు మన రక్తంలోని కొలెస్ట్రాల్ మోతాదులను నియంత్రణలో ఉంచుతాయి. అవేంటో తెలుసుకుందాం!

- నిమ్మ రసంతో: రోజును గోరువెచ్చని నిమ్మరసంతో మొదలుపెట్టాలి. ఈ నటితో కొవ్వులు కరగడం మొదలుపెడతాయి. విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్లు కలిగిన నిమ్మరసం చెడు కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గించి, గుండె రక్తనాళాల్లో అవరోధాలు ఏర్పడకుండా సహాయపడుతుంది. నిమ్మరసం తాగడం వల్ల రోజంతా శరీరంలో నీటి పరిమాణం తగ్గిపోకుండా ఉంటుంది.



- పీచు పదార్థం: ఉదయం తీసుకునే అల్పాహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఓట్స్, షియా విత్తనాలు, యాపిల్స్ అరటి పండ్లు, ఆహారంలోని కొలెస్ట్రాల్‌ను శరీరం శోషించుకోకుండా నిలువరిస్తాయి. ఈ అలవాటులో చెడు కొలెస్ట్రాల్ శోషణ తగ్గడంతో పాటు, ఎక్కువ సమయం పాటు ఆకలి వేయకుండా ఉంటుంది. ఫలితంగా బరువు కూడా అదుపులో ఉంటుంది.
- నట్స్: ఉదయం, గుప్పెడు బాదం, వాల్‌నట్స్ అవిసెగింజలను తీసుకోవడం ఆరోగ్యకరం. వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు అత్యధిక సాంద్రతతో కూడిన లైపోప్రొటీన్ కొలెస్ట్రాల్‌ను మెరుగుపరుస్తాయి. అదే సమయంలో చెడు కొలెస్ట్రాల్‌ను కుంటుపరుస్తాయి. అయితే అధిక క్యాలరీలు కలిగి ఉండే ఈ నట్స్‌ను పరిమితంగానే తీసుకోవాలి.
- ఒత్తిడి కొలెస్ట్రాల్ మీద దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించే ధ్యానం, యోగా ఉదయాన్నే సాధన చేయాలి. కొన్ని నిమిషాల ధ్యానం ఒత్తిడిని తగ్గించి, మానసిక స్పష్టతను సమకూరుస్తుంది. అలాగే శ్వాస వ్యాయామాలకు కూడా ఉదయాన్నే కేటాయించాలి.
- ఉదయం తీసుకునే అల్పాహారంలో మాంసకృత్తులు, పీచు ఎక్కువగా పిండి పదార్థాలు, కొవ్వులు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకూ తీపికి దూరంగా ఉండాలి. పరగడుపున, కాఫీ, టీలకు బదులుగా గోరువెచ్చని నీళ్లు తాగాలి.



మొండికేసే థైరాయిడ్ గ్రంథి మహిళల గర్భధారణకు అడ్డు పడడంతో పాటు, గర్భంలో పెరిగే బిడ్డ ఆరోగ్యాన్ని కూడా అతలాకుతలం చేస్తుంది. ఆ గ్రంథి పనితీరును గాడిలో పెట్టుకుంటూ, థైరాయిడ్ సమస్యలతో మెరుగైన జీవితాన్ని ఎలా కొనసాగించాలో వైద్యులు వివరిస్తున్నారు.

థైరాయిడ్‌తో తంటా ఎందుకు?

థైరాయిడ్‌ను ఒక భూతంగా పరిగణించవలసిన అవసరం లేదు. స్థూలకాయం, మధుమేహం మొదలైన జీవనశైలి రుగ్మతలతో పోల్చుకుంటే థైరాయిడ్ సమస్యను చికిత్సతో అదుపులో పెట్టుకోవడం అత్యంత సులభం. థైరాయిడ్ గ్రంథి అవసరానికి తగ్గట్టు పని చేయకపోయినా, లేదా అవసరానికి మించి పని చేసినా ఆ ప్రభావం శరీరం మీద పడుతుంది. కాబట్టి గ్రంథి పనితీరును పరీక్షలతో కనిపెట్టి, మందులతో హార్మోన్ స్రావాన్ని సమంగా ఉంచుకుంటే ఇతరత్రా ఆరోగ్య సమస్యలూ, ప్రధానంగా గర్భధారణ సమస్యలను అధిగమించవచ్చు. మునుపటితో పోల్చుకుంటే ప్రస్తుతం థైరాయిడ్ సమస్యలు పెరిగాయనే చెప్పవచ్చు. ఇందుకు జీవన, ఆహార శైలులతో పాటు ఒత్తిడి కూడా కారణమే! కుటుంబ చరిత్రలో థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు కూడా పిల్లలకు సంక్రమించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

లక్షణాలు సుస్పష్టం

థైరాయిడ్ సమస్య లక్షణాలు అమ్మాయిల్లో ఎంతో స్పష్టంగా కనిపిస్తాయి. అవేంటంటే...

- భావోద్వేగాలు అదుపు తప్పడం
- నెలసరి క్రమం తప్పడం
- నెలసరి స్రావం పెరగడం, తరగడం
- బరువు పెరగడం
- నిస్సత్తువ, అలసట ఆవరించడం
- దిగులు, విచారం
- చలి, వేడి... రెండిటినీ తట్టుకోలేకపోవడం
- శరీర వణుకు
- గుండె వేగం పెరగడం
- కండరాల నొప్పులు
- చర్మం పొడిబారిపోవడం

అధిక బరువుతో హైపోథైరాయిడ్

థైరాయిడ్ గ్రంథి సామర్థ్యం తగ్గిపోయి, హార్మోన్ స్రావం కుంటుపడే హైపోథైరాయిడ్ సమస్య ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. అధిక శరీర బరువే ఇందుకు ప్రధాన కారణం. అస్తవ్యస్థ ఆహారపుటలవాట్ల ఫలితంగా శరీర బరువు అదుపు తప్పినప్పుడు, థైరాయిడ్ గ్రంథి పనితీరు కూడా క్రమం తప్పుతుంది. కాబట్టి గర్భం దాల్చాలనుకున్నప్పుడు, గర్భం దాల్చిన తర్వాత, రక్తంలో హిమోగ్లోబిన్‌ను పరీక్షించినట్టే, థైరాయిడ్ గ్రంథి పనితీరును కూడా పరీక్షించవలసిన అవసరం ఉంటుంది. గర్భధారణ సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్ష చేయించుకుని, సమస్యకు తగిన మందులు వాడుకోవాలి. హార్మోన్ స్రావం తగ్గిన వాళ్లు మాత్రల రూపంలో థైరాయిడ్ హార్మోన్‌ను తీసుకోవాలి. హార్మోన్ అవసరానికి మించి స్రవించే హైపర్‌థైరాయిడ్ సమస్య ఉన్నవాళ్లు గ్రంథి పనితీరును మందగించేలా చేసే మాత్రలు వాడుకోవాలి.

మాత్ర పరగడుపునే...

గర్భిణులైనా, సాధారణ మహిళలైనా థైరాయిడ్ మాత్రలను పరగడుపునే వేసుకోవాలి. ఐరన్, అధిక రక్తపోటు, మధుమేహం మొదలైన మాత్రలు వాడుకుంటున్నవాళ్లు థైరాయిడ్ మాత్ర వేసుకున్న ఈ మాత్ర వేసుకున్న నాలుగు గంటల తర్వాత మాత్రమే వేసుకోవాలి. ఇలా మాత్రలకు ఎడం పాటించడం వల్ల థైరాయిడ్ మాత్రను శరీరం సంపూర్తిగా శోషించుకోగలుగుతుంది.

శరీర సక్రమ జీవక్రియలకు కీలకం

మన శరీరంలోని అవయవాలన్నిటి పనితీరును నియం



త్రించడం థైరాయిడ్ హార్మోన్ ప్రధాన బాధ్యత. ఈ గ్రంథి నుంచి హార్మోన్ సరైన మోతాదులో విడుదలవుతున్నంత కాలం ఆయా అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. హార్మోన్ స్రావం తగ్గితే, అవయవాల సామర్థ్యాలు, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే సామర్థ్యాలు కూడా తగ్గుతాయి. కాబట్టే థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు బరువు పెరగడం, నిస్సత్తువ ఆవరించడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. హైపర్ థైరాయిడిజంలో హార్మోన్స్ ఎక్కువగా విడుదలవుతాయి. దాంతో శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరిగి మిగతా అవయవాలన్నీ అవసరానికి మించి పని చేయడం మొదలుపెడతాయి. దాంతో గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. చేతుల్లో వణుకు, కళ్లు పెద్దగా విప్పారడం, బరువు తగ్గిపోవడం, ఆందోళన లాంటి లక్షణాలు మొదలవుతాయి.

పిండం మెదడు ప్రభావితం

గర్భంలో పెరిగే బిడ్డ మెదడు ఎదుగుదలలో థైరాయిడ్ హార్మోన్ కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి గర్భం దాల్చిన తొలి త్రైమాసికంలోనే గర్భిణుల్లో థైరాయిడ్ గ్రంథి పనితీరును పరీక్షించాల్సి ఉంటుంది. గర్భిణుల్లో హైపో లేదా హైపర్ ఈ రెండు థైరాయిడ్ సమస్యల్లో ఏ ఒక్కటి ఉన్నా, గర్భంలో పెరిగే బిడ్డ మీద ప్రభావం పడి, ప్రసవం తర్వాత బిడ్డ పాలు తాగలేకపోవడం, బరువు పెరగడంలో ఇబ్బందులు ఎదురవడం, నిద్ర సమస్యలు, బిడ్డ శరీరంలోని మృదువైన ప్రదేశాలు గట్టిపడకపోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి గర్భం దాల్చినప్పటి నుంచి మూడో నెల నిండేవరకూ ప్రతి నాలుగు నుంచి ఆరు వారాలకూ వైద్యుల పర్యవేక్షణలో థైరాయిడ్ పరీక్షలు చేయించుకుంటూ హార్మోన్ స్రావాన్ని కనిపెడుతూ ఉండాలి. అలాగే గర్భిణుల్లో మాయ నుంచి విడుదలయ్యే

క్యాబేజీ, కాలీఫ్లవర్ తినడం మానేయడం మంచిది. అలాగే అయొడిన్ కలిగి ఉన్న పదార్థాలు ఎక్కువగా తినాలి. పాలు, సముద్రాహారం, పాలు, పాల ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవాలి.

ప్లాసెంటల్ కొరియానిక్ హార్మోన్, థైరాయిడ్ హార్మోన్‌కు దగ్గరగా ఉంటుంది. దాంతో గర్భిణుల్లో థైరాయిడ్ హార్మోన్ మోతాదులు పెరిగినట్టు తప్పుగా నిర్ధారణ అవుతూ ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పరీక్షలతో హార్మోన్ మోతాదులను క్రమం తప్పకుండా అంచనా వేస్తూ, వైద్యుల సూచన మేరకు మాత్రలు వాడుకోవాలి. అలాగే నెలలు గడిచేకొద్దీ గర్భంలో పెరిగే బిడ్డ థైరాయిడ్ హార్మోన్ అవసరత కూడా పెరుగుతూ ఉంటుంది. తల్లి నుంచి పిండం తనకు సరిపడా థైరాయిడ్ హార్మోన్‌ను గ్రహిస్తూ ఉంటుంది. కాబట్టి గర్భిణిలో ఆ డిమాండ్‌కు సరిపడా హార్మోన్ తయారవుతూ ఉండాలి. కాబట్టిప్రతి నాలుగు వారాలకు రక్తపరీక్షతో ఈ హార్మోన్ మోతాదును గమనించుకుంటూ అవసరాన్ని బట్టి గర్భిణి సప్లిమెంట్స్ వాడుకోవాల్సి ఉంటుంది.

పరీక్షలు ఎప్పుడు?

శరీర పనితీరు, శక్తిని ఖర్చు చేసుకునే తత్వం, అధిక బరువు, ఒత్తిడి లోనయ్యే సందర్భాలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు... ఇలా వేర్వేరు కారణాల వల్ల శరీరంలో థైరాయిడ్ హార్మోన్ స్రావంలో హెచ్చుతగ్గులు ఏర్పడవచ్చు. ఇలా ఈ గ్రంథి స్రావం అస్తవ్యస్తంగా మారినప్పుడు, దాన్ని గాడిలో పెట్టే చికిత్స తీసుకోక తప్పదు. ఒకసారి హైపో లేదా హైపర్ థైరాయిడిజం నిర్ధారణ అయిన వారు ప్రారంభంలో ప్రతి మూడు నెలలకూ, ఆ తర్వాత ప్రతి ఆరు నెలలకూ పరీక్ష చేయించుకుంటూ గ్రంథి పనితీరును గమనించుకుంటూ ఉండాలి.

అడ్డుకట్ట ఇలా...

థైరాయిడ్ గ్రంథి సక్రమ పనితీరు మనం తీసుకునే అయొడిన్ మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి అయొడిన్ పుష్కలంగా దొరికే చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, అయొడిన్ కలిపిన ఉప్పు, నూనె తీసుకోవాలి.

డాక్టర్ సుభాషిణి
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్,
ఫెర్నాండెజ్ హాస్పిటల్,
హైదరాబాద్

ధ్యానం.. ప్రశాంతతకు మార్గం

ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సహజం. ఫలితంగా చిరాకు, విసుగు, అనాసక్తత ఆవరించి జీవన నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి వీటిని వదిలించుకోవాలంటే మానసిక ప్రశాంతత చేకూర్చుకోవాలి. ఇందుకు అనువైన మార్గం 'ధ్యానం'!

ధ్యానం అనేది కదలికలతో కూడుకున్న వ్యాయామం, కార్యక్రమం, చర్య కాదు. మనసు పెట్టి చేయవలసిన క్లిష్టమైన పని అంతకన్నా కాదు. అదొక విశ్రాంత స్థితి. నిద్రను మించిన లోతైన నిద్రావస్థ స్థితి. ఈ స్థితిలో మనసు స్థిరంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడులు, ఆందోళనలు తొలగి మనసు నిర్మలమవుతుంది. ఆ స్థితికి చేరుకోవడాన్నే 'ధ్యానం' అంటారు. ఆ స్థితికి చేరుకోవడం అంత తేలిక కాదు. మనసులో చెలరేగే ఆలోచనలను ఆపలేని నిస్సహాయులం మనం. ఆలోచనల సంకెళ్లు మన మనసును స్థిమితంగా ఉండనివ్వవు. కాబట్టి ధ్యాన స్థితికి చేరుకోవలంటే మనసులో చెలరేగే ఆలోచనలను బంధించే సహనం, సాధన అవసరం.

ధ్యాన స్థితికి ఎందుకు చేరుకోలేం?

ధ్యానం ప్రారంభించిన మొదట్లో ముందుకు వెళ్లలేకపోతున్న భావన కలగడం సహజం. ఇందుకు కారణం ధ్యానం మీద మనసు లగ్నం కాకపోవడమే! అయితే ధ్యానంలోకి చేరుకోవడానికంటే ముందు రెండు అంశాలను అర్థం చేసుకోవాలి. మన మనసు రెండు పనులు చేస్తూ ఉంటుంది. మొదటిది 'గ్రహింపు', రెండవది 'ఆచరింపు'. ధ్యానంలో ఆచరింపు అనే అంశాన్ని నెమ్మదింపజేసి, గ్రహింపును ఉత్తేజితంగా ఉంచాలి. గాఢమైన నిద్రావస్థ ధ్యాన స్థితికి చేరుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

సన్నద్ధం: ధ్యానం చేయడం కంటే అందుకు సన్నద్ధమవడం కష్టం. అయితే ధ్యానానికి ముందు అందుకు మనసు, శరీరాలను సిద్ధం చేయడం వల్ల ధ్యానం తేలికవుతుంది అని నిపుణులు చెబుతారు.

ఊపిరి, శరీరాలను నెమ్మదించాలి: శ్వాస, మనసు, శరీరం అంతర్గతంగా ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి. శరీరాన్ని విశ్రాంతంగా ఉంచి, శ్వాసను నెమ్మదింపజేస్తే, మనసూ నిశ్చలంగా మారుతుంది. ఈ స్థితిలో నాడీ వ్యవస్థ ప్రేరేపితమవుతుంది. ఫలితంగా ఒత్తిడి తగ్గడం మొదలవుతుంది.

ధ్యానం తేలికగా: ధ్యాన ముద్రలో కూర్చుని 5 సార్లు ఊపిరి పీల్చి వదలాలి. ముక్కుతో గాలి లోపలికి పీల్చుకుని, నోటి ద్వారా బయటకు వదలాలి. ఊపిరి లోతుగా, దీర్ఘంగా కొనసాగాలి. ఊపిరి పీల్చుకునే



సమయంలో వర్తమానంతో కూడిన స్పృహ కలిగి ఉండాలి. ఊపిరి బయటకు వదిలేటప్పుడు కండరాలన్నిటినీ రిలాక్స్ చేయాలి. ఆ సమయంలోనే ఒత్తిడిలు, ఆందోళనలు బయటకు వెళ్లిపోతున్న భావన కలగాలి. ఇలా చేస్తున్నప్పుడు ప్రత్యేకంగా నాలుక, దవడ, కంఠం, నుదుటి మీద మనసు పెట్టాలి.

సక్రమ పద్ధతి: ధ్యానానికి ముందు కొన్ని యోగాసనాలు వేసి శరీరాన్ని తేలికపరచవచ్చు. ధ్యానానికి ఉపకరించే ఆసనాలు... శేతుబంధాసనం, ధనురాసనం, బాలాసనం, అధోముఖ శవాసనం, అర్థ మత్స్యేంద్రాసనం, ఉత్తనాసనం, శుప్త మత్స్యేంద్రాసనం, పద్మాసనం, శవాసనం. ఈ ఆసనాలు వేసే సమయంలో ఊపిరి పీల్చుకున్నదానికంటే ఎక్కువ సమయంపాటు బయటకు వదలాలి అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నెమ్మదిగా సాగాలి.

మనసు ఆనందంగా: బాధను మరిచి, ఆనందాన్ని సొంతం చేసుకోవడమే మన మెదడు ప్రధాన ధ్యేయం. ధ్యానం చేసే సమయంలో కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాలి. అంతా సవ్యంగానే ఉందనే భావన మనసులో నింపుకుంటే ధ్యానంలోకి పయనం సాధ్యపడుతుంది. అందుకోసం మీ జీవితంలో జరిగిన మంచి విషయాలను మననం చేసుకోవాలి. అంతా మంచే జరుగుతుందన్న సంతుష్టకరమైన భావన మనసులో నింపుకోవాలి. ధ్యానం కోసం నిశ్శబ్దమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి.

కోరిక బలంగా: ధ్యానం ఎందుకు చేయదలచుకున్నారో, ఎలాంటి ఫలితం కోరుకుంటున్నారో జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ధ్యానానికి ముందు ఇలాంటి లోతైన ఆలోచన ధ్యానబలాన్ని పెంచుతుంది.

ఉన్నది ఉన్నట్టు స్వీకరించాలి: ప్రారంభంలో మనసులో ఆలోచనలు చెలరేగి ధ్యానానికి భంగం కలగవచ్చు. ఆ సమయంలో మిమ్మల్ని మీరు విమర్శించుకోకుండా ఆ ఆలోచనలను అంగీకరించి, వాటిని దూరం చేసుకోవడం మీద పట్టు సాధించాలి. ఉన్నది ఉన్నట్టు స్వీకరించి మెరుగైన ధ్యానం కోసం ఆలోచనల మీద పట్టు సాధించాలి.

ఏకాగ్రతను అభినందించాలి: ఏదైనా వస్తువును ఉపయోగిస్తే మనసు లగ్నమవడం తేలికవుతుంది. అలా చేయడం పొరపాటు కాదు. మనసు కేంద్రీకృతమయ్యేవరకూ ఏ వస్తువు మీదైనా మనసు లగ్నం చేయవచ్చు. అయితే ఆ సమయంలో మనసులో చోటుచేసుకునే నెమ్మదితనాన్ని గమనించాలి. ఏకాగ్రత కోసం మనసుకు శిక్షణ ఇచ్చే సమయంలోనే ఆనందాన్ని గ్రహించేలా కూడా మనసు శిక్షణ పొందుతుంది. కాబట్టి ధ్యానంలో పట్టు సాధించడం కోసం ఏదైనా వస్తువును ఉపయోగించు కోవచ్చు. అయితే అది వెలుగు విరజిమ్మేలా ఉండాలి.

మీకు తెలుసా?

రోజూ కొబ్బరినూనె తీసుకొంటే...

కీటో డైట్‌లో కొబ్బరినూనె ప్రధాన పాత్ర పోషిస్తుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఈ డైట్‌ను అనుసరించలేని వాళ్లు కొబ్బరినూనెతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే ప్రతి రోజూ ఒక టీస్పూను కొబ్బరినూనె తీసుకోవచ్చు. కొబ్బరి నూనె ఎందుకంటే...

- కొబ్బరినూనెలో మీడియం చైన్ ట్రైగ్లిసరైడ్స్ ఉంటాయి. వీటిలో శక్తి వేగంగా ఖర్చవడంతో పాటు, కొవ్వు కూడా త్వరితంగా కరుగుతుంది
- పేగుల్లోని హానికారక బ్యాక్టీరియాను సంహరించి, పోషక శోషణను పెంచి, పేగుల ఆరోగ్యాన్ని పెంచే శక్తి కొబ్బరినూనెకు ఉంటుంది
- చర్మం తేమతో, మెరుపులీనుతూ ఉండడానికి అవసరమైన కొవ్వులు కొబ్బరి నూనెలో ఉంటాయి.



- కొబ్బరినూనెలోని మీడియం చైన్ ట్రైగ్లిసరైడ్స్ మెదడు చురుకుదనాన్ని పెంచుతాయి. దాంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో యాంటీబ్యాక్టీరియాల్ గుణాలు కలిగిన లారిక్ యాసిడ్ ఇన్‌ఫెక్షన్లతో పోరాడుతుంది.
- ఆకలిని తగ్గించి, కడుపు నిండిన భావనకు లోను చేసి, అవసరానికి మించిన ఆహారం జోలికి వెళ్లకుండా నియంత్రిస్తుంది. ఫలితంగా అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకోకుండా ఉంటాయి.

పోషకం

మెగ్నీషియం మతలబులు

ఇటీవలి కాలంలో మెగ్నీషియం లోపం సర్వత్రా పెరిగింది. ఈ పోషకం ఎన్నో కీలకమైన జీవ క్రియలకు సహాయపడుతూ ఉంటుంది. కండర సామర్థ్యం, అధిక రక్తపోటు, నిద్రల్లో కీలక భూమిక పోషించే మెగ్నీషియం లోపాన్ని ఎలా భర్తీ చేసుకోవచ్చో తెలుసుకుందాం!

- క్యాల్షియం, జింక్, క్యాల్షియంలతో కలిపి తీసుకుంటే మెగ్నీషియం శోషణ తగ్గి, దాని సామర్థ్యం తగ్గుతుంది. కాబట్టి మెగ్నీషియంను ఈ సప్లిమెంట్లతో కలిపి తీసుకోకూడదు
- పుల్లని పండ్లలో సిట్రిక్ యాసిడ్‌తో కలిసిన మెగ్నీషియం ఉంటుంది. కాబట్టి మెగ్నీషియం లోపాన్ని భర్తీ చేసుకోవడం కోసం పుల్లని పండ్లను తినొచ్చు.
- ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది.
- నట్స్, సీడ్స్, పొట్టుతీయని ధాన్యాలు, చేపల్లో కూడా ఈ పోషకం ఎక్కువగా ఉంటుంది
- జీడిపప్పు, బాదం, గుమ్మడికాయ విత్తనాలు, పీనట్ బటర్ బీన్స్, సోయా బీన్స్, సోయా పాలతో కూడా మెగ్నీషియంను సరిపడా పొందవచ్చు.
- మెగ్నీషియం ల్యాక్సేటివ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి మోతాదు పెరిగితే విరోచనాలు వేధిస్తాయి. కాబట్టి వైద్యుల సూచన మేరకు సప్లిమెంట్లు కూడా వాడుకోవచ్చు



బిజినెస్

విజయవాడ ● మంగళవారం 28 జనవరి 2025

కెనరా బ్యాంక్ లాభం రూ.4,104 కోట్లు


కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికాని (క్యూ3)కి గాను బ్యాంక్ నికర లాభం స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన 12.25 శాతం వృద్ధితో రూ.4,104 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.3,656 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.32,334 కోట్ల నుంచి రూ.36,114 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలో ఆదాయం పెరగటం సహా మొండి బకాయిలు తక్కువ స్థాయిలో ఉండటం కలిసి వచ్చిందని బ్యాంక్ పేర్కొంది. క్యూ3లో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) 4.39 శాతం నుంచి 3.34 శాతానికి. నికర ఎన్‌పీఏలు 1.32 శాతం నుంచి 0.89 శాతానికి తగ్గినట్లు కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు తెలిపారు. దీంతో స్థూల ఎన్‌పీఏలను 3.5 శాతానికి చేర్చాలన్న లక్ష్యాన్ని తాము చేరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి కూడా 91.26 శాతంగా ఉందని తెలిపారు. డిసెంబరు త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 2.85 శాతం తగ్గుదలతో రూ.9,149 కోట్లుగా నమోదైంది.

గ్లోబల్ వ్యాపారం రూ.24 లక్షల కోట్లకు: డిసెంబరు ముగిసే నాటికి బ్యాంక్ గ్లోబల్ వ్యాపారం 9.3 శాతం వృద్ధితో రూ.24.19 లక్షల కోట్లకు చేరుకుంది. గ్లోబల్ డిపాజిట్లు 8.44 శాతం వృద్ధి చెంది రూ.13.69 లక్షల కోట్లకు చేరుకోగా అడ్వాన్సులు రూ.10.49 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మరోవైపు దేశీయ డిపాజిట్లు రూ.12.57 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా క్యాపిటల్ అడిక్వసీ రేషియో 16.44 శాతంగా ఉంది. డిసెంబరు త్రైమాసికంలో ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చిన రుణాలు 44.33 శాతం, వ్యవసాయ రుణాలు 21.04 శాతంగా ఉన్నట్లు కెనరా బ్యాంక్ పేర్కొంది.

డీప్ లాస్!



స్టాక్ మార్కెట్ భారీ పతనం

రూ.9.28 లక్షల కోట్ల సంపద క్షీణత ● సెన్సెక్స్ 824 పాయింట్లు డౌన్

7 నెలలకు పైగా కనిష్ఠానికి సూచీ ● 23,000 దిగువకి నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాన్ని చవిచూశాయి. ఐటీ, టెలికాం, యుటిలిటీస్, పవర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగ షేర్లలో అమ్మకాలు పెరగడంతో సెన్సెక్స్ ఒక దశలో 923 పాయింట్లు క్షీణించింది. చివరికి సూచీ 824.29 పాయింట్ల (1.08 శాతం) నష్టంతో 7 నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 75,366.17 వద్ద ముగిసింది. నిఫ్టీ 263.05 పాయింట్లు (1.14 శాతం) కోల్పోయి 22,829.15 వద్దకు జారుకుంది. సూచీ 23,000 దిగువకి పడిపోవడం గత ఏడాది జూన్ 6 తర్వాత ఇదే తొలిసారి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 3.51 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.68 శాతం పతనమయ్యాయి.

ఈ నెలలో రూ.32 లక్షల కోట్లు గల్లంతు

అమ్మకాల సునామీలో రూ.9.28 లక్షల కోట్ల మార్కెట్ సంపద గల్లంతైంది. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.410.31 లక్షల కోట్లకు (4.75 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. గత వారాంతం సెషన్‌లోనూ రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. అంటే, రెండో రోజుల్లోనే దాదాపు రూ.15 లక్షల కోట్ల సంపద తరిగిపోయింది. కాగా ఈ జనవరిలో ఇప్పటివరకు బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.32 లక్షల కోట్ల మేర తగ్గింది. మార్కెట్ పతనానికి కారణాలు..

అమెరికా మార్కెట్లకు చైనా డీప్‌సీక్ షాక్

ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్‌కు చెందిన జెమినీ వంటి జనరేటివ్ ఏఐ టూల్స్‌కు పోటీగా చైనా ఏఐ రీసెర్చ్ ల్యాబ్ డీప్‌సీక్ తాజాగా ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్ 'డీప్‌సీక్-ఆర్1'ను విడుదల చేసింది. డీప్‌సీక్ కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో అమెరికన్ టెక్ కంపెనీల ఆధిపత్యానికి తెరదించవచ్చన్న ఆందోళనలతో ఎన్‌విడియాతో పాటు మిగతా టెక్ కంపెనీల షేర్లు ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌లో కుప్పకూలాయి. యూఎస్ మార్కెట్ సూచీల్లో డోజోన్స్ ఒక దశలో 400 పాయింట్లకు పైగా పడిపోగా.. నాస్‌డాక్ ఫ్యూచర్స్ 4 శాతానికి పైగా క్షీణించింది. అంతర్జాతీయంగా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లపై ఇది ప్రతికూల ప్రభావం చూపింది.

ట్రంప్ వాణిజ్య విధానాలతో అనిశ్చితి

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలతో పాటు వాణిజ్య విధానాలతో అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి మార్కెట్ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది.

ఫెడ్ రిజర్వ్ సమీక్ష నేపథ్యంలో అప్రమత్తత

ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ తొలిసారిగా వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ఈ నెల 29న ప్రకటించనుంది. ఇప్పటికే ప్రామాణిక వడ్డీ రేట్లను 1 శాతం తగ్గించిన ఫెడ్.. ఈసారి యథాతథ స్థితినే కొనసాగించవచ్చని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. మార్చి సమీక్షలో తగ్గించే అవకాశాలకూ ట్రంప్ వాణిజ్య విధానాలు అడ్డంకిగా మారవచ్చన్న ఆందోళనల కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తమై అమ్మకాలు పెంచారు. మరో వైపు భారత మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల తరలింపు కొనసాగుతూనే ఉంది. ఇది దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను మరింతగా కుంగదీసింది.

యూబీఐ లాభంలో 28% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.4,604 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.3,590 కోట్లు)తో పోల్చితే లాభం 28 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.29,137 కోట్ల నుంచి రూ.31,375 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం కూడా రూ.25,163 కోట్ల నుంచి రూ.26,958 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ పేర్కొంది. మరోవైపు బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.8 శాతం నుంచి 3.8 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.08 శాతం నుంచి 0.8 శాతానికి దిగొచ్చాయి. ఈ కాలంలో బ్యాంక్ ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 93.42 శాతంగా ఉండగా క్యాపిటల్ అడిక్వసీ రేషియో 15.03 శాతం నుంచి 16.7 శాతానికి పెరిగింది

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,250 ▼	75,400 ▼	1,04,000 ▼
విజయవాడ	83,000 ▲	77,500 ▼	92,500 ▼
విశాఖపట్నం	80,270 ▼	73,580 ▼	90,900 ▼
రాజమండ్రి	82,250 ▼	75,400 ▼	93,900 ▼
ప్రొద్దుటూరు	82,000 ▲	75,840 ▼	92,500 ▼
ముంబై	80,397	73,644	90,274



సిటీ యూనియన్ బ్యాంక్‌కు 7 టెక్నాలజీ అవార్డులు

హైదరాబాద్: సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ).. ఐబీఏ బ్యాంకింగ్ టెక్నాలజీలో ఏడు అవార్డులను గెలుచుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన 20వ వార్షిక టెక్నాలజీ కాన్ఫరెన్స్, ఎక్స్‌పో-2024లో బ్యాంక్ ఏడు విభాగాల్లో ఈ అవార్డులను దక్కించుకుంది. ఐబీఏ నుంచి సీయూబీ వరుసగా ఏడు విభాగాల్లో ఈ అవార్డులను అందుకోవటం ఇది రెండో ఏడాది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ టీ రవి శంకర్ చేతుల మీదుగా సిటీ యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆనంద్, బ్యాంక్ టెక్నికల్ టీమ్ ఈ అవార్డులను అందుకున్నారు. డిజిటల్ సేల్స్, పేమెంట్స్ అండ్ ఎంగేజ్‌మెంట్, ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్, ఫిన్‌టెక్ అండ్ డిజిటల్ పేమెంట్ ఇండెక్స్ (డీపీఐ) అడాప్షన్, ఫైనాన్షియల్ ఇంక్లూజన్, ఏఐ అండ్ ఎంఎల్ వినియోగించటం, టెక్నాలజీ టాలెంట్, అత్యుత్తమ టెక్నాలజీ బ్యాంక్ విభాగాల్లో సీయూబీ ఈ అవార్డులను గెలుచుకుంది.

రూ.2,758 లక్షల కోట్ల డిజిటల్ లావాదేవీలు

ముంబై: దేశంలో డిజిటల్ లావాదేవీలు శరవేగంతో పెరుగుతున్నాయి. 2013లో రూ.772 లక్షల కోట్ల విలువైన 222 కోట్ల డిజిటల్ లావాదేవీలు మన దేశంలో నమోదయ్యాయి. 2024 నాటికి డిజిటల్ లావాదేవీల విలువ రూ.2,758 లక్షల కోట్లకు, లావాదేవీలు 94 రెట్లు పెరిగి 20,787 కోట్లకు చేరాయి. సోమవారం విడుదలైన భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నివేదిక ఈ విషయం తెలిపింది. గత ఐదేళ్లలో దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్యా 5.53 కోట్ల నుంచి రెట్టింపై 10.80 కోట్లకు చేరగా, డెబిట్ కార్డులు మాత్రం పెద్ద మార్పేమీ లేకుండా 80.53 కోట్ల నుంచి 99.09 కోట్లకు చేరాయి.

డిజిటల్ మోసాలపై జర జాగ్రత్త: దేశ బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న డిజిటల్ మోసాలపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ మోసాలను అడ్డుకునేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ఎండీ, సీఈఓలను ఆయన కోరారు. అలాగే తమకు సేవలందించే థర్డ్ పార్టీ సేవలపైనా బ్యాంకులు ఒక కన్నేయాలని కోరారు.

జహీరాబాద్ ప్లాంట్‌లో హాట్సన్ ఆగ్రో ఉత్పత్తి పెంపు

కొత్తగా చాక్లెట్లు, ఫ్రూట్ జ్యూస్‌ల తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చెన్నై కేంద్రంగా పనిచేసే హాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ జహీరాబాద్ సమీపంలోని గోవిందపల్లి వద్ద ఉన్న తన ఐస్‌క్రీమ్ ప్లాంట్‌లో కొత్తగా చాక్లెట్లు, ఫ్రూట్ జ్యూస్ ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఉత్పత్తుల పోర్టుఫోలియోను విస్తరించే వ్యూహంలో భాగంగా వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కంపెనీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సెంథిల్ చెప్పారు. కాగా ఐస్‌క్రీమ్ ప్లాంట్‌లో ఇటీవలి వరకు లక్ష కిలోలు ఉన్న రోజువారీ ఐస్‌క్రీమ్ ఉత్పత్తిని 1.27 లక్షల కిలోలకు పెంచినట్టు ఆయన తెలిపారు. అరుణ్ ఐస్‌క్రీమ్స్ పేరుతో కంపెనీ ఐస్‌క్రీమ్స్‌ను విక్రయిస్తోంది. గోవిందపల్లి ప్లాంటును కంపెనీ రెండు లక్షల కిలోల రోజువారీ ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసింది. ఏప్రిల్-మే నెలల్లో ఏర్పడే వేసవి గిరాకీని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తిని పెంచినట్లు సెంథిల్ తెలిపారు. జహీరాబాద్ ప్లాంటులో ఉత్పత్తి చేసే ఐస్‌క్రీమ్‌ను కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రలకు సరఫరా చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరం హాట్సన్ ఆగ్రో టర్నోవర్ రూ.8,600 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. అందులో సగానికి పైగా పాలు, పెరుగు ద్వారా లభించనుంది. ఐస్‌క్రీమ్ ద్వారా 2023-24లో కంపెనీ రూ.1,100 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	485
చిత్తూరు	543	విశాఖపట్నం	495
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	126
వరంగల్	115	గుంటూరు	120
కరీంనగర్	115	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	104
కర్నూలు	115	నెల్లూరు	109
విశాఖపట్నం	117	అనంతపురం	109
గోదావరి	126		

బుచ్‌కు బైబై..!

సెబీ కొత్త చీఫ్ కోసం అన్వేషణ ప్రారంభం

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కు కొత్త సారథిని నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్వేషణ ప్రారంభించింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ సోమవారం ప్రకటన జారీ చేసింది. ఎందుకంటే, సెబీ ప్రస్తుత చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మూడేళ్ల పదవీకాలం వచ్చే నెల 28తో ముగియనుంది. బుచ్‌పై పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆమె పదవీకాలాన్ని పొడిగించేందుకు కేంద్రం సుముఖంగా లేదనడానికి తాజా ప్రకటనే సంకేతమని చెప్పవచ్చు. 2022 మార్చి 2న సెబీ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఐదేళ్ల పాటు (2017 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు) సెబీ బోర్డు సభ్యురాలిగానూ బాధ్యతలు నిర్వహించారు. ఈ మూడేళ్లలో బుచ్‌పై పలు ఆరోపణలు వచ్చాయి. అదానీ గ్రూప్ నిధుల అక్రమ మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో మాధవి పురి బుచ్‌తో పాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు గోప్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ గత ఆగస్టులో ఆరోపించింది. అయితే, బుచ్ ఆ ఆరోపణలన్నింటినీ ఖండించారు.

స్పోర్ట్స్

'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' బుమ్రా

● అత్యుత్తమ వన్డే ప్లేయర్‌గా మంధాన



దుబాయ్: భారత పేస్‌గన్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఐసీసీ పురుషుల 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు. గతేడాది అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన బుమ్రా ఆడిన 13 మ్యాచ్‌ల్లో 14.92 సగటుతో 71 వికెట్లు పడగొట్టాడు. 2024 భారత జట్టు విజయాల్లో బుమ్రాదే కీలక పాత్ర. 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం ఇంగ్లండ్ ప్లేయర్లు బ్రూక్, రూట్, కమిందు మెండిస్ (శ్రీలంక) పోటీపడినా.. వారందరినీ వెనక్కునెట్టి బుమ్రా అవార్డును సొంతం చేసుకొన్నాడు. 2018లో విరాట్ కోహ్లీ తర్వాత ఈ అవార్డుకు ఎంపికైన భారత ఆటగాడిగా నిలిచాడు.



వన్డేల్లో స్మృతి: మహిళల అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో పరుగుల వరదపారించిన భారత డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన ఐసీసీ మహిళల 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును దక్కించుకొంది. లారా వొల్వార్ట్ (దక్షిణాఫ్రికా), టామీ బ్యూమాంట్ (ఇంగ్లండ్), హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్) కూడా అవార్డు కోసం పోటీపడ్డారు. అయితే, గతేడాది 13 ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 747 పరుగులు సాధించిన మంధాన ఈ అవార్డును సొంతం చేసుకొంది. 2018, 2022లో మంధాన 'ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచింది.

రంజీ బరిలో కోహ్లీ

భద్రతా ఏర్పాట్లు పటిష్టం

న్యూఢిల్లీ: పుష్కర కాలం తర్వాత విరాట్ కోహ్లీ రంజీ ట్రోఫీ బరిలో దిగుతున్నాడు. ఈనెల 30 నుంచి ఇక్కడి అరుణ్ జైట్లీ స్టేడియంలో రైల్వేస్‌తో జరిగే మ్యాచ్‌లో విరాట్ ఆడనున్నాడు. ఈమేరకు సోమవారం ప్రకటించిన ఢిల్లీ జట్టులో కోహ్లీ పేరు కూడా ఉంది. ప్రాక్టీస్‌తోపాటు మ్యాచ్ సందర్భంగా కూడా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టనున్నట్టు ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) కార్యదర్శి అశోక్ శర్మ తెలిపాడు. మామూలుగా రంజీ మ్యాచ్‌లకు స్టేడియంలో ఒకటే స్టాండులో అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తారు. కానీ విరాట్ ఆడుతుండడంతో మూడు స్టాండ్స్‌లో ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించాడు. ఇదిలావుండగా హరియాణాతో జరిగే మ్యాచ్‌లో కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్ ఆడనున్నాడు. హైదరాబాద్ తరఫున పేసర్ సిరాజ్, సౌరాష్ట్ర తరఫున జడేజా ఆడడానికి సమ్మతి తెలిపారు. అయితే, బీసీసీఐ అవార్డుల కార్యక్రమం కారణంగా రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్ ముంబై ఆఖరి లీగ్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం లేదు.


డకెట్

పిచ్

రాజ్‌కోట్ వికెట్‌పై బ్యాటర్లదే హవా. ఇక్కడ జరిగిన ఐదు టీ20ల్లో తొలి ఇన్నింగ్స్ సగటు 189. అలాగే తమ చివరి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 228/5 స్కోరు సాధించింది. అంతేకాకుండా ఈనెలారంభంలో భారత మహిళల జట్టు రెండు వన్డేల్లో ఐర్లాండ్‌పై 370, 435 పరుగులతో బెంబేలెత్తించింది. దీంతో ఇరు జట్ల నుంచి పరుగుల వరద ఖాయమే.

రాజ్‌కోటలో పాగా ఎవరిదో?

నేడు మూడో టీ20

సిరీస్‌పై భారత్ దృష్టి ● ఇంగ్లండ్‌కు చావోరేవో

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..


సూర్యకుమార్

రాజ్‌కోట్: భారత స్పిన్నర్లకు.. ఇంగ్లండ్ పేసర్లకు మధ్య పోరులా సాగుతున్న ఐదు టీ20ల సిరీస్ కీలక దశకు చేరుకుంది. మంగళవారం రాజ్‌కోట్‌లో ఇరు జట్ల మధ్య మూడో మ్యాచ్ జరుగనుంది. ఇప్పటికే 2-0తో ఆధిక్యంలో ఉన్న టీమిండియాకు ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ దక్కుతుంది. అటు పర్యాటక ఇంగ్లండ్ మాత్రం తీవ్ర ఒత్తిడిలో ఉంది. వరుసగా రెండు మ్యాచ్‌ల ఓటమి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసినట్టయ్యింది. చెన్నైలో వారికి గెలుపు అవకాశం వచ్చినా తిలక్ ధాటికి చేజారింది. ఇక సిరీస్‌లో సజీవంగా ఉండాలంటే నేటి మ్యాచ్‌లో వారికి విజయం తప్ప మరో దారి లేదు.

సూర్య ఫామ్‌పై ఆందోళన: గతేడాది సూర్యకుమార్ టీ20 జట్టు పగ్గాలు చేపట్టాక భారత్ దూసుకెళ్తోంది. కానీ అతడి ఫామ్ మాత్రం ఆందోళనకరంగా మారింది. చివరి 10 ఇన్నింగ్స్‌లో ఒకే అర్ధసెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లోనూ అతడు ఈడెన్‌లో డకౌట్ కాగా, రెండో మ్యాచ్‌లో 12 పరుగులే చేశాడు. అలాగే శాంసన్ షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో తడబడుతున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ ఉన్న కాసేపు ధాటిగా ఆడుతున్నాడు. తిలక్ మాత్రం అద్వితీయ ఫామ్‌తో ఆకట్టుకుంటున్నాడు. జురెల్ స్థానంలో శివమ్ దూబే, రమణ్‌దీప్‌లలో ఒకరికి చోటు లభించవచ్చు. అలాగే మధ్య ఓవర్లలో లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్‌ను ఎదుర్కొనేందుకు దూబేను బరిలోకి దింపవచ్చు. ఏకైక స్పెషలిస్ట్ పేసర్ అర్ష్‌దీప్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి చెన్నైలో పరుగులు సమర్పించుకున్నారు. పేస్‌ను బలోపేతం చేయాలనుకుంటే బిష్ణోయ్ స్థానంలో షమిని తీసుకోవచ్చు. మరోవైపు స్థానిక పిచ్ బౌలర్లకు సవాల్‌గా మారనుంది. కాబట్టి టాపార్డర్ వేగంగా ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తే ప్రత్యర్థి ముందు భారీ ఛేదనను ఉంచేందుకు చాన్స్ ఉంటుంది.

బ్యాటింగ్ బలహీనంగా..: చెన్నై మ్యాచ్ బరిలోకి దిగిన జట్టులో ఇంగ్లండ్ ఎలాంటి మార్పులూ చేయలేదు. అదే జట్టుతో రాజ్‌కోట్‌లో ఆడనుంది. ఆ జట్టు టాపార్డర్‌తో పాటు విడిలార్డర్ కూడా పెద్దగా ఆకట్టుకోవడం లేదు. కెప్టెన్ బట్లర్ ఒంటరి పోరాటం సాగిస్తున్నాడు. ఐపీఎల్‌లో భయపెట్టిన ఫిల్ సాల్ట్‌తో పాటు మరో ఓపెనర్ డకెట్ ప్రభావం చూపడం లేదు. బ్రూక్, లివింగ్‌స్టోన్ కూడా తేలిపోతున్నారు. తన తొలి టీ20లో జేమీ స్మిత్ ఆకట్టుకున్నా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కార్స్ భారీ షాట్లతో కాసేపు భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టగలిగాడు. అలాగే ఇంగ్లండ్.. ఈ మ్యాచ్‌లోనూ పేసర్లపైనే భారం వేయనుంది. కానీ ఆర్చర్ మాత్రం చెన్నైలో ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. స్పిన్నర్ రషీద్ మాత్రమే భారత బ్యాటర్లను కట్టడి చేయగలుగుతున్నాడు.

తుది జట్లు

భారత్ (అంచనా): శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్, జురెల్/దూబే/రమణ్‌దీప్, సుందర్, అక్షర్, బిష్ణోయ్/షమి, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్: డకెట్, సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఒవెర్టన్, కార్స్, ఆర్చర్, రషీద్, ఉడ్.

దేశీయ ఒలింపిక్స్‌కు వేళాయె

నేటి నుంచి ఉత్తరాఖండ్‌లో జాతీయ క్రీడలు | **తెలంగాణ నుంచి 212, ఆంధ్ర నుంచి 165 మంది అథ్లెట్లు** | **పోటీలకు దూరంగా స్టార్ క్రీడాకారులు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచంలోనే అతి పెద్ద జాతీయ క్రీడా పండుగకు ఉత్తరాఖండ్ వేదికైంది. హిమగిరుల పాదల చెంత ఉత్తరాఖండ్ కొండ ప్రాంతాల నడుమ 38వ జాతీయ క్రీడలను అట్టహాసంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచే కొన్ని క్రీడాంశాల్లో పోటీలు మొదలవగా, మంగళవారం డెహ్రాడూన్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా జాతీయ క్రీడలను ప్రారంభించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పది వేల మందికి పైగా అథ్లెట్లు 32 క్రీడాంశాల్లో పోటీ పడనున్నారు. 18 రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు డెహ్రాడూన్ ప్రధాన వేదిక కాగా, మరో ఆరు నగరాలు ఇతర వేదికలు. దేశీయ ఒలింపిక్స్‌గా పిలుచుకునే ఈ క్రీడలు వచ్చే నెల 14వ తేదీ వరకు జరగనున్నాయి.

స్టార్లు లేక వెలవెల: ఒలింపియన్లు నీరజ్ చోప్రా, పీవీ సింధు, మనుభాకర్, నిఖత్ జరీన్, ఇషా సింగ్, ఆర్చరీ వరల్డ్ చాంపియన్ జ్యోతి సురేఖ వంటి స్టార్లు వివిధ కారణాలతో క్రీడలకు దూరమవడంతో స్టార్లు లేని వెలితి స్పష్టంగా కనిపిస్తోంది. ఇక.. బాక్సింగ్‌లో లవ్లీనా, అథ్లెటిక్స్‌లో యర్రాజీ జ్యోతి, జ్యోతికశ్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. తెలంగాణ నుంచి బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్, ఆర్చర్ చికితరావు, ఆంధ్రప్రదేశ్ నుంచి షూటర్ మద్దినేని ఉమామహేష్, వెయిట్‌లిఫ్టర్ పల్లవి రాష్ట్ర పతాకధారులుగా వ్యవహరించనున్నారు.


జ్యోతి

క్రీడాకారుల పాలిట శాపంగా శాట్, శాప్!

ఈ క్రీడల్లో తెలంగాణ నుంచి 212 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 165 మంది తలపడుతున్నారు. అయితే, రెండు రాష్ట్రాల్లోనూ శాట్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ), శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అలక్ష్యం క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. సరైన సన్నద్ధత లేకుండా క్రీడాకారులు ఉత్తరాఖండ్‌కు బయలుదేరారు. తెలంగాణలో ఆఖరి నిమిషం వరకు క్రీడలకు బడ్జెట్ కేటాయించకపోవడంతో క్రీడాకారులకు కిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. కిట్ బ్యాగులపై భారత ఒలింపిక్ సంఘం లోగోను కూడా శాట్ సరిగ్గా ముద్రించలేకపోయింది. ఇక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్కటే ఒలింపిక్ సంఘం ఉన్నా శాప్ బాధ్యతరాహిత్యంతో ఇప్పటికి సగం మంది క్రీడాకారులకు కిట్లు అందలేదు. ఏపీ ఒలింపిక్ సంఘం సొంత నిధులతో 115 మంది క్రీడాకారులకు కిట్లు అందించింది. శాప్‌లోని ఓ అధికారి ఒంటెద్దు పోకడలతో కిట్లు లేకుండానే పలువురు క్రీడాకారులు ఉత్తరాఖండ్ పయనమ

34 ఏళ్ల తర్వాత..

పాక్ గడ్డపై విండీస్ విజయం



ముల్తాన్: పాకిస్థాన్‌తో మూడు రోజుల్లో ముగిసిన రెండో టెస్టులో వెస్టిండీస్ 120 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే రెండు టెస్టుల ఈ సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 1990, నవంబరులో విండీస్ జట్టు పాక్‌లో చివరిసారి టెస్టు నెగ్గింది. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన లెఫ్టామ్ స్పిన్నర్ జోమెల్ వారికన్ ఈ సారి 5 వికెట్లతో దెబ్బతీశాడు. 254 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 76/4తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు 133 రన్స్‌కే కుప్పకూలింది. బాబర్ (31), రిజ్వాన్ (25) మాత్రమే రాణించారు. సింక్లెయిర్‌కు 3, మోటీకి 2 వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా రెండు టెస్టుల సిరీస్‌లో స్పిన్నర్లకే 69 వికెట్లు లభించడం ఇదే తొలిసారి. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 163, పాక్ 154 పరుగులు, విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 రన్స్ సాధించాయి.

సెమీఫైనల్లో ఇంగ్లండ్

అండర్-19 మహిళల వరల్డ్ కప్

కుచింగ్ (మలేసియా): ఇంగ్లండ్ జట్టు అండర్-19 మహిళల ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరింది. సోమవారం జరిగిన గ్రూప్-2 సూపర్ సిక్స్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6 వికెట్లతో న్యూజిలాండ్‌ను ఓడించింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 89 పరుగులకే కుప్పకూలింది. 90 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 11.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కాగా..ఇప్పటికే సెమీస్ చేరిన భారత జట్టు మంగళవారం జరిగే గ్రూప్-1 సూపర్ సిక్స్ రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుంది.



భారత జీఎం వైశాలికి షేక్‌హ్యాండ్ ఇవ్వనన్నాడు

తర్వాత వివరణ ఇచ్చుకున్న ఉజ్బెక్ ఆటగాడు

విక్ ఆన్ జీ: ఇక్కడ జరుగుతున్న టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ నోడిర్బెక్ యాకుబోయెవ్ ప్రవర్తించిన తీరు విమర్శలకు దారితీసింది. ఎల్లెడెలా విమర్శలు వెల్లువెత్తడంతో తర్వాత అతడు క్షమాపణ చెప్పాడు. ఇంతకీ ఏమైందంటే..నోడిర్బెక్‌తో చాలెంజర్స్ నాలుగో రౌండ్‌కు ముందు అతడితో వైశాలి కరచాలనం చేయబోయింది. కానీ ఉజ్బెక్ ఆటగాడు అందుకు నిరాకరించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో..యాకుబోయెవ్ తీరుపై చెస్ అభిమానులు, నెటిజన్లు మండిపడ్డారు. దాంతో తన ప్రవర్తనపై 23 ఏళ్ల నోడిర్బెక్ వివరణ ఇచ్చాడు. 'వైశాలి, ఆమె సోదరుడిపట్ల నాకెంతో గౌరవం ఉంది. మతపరమైన ఆచారాల కారణంగా ఇతర స్త్రీలను తాకను. అయితే నా ప్రవర్తనతో వైశాలి నొచ్చుకున్నట్టయితే క్షమించాలి' అని నోడిర్బెక్ కోరాడు.

జూలై నాటికి ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. పోలవరం ఎడమ కాలువ టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. టెండర్లు ఖరారైన ఏజెన్సీలన్నీ జూలై నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. '2019లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ఉంటే పోలవరం పూర్తయ్యేది. 17 నెలలపాటు జగన్ ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థ లేకుండా చేయడంతో.. 2020 వరదల్లో డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలోగా పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల ద్వారా పోలవరం ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి నీటిని తరలించాలన్న సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పునఃప్రారంభిస్తాం. పోలవరం ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీలతో జరిపిన సమీక్షలో మొదటి ప్యాకేజీ నుంచి ఎనిమిదో ప్యాకేజీ వరకూ ఇరిగేషన్, రెవెన్యూ, నేషనల్ హైవే, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలన్నింటి మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించాం. భూసేకరణ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నాం. పనులు ఏరోజుకారోజు తెలుసుకునేలా రియల్‌టైమ్ వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నాం' అని చెప్పారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల కాంటూరు.. 45.72 మీటర్ల కాంటూరుగా విభజించి.. తొలి, మలిదశ అంటూ నివేదికలు పంపి.. ఆమోదం పొందారని చెప్పారు. ఇప్పుడు తప్పు జరిగిపోతోందంటూ సొంత పత్రికలో గగ్గోలు పెడుతూ కథనాలు ప్రచురించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పోలవరం ఎడమ కాలువ ప్యాకేజీలకు ఆమోదం

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా ఎడమ ప్రధాన కాలువ ద్వారా పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల ద్వారా ఉత్తరాంధ్రకు సాగునీరు, తాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించేందుకు జల వనరుల శాఖ కార్యాచరణ చేపట్టింది. ఎనిమిది ప్యాకేజీల ద్వారా రూ.3,198 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. వీటిని ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలనికాంట్రాక్టు సంస్థలతో ఒప్పందం చేసుకుంది. రూ.254.88 కోట్లకు మొదటి ప్యాకేజీ పనులు (25.6 కిలోమీటర్లు) హైదరాబాద్‌కు చెందిన ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారు. రూ.171.39 కోట్లతో 1ఏ ప్యాకేజీ సూర్యకాన్స్‌కు, మిగిలిన అత్యవసర పనులు మెస్సర్స్ ఎన్‌సీసీకి రూ.17.75 కోట్లకు ఇచ్చారు.

- 25.6 కిమీ నుంచి 51.60 కిమీ దాకా ప్యాకేజీ -2.. ఈ పనుల విలువ రూ.233.42 కోట్లు.. హైదరాబాద్‌కు చెందిన సోమ, పటేల్‌కు అప్పగింత. 33.559 కిమీ నుంచి నేషనల్ హైవే క్రాసింగ్ పనులు వెంకటరాజు ఇంజనీర్స్ రూ.26.51 కోట్లకు, వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్‌కు రూ.19.82 కోట్లకు.
- 51.600 కిమీ నుంచి 69.145 కిమీ దాకా ప్యాకేజీ -3.. రూ.233.42 కోట్ల పనులు మేటాస్-ఎన్‌సీసీకి. మరో రూ.73.66 కోట్ల పనులు కేఎంవీ ప్రాజెక్టుకు, మిగిలిన అత్యవసర పనులు..క్రాసింగ్ పనులు రూ.122.62 కోట్లకు ఎన్‌సీసీకి అప్పగింత. బీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు రూ.23.45 కోట్ల పనులు.. ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు రూ.15.27 కోట్ల పనులు.
- 69.145 కిమీ నుంచి 93.700 కిమీ దాకా ప్యాకేజీ-4.. రూ.123.65 కోట్ల పనులు సబీర్ డ్యామ్, వాటర్‌వర్క్స్‌కు.. రూ.170.699 కోట్ల పనులు ఆర్ఎస్ఆర్-సజిట్టల్‌కు. 77.175 కిమీ వద్ద క్రాసింగ్ పనులు రూ.15.803 కోట్లతో ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు అప్పగింత. 88.035 కిమీ వద్ద రూ.18.46 కోట్లతో క్రాసింగ్ పనులు సూర్యకాన్స్‌కు.
- ప్యాకేజీ-5లో రూ.181.36 కోట్ల పనులు సబీర్ డ్యామ్‌కు, మరో రూ.182.97 కోట్ల పనులు పీఎస్‌కే-హెచ్ఈఎస్‌కు.. రూ.307.41 కోట్ల పనులు ఆర్‌వీఆర్ స్టార్ ఇన్‌ఫ్రాకు.. రూ.28.24 కోట్లతో క్రాసింగ్ పనులు పీఎస్‌కేకు అప్పగింత.
- ప్యాకేజీ-6లో రూ.126.18 కోట్ల పనులు మధుకాన్-సినో హైడ్రోకు.. రూ.331.73 కోట్ల విలువైన పనులు బీఎస్ఆర్‌కు అప్పగింత.
- ప్యాకేజీ-7లో రూ.330,73 కోట్ల పనులు కేసీఎల్-జేసీసీజీ జాయింట్ వెంచర్‌కు, రూ.58.112 కోట్ల పనులు ఐవీఆర్‌సీఎల్-స్యూకు.. రూ.58.112 కోట్ల పనులు ఏసీఎల్‌కు.
- రూ.6.577 కోట్లతో ప్యాకేజీ-8 పనులు ఆర్‌కేఎస్ ఇన్‌ఫ్రాకు అప్పగింత.

రీచ్‌లకు కొత్త కళ



- ఎక్కడ పడితే అక్కడ ఇసుక లభ్యం
- దాదాపుగా అన్నిచోట్ల తెరుచుకున్న రీచ్‌లు
- జోరుగా తవ్వకాలతో పుంజుకొన్న నిర్మాణరంగం
- ఉచితం అమలుతో సామాన్యుడికి ఊరట
- గత ప్రభుత్వంలో మాఫియా గుప్పిట ఇసుక
- 'పశ్చిమ'లో లారీ ఇసుక రవాణాకు ఏకంగా రూ.15వేలు
- ఇప్పుడు అక్కడ పదివేలకే అందుబాటులోకి..
- కృష్ణాలో ట్రాక్టరు ఇసుక నాడు రూ.4వేలకు సరఫరా
- రూ.1300 కే అందుతున్నవైనం

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఇసుక కష్టాలు తొలుగుతున్నాయి. బ్లాక్ మార్కెట్ కూడా దాదాపు అదుపులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లూ రాష్ట్ర నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుకను మాఫియా గుప్పిట పట్టింది. బడా నిర్మాణ సంస్థలు, బిల్డర్లకు సైతం ఇసుక దొరకని పరిస్థితి. దీంతో ఇసుక లభ్యత లేక నిర్మాణ పనులు స్తంభించిపోయాయి. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పనులు లేక, పస్తులు పడుకోలేక వారిలో చాలామంది రోడ్డునపడ్డారు. సామాన్యులకు గమేళా ఇసుక కూడా దొరికేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుక కష్టాలు, బాధలు తొలగించేందుకు నడుంబిగించింది. ఉచిత ఇసుక పథకాన్ని తెచ్చింది. ఈ పథకం మంచిదే అయినా, ఇసుక వనరుల కొరత వల్ల మొదట్లో కొన్ని ఇబ్బందులు తప్పలేదు. అమలులో పలు లోటుపాట్లు, అడ్డంకులు ఎదురయ్యాయి. స్టాక్ పాయింట్ల వద్ద అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. అయితే, ప్రజల నుంచి వస్తున్న అసంతృప్తిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం కూడా గమనిస్తూ ఉచిత ఇసుక పథకంలోని లోటుపాట్లను సవరిస్తూ వస్తోంది. ఇసుక కొరత అనేది లేకుండా చూడగలిగితే పరిస్థితిని పూర్తిగా అరికట్టవచ్చని ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఇసుక రీచ్‌లపై దృష్టి సారించింది. రాష్ట్రంలోని దాదాపుగా అన్ని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు తాజాగా ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం అంచనా వేసినట్టే ఇసుక సామాన్యుడికి కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఉదాహరణకు గత వైసీపీ పాలనలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కపిలేశ్వరపురం, తాతపూడి, ఓబలంక, వద్దిపర్రు రీచ్‌ల్లో ట్రాక్టరు ఇసుక రవాణాకు రూ.నాలుగువేలు - ఐదువేలుకు ఖర్చయ్యేది. ఇప్పుడు అదే ఇసుకను రూ. 2,800కు తరలిస్తున్నారు. కృష్ణాజిల్లా కంచికచర్లలో ట్రాక్టరు ఇసుకను నాడు రూ. 3500 నుంచి రూ. 4000కు రవాణా చేసేవారు. ఈ ధరకు కూడా అంత తేలికగా ఇసుక దొరికేది కాదు. అర్ధరాత్రుళ్లు ఎవరి కంట పడకుండా దొంగతనంగా తెచ్చుకోవాల్సి వచ్చేది. ఉచిత ఇసుక విధానం వచ్చాక ఈ రీచ్‌లో బుక్ చేసుకున్నవారికి ట్రాక్టరు ఇసుక రూ.1300లకు లభిస్తోంది. ఎక్కువ పరిమాణంలో కావల్సి వస్తే రూ. 1200లకే సరఫరా చేస్తున్నారు. ఏలూరు జిల్లా పట్టిసీమ రీచ్‌లో రోజుకు 400 టన్నుల మేర ఇసుక తవ్వుతున్నారు.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని పీపర్రు, పందలపర్రు, ఔరంగాబాదు రీచ్‌లనుంచి ఏలూరు జిల్లా తాడేపల్లిగూడేనికి ఇసుక తెచ్చుకోవాలంటే గత ప్రభుత్వంలో లారీకి రూ. 15 వేలు చొప్పున ఖర్చయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకున్న చర్యల ఫలితంగా ఇప్పుడు ఈ రీచ్‌ల్లో లారీ ఇసుకను 10-11 వేలకు సరఫరా చేస్తున్నారు.

నాడు వైసీపీలో ఉండి.. నేడు టీడీపీలో చేరి.. మమ్మల్ని వేధిస్తున్నారు!

» గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించిన వైసీపీ బాధిత దంపతులు



గుంటూరు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన వైసీపీ బాధిత కుటుంబం

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొందరు నాయకులు నాడు వైసీపీలో ఉండి సతాయించారని, ఇప్పుడు టీడీపీలో చేరినా.. టీడీపీకే చెందిన తమను వేధిస్తున్నారని మంగళగిరి రూరల్ మండలం బేతపూడి గ్రామానికి చెందిన కల్వకుల్లు దుర్గారావు, రమాదేవి దంపతులు, దుర్గారావు తల్లి వాపోయారు. ఈమేరకు సోమవారం వారు గుంటూరు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఎస్పీ కార్యాలయానికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. దుర్గారావు దంపతులు బేతపూడిలో కిరాణా షాపు నిర్వహిస్తుంటారు. 2019 ఎన్నికల సమయంలో గ్రామానికి చెందిన, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడైన వైసీపీ నాయకుడు పాములపాటి శివారెడ్డి, మరికొందరు షాపు వద్దకు డబ్బు సంచులతో వచ్చి ఓటర్లకు పంచుతుండగా దుర్గారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వారు ఆయనపై దాడి చేసి కొట్టారు. ఎన్నికల్లో వైసీపీ గెలిచి అధికారం చేపట్టిన వెంటనే.. గ్రామంలో వాణిజ్య సముదాయంలో 100 గజాలలో ఉన్న దుర్గారావు షాపును, తన చెల్లెల్ని అడ్డుపెట్టుకుని, తప్పుడు రిజిస్ట్రేషన్‌తో ఆక్రమించారు. అంతేగాక శివారెడ్డి రెండు దఫాలు రౌడీలతో కలిసి దుర్గారావుపై హత్యాయత్నం చేశాడు. దీనిపై ఆయన మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా అప్పట్లో పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. దీంతో ప్రాణభయంతో కుటుంబంతో సహా విజయవాడకు మకాం మారారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే శివారెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాడు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేయమని టీడీపీ పార్టీ కార్యాలయాన్ని, మంత్రి లోకేశ్‌ను మూడు సార్లు కలిసినప్పటికీ ఇంతవరకు న్యాయం జరగలేదు' అని దుర్గారావు పేర్కొన్నారు. శివారెడ్డి.. అటు పార్టీ నాయకులను ఇటు పోలీసులను ప్రభావితం చేస్తూ తమకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. ఇప్పటికీ తమపై కక్ష సాధింపు కొనసాగిస్తూ హత్యాప్రయత్నాలు చేస్తున్నాడని, తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

వచ్చే వేసవిలో 260 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్!

- పీక్ లోడ్ డిమాండ్ 13,700 మి.యూ.గా అంచనా
- దానిని తట్టుకోవడానికి ప్రభుత్వం సమాయత్తం
- జెన్కో కేంద్రాల్లో ఉత్పత్తి పెంచాలని సీఎస్ ఆదేశం
- ఎండాకాలంలో కరెంటు కొరత రాకూడదని స్పష్టీకరణ

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎండలు మండిపోతాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది గరిష్ఠంగా 260 మిలియన్ యూనిట్ల కరెంటు డిమాండ్ నమోదయ్యే వీలుందని ఇంధన శాఖ అంచనా వేస్తోంది. అదేవిధంగా పీక్ డిమాండ్ 13,700 మిలియన్ యూనిట్లు ఉంటుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి తదితరులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డిమాండ్‌ను తట్టుకుని రోజంతా విద్యుత్ సరఫరా చేసేలా జెన్కో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని.. అవసరమైన బొగ్గును కూడా సమకూర్చుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీన జెన్కో 5,250 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసి ఆల్ టైమ్ రికార్డు సాధించినందుకు అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని వేసవి ముగిసే వరకూ కొనసాగించాలన్నారు. వేసవిలో విద్యుత్ కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ మార్కెట్లో కరెంటు కొనకుండా.. స్వీయసామర్థ్యాల పెంపు ద్వారా జెన్కో విద్యుత్ కేంద్రాలు గరిష్ఠ ఉత్పత్తికి ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు.

కేటీ ఉజేలా అవినీతిపై విచారణ

» ఆర్‌పీ సిసోడియాకు బాధ్యతలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను హోంగార్డు ఉద్యోగాల పేరుతో మోసగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారి కే త్రిపాఠి ఉజేలాపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సిసోడియాను విచారణాధికారిగా, డీజీ ర్యాంకు అధికారి మాదిరెడ్డి ప్రతాప్‌ను ప్రభుత్వం తరఫున ప్రజెంటింగ్ అధికారిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉజేలా 2015 మార్చి నుంచి 2019 జూలై మధ్య కాలంలో ఏపీ హోంగార్డ్స్ ఏజీ, ఏడీజీగా పనిచేశారు. ఆ సమయంలో పలు ప్రాంతాల నిరుద్యోగులకు హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఉజేలాతో కలిసి జీవిస్తున్న విజయలక్ష్మి పండిట్ ఒక్కొక్కరి నుంచి రూ.7-9 లక్షలు వసూలు చేశారు. ఈ క్రమంలో ఉజేలా గన్‌మెన్‌ల ద్వారా రూ.85 లక్షలు, ఇతరుల ద్వారా మరో రూ.54లక్షలు వసూలు చేశారు. డబ్బులిచ్చిన వారిలో కొంతమందికి ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఉద్యోగాలిచ్చిన ఉజేలా.. చిత్తూరు జిల్లాలో చాలామందికి ఇవ్వలేదు. డబ్బులిచ్చిన వ్యక్తులు ఒత్తిడి చేయడంతో 2022లో తాను హోంగార్డ్సు విభాగంలో లేకపోయినా ఉద్యోగ నియామక పత్రాలిచ్చేశారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకుని ఉద్యోగాల్లో చేరేందుకు వెళ్లగా.. అవి నకిలీవని పోలీసు శాఖ తేల్చింది. దీంతో బాధితులు మంగళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉజేలాతో కలిసి జీవిస్తున్న మహిళతోపాటు ఆయన తండ్రి మహానంద్ త్రిపాఠి.. రూ.52లక్షల వరకూ వసూలు చేసినట్లు విచారణలో తేలింది. మధ్యవర్తిగా ఉన్న వ్యక్తితోపాటు త్రిపాఠి గన్‌మన్ జీవీ రాముడును కూడా విచారించి మొత్తం 8 మందిపై కేసు నమోదు చేశారు. పలువురిని అరెస్టు చేసి ఏ౦ నిందితుడైన ఉజేలాను కస్టడీకి కోరగా కోర్టు నుంచి అనుమతి లభించలేదు. అయితే ఆధారాలు పక్కాగా ఉండటంతో ప్రభుత్వం 2023 డిసెంబరులో ఉజేలాపై అభియోగాలు నమోదు చేసింది. ఇటీవల ఆయన సహచరులకు డీజీలుగా పదోన్నతి లభించగా త్రిపాఠికి దక్కలేదు. దీనిపై మరోసారి ప్రభుత్వానికి ఆయన విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు తేల్చేందుకు ప్రభుత్వం సిసోడియాను విచారణాధికారిగా నియమించింది.

స్వయం ఉపాధి యూనిట్లు 2 నెలల్లో గ్రౌండింగ్: మంత్రి సవిత

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రెండు నెలల్లో బీసీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. సోమవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ... మంత్రిని కలిశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ప్రతి ఇంట్లోను వ్యాపారవేత్తను తయారుచేయాలన్న సీఎం లక్ష్యసాధనలో భాగంగా కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని, స్వయం ఉపాధి కింద యూనిట్లు 100 శాతం గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి' అని కార్యదర్శికి సూచించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

యుద్ధానికి సిద్ధం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హరి హర వీరమల్లు'. ఏ.ఎం. రత్నం, ఎ.దయాకర్ రావు నిర్మాతలు. మార్చి 28న విడుదలవుతోంది. ఈ చిత్రంలో విలన్‌గా నటిస్తున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం సోమవారం పోస్టర్‌ని రిలీజ్ చేసింది. రాజుల కాలం నాటి దుస్తుల్లో ఉన్న బాబీ డియోల్ కత్తి పట్టుకొని యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు పోస్టర్‌లో కనిపించారు. ఈ సినిమాలో అనుపమ్‌ఖేర్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాలోని 'మాట వినాలి' అనే పాటను విడుదల చేయగా అది ప్రేక్షకాదరణను పొందింది. పవన్ కల్యాణ్ ఆ పాటను స్వయంగా పాడారు.

సంక్రాంతికి వచ్చాం.. కొట్టాం!



వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌ను భీమవరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ పాడారు. హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లతో కలసి ఆడారు. 'సంక్రాంతికి వచ్చాం.. కొట్టాం. ఆ ఘనత మీ అందరిదే. అలాగే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన అనిల్‌కు థాంక్స్. మీ ప్రేమాభిమానాలు ఇలాగే ఉంటే మళ్లీ సంక్రాంతికి వస్తాం. మరో బ్లాక్ బస్టర్ హిట్ ఇస్తాం' అన్నారాయన. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సినిమా పెద్ద హిట్ అయితే చాలు అనుకున్నాను. ఈ చిత్రాన్ని మీరు ఎక్కడికో తీసుకెళ్లారు' అని అన్నారు. పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు నిర్మాత శిరీష్ కృతజ్ఞతలు తెలిపారు.

రాయలసీమ అంటే ఏమిటో చూపిస్తాం



అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాచరికం'. ఈశ్వర్ నిర్మాత. ఈనెల 31న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నెగెటివ్ పాత్రలో నటించాను. సురేశ్, ఈశ్వర్ అద్భుతంగా తీశారు' అని అన్నారు. హీరో విజయ్ శంకర్ మాట్లాడుతూ 'రాచరికం' టైటిల్లోనే ఓ రాయాల్టీ ఉంటుంది. రాయలసీమ అంటే ఏమిటో ఈ సినిమా చూపిస్తుంది' అని అన్నారు.



సెట్‌లో సన్మానం

ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారం పొందిన నందమూరి బాలకృష్ణ సోమవారం 'అఖండ 2 తాండవం' చిత్రంలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులకు ఆయనకు స్వాగతం పలికారు. దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఆయన్ని ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు.

లూసిఫర్ మళ్లీ వస్తున్నాడు



మలయాళ నటుడు మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎల్ 2 ఎంపురాన్'. 2019లో విడుదలై సూపర్‌హిట్ సాధించిన 'లూసిఫర్'కు ఇది కొనసాగింపు. స్టీఫెన్ గట్టుపల్లిగా మొదటిభాగంలో అలరించిన మోహన్‌లాల్, రెండో భాగం 'ఎల్ 2 ఎంపురాన్'లో గ్యాంగ్‌స్టర్ అబ్రహాం ఖురేషిగా కనిపించనుండడంతో ఈ సినిమా కోసం అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 27న విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. మలయాళ ఇండస్ట్రీలో మూడు స్తంభాలైనటువంటి మమ్ముట్టి, మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ టీజర్ విడుదల కార్యక్రమంలో తళుక్కుమనడం విశేషం. 2 నిమిషాల 23 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్‌లో మోహన్‌లాల్ పాత్రలోని విభిన్న రకాల షేడ్స్ గురించి ఎలివేషన్ ఇచ్చే విధానం ఆకట్టుకునేలా ఉంది. అత్యున్నత సాంకేతిక విలువలతో కూడిన విజువల్స్, బీజీఎమ్, సంభాషణలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ఈ చిత్రంలో టొవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

గ్రామీణ నేపథ్యంలో...



మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో ఓ చిత్రంలో నటిస్తున్నారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో బాలకృష్ణ, సి.రామశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకు 'బద్మాషులు' అనే టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ ఎంటర్టైనర్ ప్రతీ ఒక్కరినీ కచ్చితంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్:గజ్జల రక్షిత్‌కుమార్, సినిమాటోగ్రాఫర్ : వినీత్ పబ్బతి, సంగీతం: తేజ కూనూరు.

మా 'నీలమ్మ'కు పద్మ అవార్డ్ రావడం ఆనందంగా ఉంది

- నటుడు నారాయణరావు



కళారంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా బెంగాల్‌కు చెందిన నృత్య కళాకారిణి మమతా శంకర్‌కు కేంద్రప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డ్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే మమత కేవలం నృత్యకళాకారిణి మాత్రమే కాదు కొన్ని చిత్రాల్లో నటించారనీ, అందులోనూ తెలుగులో మృణాల్ సేన్ రూపొందించిన 'ఒక ఊరి కథ'(1977) చిత్రంలో మమత హీరోయిన్‌గా నటించారనీ చాలా కొద్దిమందికే తెలిసిన విషయం. మృణాల్ సేన్ దర్శకత్వంలో 1976లో వచ్చిన 'మృగయ' అనే బెంగాలీ చిత్రం ద్వారా మమతా శంకర్ తెరంగేంట్రం చేశారు. ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి హీరోగా నటించారు. ఆవిడ నటించిన రెండో సినిమా 'ఒక ఊరి కథ'. ఆ చిత్ర కథానాయకుడు, సీనియర్ నటుడు నారాయణరావు మమతా శంకర్‌కు పద్మ పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'మా హీరోయిన్ (నీలమ్మ) మమతా శంకర్‌కు పద్మశ్రీ పురస్కారం రావడం చాలా ఆనందంగా ఉంది. వృత్తి పట్ల అంకితభావం ఉన్న కళాకారిణి ఆమె. చాలా కలుపుగోలు మనిషి. చాలా మంచి డ్యాన్సర్ కూడా. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నంలో షూటింగ్ చేశాం.



ఇందులో బక్క చిక్కిన రైతు పాత్ర నాది. నా భార్య నీలమ్మగా మమత, తండ్రిగా కన్నడ నటుడు వాసుదేవరావు నటించారు. పని చేయడానికి బద్ధకిస్తూ దొంగతనాలకు అలవాటు పడిన మా ఇద్దరినీ మంచి దారిలో పెట్టడానికి ప్రయత్నించే పాత్రను మమత పోషించారు. మృణాల్ సేన్ సినిమాలన్నీ వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాకు మమత డబ్బింగ్ చెప్పాలని ప్రయత్నించింది కానీ మాండలికం సరిగ్గా పలకలేకపోవడంతో ఫటాఫట్ జయలక్ష్మితో డబ్బింగ్ చెప్పించాం. ఆరు లక్షల రూపాయల బడ్జెట్‌తో తయారైన 'ఒక ఊరి కథ' చిత్రానికి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి' అని నారాయణారావు చెప్పారు'. కమర్షియల్ చిత్రాల్లో కాకుండా ఎక్కువగా వాస్తవిక సినిమాల్లోనే నటించి, ఆ తర్వాత నృత్యానికే తన జీవితాన్ని అంకితం చేసిన 70 ఏళ్ల మమత ప్రస్తుతం కోల్‌కతాలో తన కుమారుడి దగ్గర ఉంటున్నారు.



టీడీపీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి, తదితరులు

కలెక్టర్ ఉత్తర్వులను మార్చేసి... రూ.1,690 కోట్ల గ్రానైట్‌ను కొట్టేశారు

▸ చీమకుర్తి అక్రమ మైనింగ్‌పై టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు బాధితులు టీడీపీ గ్రీవెన్స్‌లో వాపోయారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలానికి చెందిన రంగారావు అనే వ్యక్తి ఫిర్యాదు చేస్తూ, 'కలెక్టర్ ఉత్తర్వులను మార్చేశారు. కృష్ణసాయి గ్రానైట్స్ అక్రమ పద్ధతిలో మైనింగ్ లీజు పొందారు. రూ.1,690 కోట్ల విలువైన గ్రానైట్‌ను కొట్టేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పర్యావరణ అనుమతులకు మించి, చీమకుర్తి ప్రాంతంలో అధిక పరిమాణంలో తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు తప్పుడు నివేదికలతో అక్రమాలను కప్పిపెడుతున్నారు. వాటి మీద విచారణ జరిపించండి' అని విజ్ఞప్తి చేశారు. 'పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫాం 72 వేల జతలు కుట్టి ఇచ్చా. అందుకు రూ.19.34 లక్షలు ఇవ్వాలి. గత ప్రభుత్వం ఆ సొమ్ములు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. ఆ నిధులు విడుదల చేయించి, బిల్లులు చెల్లించేట్లు చూడండి' అని కడపకు చెందిన హుస్సేన్ బాషా కోరారు. చంద్రన్న బీమాలో 1,800 మంది బీమా మిత్రలను గత ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందని, తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. వైసీపీ నేతల భూకబ్జాలపై పలువురు బాధితులు ఫిర్యాదులు చేశారు. సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని నేతలు హామీ ఇచ్చారు.

సులభతర వాణిజ్యంలో ఏపీ అగ్రస్థానంలో నిలవాలి

▸ అధికారులు ఆ దిశగా కృషి చేయాలి: సీఎస్ విజయానంద్

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సులభతర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టేలా సంబంధిత శాఖలు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై అమరావతి సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బీఆర్ఏపీ)-2024కు సంబంధించి ఫిబ్రవరి 15వ తేదీని తుది గడువుగా పెట్టిందని.. 10వ తేదీలోగా అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

యూఎల్‌సీ మిగులు భూముల క్రమబద్ధీకరణకు మళ్లీ దరఖాస్తులు

▸ డిసెంబరు నెలాఖరు వరకు స్వీకరణ.. రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ గరిష్ఠ భూ పరిమితి చట్టం (యూఎల్‌సీ) కింద మిగులు భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుల స్వీకరణకు రెవెన్యూ శాఖ సోమవారం ఉత్తర్వులు (జీవో-27) జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించాలని ఈ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-23 సంవత్సరాల్లో జీవో 84 ఆధారంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ గడువు అదే ఏడాది డిసెంబరులో ముగిసింది. అయితే ఇంకా సెటిల్ కాని కేసులు ఉన్నాయని, దరఖాస్తులకు మరోసారి గడువు పొడిగించాలని కోరుతూ ప్రభుత్వానికి విన్నపాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీసీఎల్ఏ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

విద్యుత్ బస్సులు అద్దె ప్రాతిపదికన వద్దు!

▸ గత ప్రభుత్వంలో 35 శాతానికి చేరిన అద్దె బస్సులు

▸ ఈ విధానం కొనసాగితే.. ప్రైవేటు చేతుల్లోకి ఆర్టీసీ

▸ వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు.. విస్తృత చర్చలు

విజయవాడ జనవరి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యుత్ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకునే అంశంపై అక్కడి ఆర్టీసీ సిబ్బంది సమ్మెకు సైతం వెనుకాడకపోవటంతో ఏపీలో కూడా దీనిపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు అప్రమత్తమయ్యాయి. అయితే ఇప్పటికిప్పుడు ఆందోళనబాట పట్టే ఆలోచన లేనప్పటికీ, విద్యుత్ బస్సుల విధానంపై అధ్యయనం చేస్తున్నాయి. ఆర్టీసీ గుర్తింపు సంఘాలైన ఈయూ, ఎన్ఎంయూల నాయకత్వాలు ఇటీవల విజయవాడలో వేర్వేరుగా ముఖ్య నేతలతో భేటీయై విస్తృతంగా చర్చించాయి. ఆర్టీసీ సొంతంగా బస్సులు కొనాల్సింది పోయి.. అద్దె ప్రాతిపదికన తీసుకుంటోందని.. వైసీపీ ప్రభుత్వంలోని విధానం ఇప్పటికీ కొనసాగుతోందని నేతలు పేర్కొన్నాయి. ఆర్టీసీలో 10 శాతం మించి అద్దె బస్సులు ఉండకూడదని గతంలో ఒప్పందం జరిగిందని, అయితే గత ప్రభుత్వ హయాంలో అది ఏకంగా 35 శాతానికి చేరుకుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ బస్సులను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటే.. అద్దె బస్సుల ఆక్యుపెన్సీ 50 శాతం దాటిపోతుందని, అప్పుడు ఆర్టీసీ ప్రైవేటు గుప్పెట్లోకి వెళ్లిపోతుందని సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ రెండు సంఘాల కంటే ముందు ఎస్‌డబ్ల్యూఎఫ్ విద్యుత్ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోవద్దని గత రెండు నెలలుగా డిమాండ్ చేస్తోంది. నగరంలో పలు చర్చా వేదికలు కూడా నిర్వహించింది.

డీజీపీ నియామకంపై పిల్.. రేపు హైకోర్టు విచారణ

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డీజీపీ నియామకం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు, యూపీఎస్సీ మార్గదర్శకాలు అనుసరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ ఈ పిల్ దాఖలు చేశారు. సీఎస్, హోం, జీఏడీ ముఖ్యకార్యదర్శులు, రాష్ట్ర డీజీపీ, యూపీఎస్సీని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. పిల్‌పై ఈనెల 29న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

250 డీఈఈ పోస్టుల భర్తీకి కసరత్తు

▸ త్వరలో ఏపీపీఎస్సీకి జలవనరుల శాఖ ప్రతిపాదనలు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న 250 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (డీఈఈ) పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీకి ప్రతిపాదనలు పంపేందుకు జల వనరుల శాఖ సిద్ధమైంది. ఈ శాఖలో తాజాగా 43 మంది సూపరింటెండింగ్ ఇంజనీర్లకు చీఫ్ ఇంజనీర్లుగా, మరో 43 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సూపరింటెండింగ్ ఇంజనీర్లుగా, 180 మంది డీఈఈలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పించారు. కింది స్థాయిలో 500 డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో శాంక్షన్డ్ పోస్టులుగా ఉన్న 250 పోస్టులను భర్తీ చేసేందుకు జలవనరుల శాఖ కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రకటించనున్న జాబ్ క్యాలెండర్‌లో భాగంగా ఈ పోస్టుల భర్తీపై త్వరలోనే ఏపీపీఎస్సీకి ప్రతిపాదనలు పంపుతామని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎంతోకాలంగా అదనపు బాధ్యతలతో నెట్టుకొస్తోన్న జలవనరుల శాఖ ఇంజనీర్లకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పదోన్నతులు ఇచ్చింది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఇంజనీరింగ్ అధికారుల జాబ్ చార్ట్‌పై దృష్టి సారించారు. ఒకరికే 2-3 అదనపు బాధ్యతలు ఉన్నట్లు గుర్తించారు. అదనపు బాధ్యతలతో పనిచేయడానికి సీనియారిటీ వివాదమే కారణమని గుర్తించిన ఆయన.. పదోన్నతులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

రాజధాని టవర్లలో నీటి తోడివేత

1, 2 టవర్లలో తోడకం పూర్తి .. 3, 4 టవర్లలో తుది దశకు

ఫిబ్రవరి తొలివారానికి పనులు ముగించాలని లక్ష్యం



అమరావతిలోని జీఏడీ టవర్లవద్ద కొనసాగుతున్న నీటి తోడివేత పనులు

విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కీలకమైన సచివాలయ టవర్లలో నిలిచిన నీటి తోడివేత పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరి తొలివారానికి 4 సచివాలయ టవర్ల నుంచి నీటిని పూర్తి తోడివేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు మొదటి, రెండవ టవర్లలో నీటిని పూర్తిగా తొలగించారు. నీటిని తోడివేసిన నేపథ్యంలో నేల గట్టిపడాల్సి ఉంది. మూడు, నాల్గవ టవర్లలో కొంత మేర నీటిని తొలగించాల్సి ఉంది. హైకోర్టు నిర్మాణ ప్రాంతంలో కూడా స్వల్పంగా నీరు ఉండడంతో తోడివేత పనులను వేగంగా పూర్తి చేసేందుకు అత్యధిక హార్స్ పవర్‌తో కూడిన మోటర్లను వినియోగిస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారం నాటికి నీటిని పూర్తిగా తోడివేశాక.. రెండో వారంలోనే అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు నిర్మాణాలకు సంబంధించి పీఎంసీల నియామకాలు పూర్తి చేయనున్నారు. పునర్నిర్మాణ పనులు చేపట్టడానికి ఈ పీఎంసీలే టెండర్లకు రూపకల్పన చేస్తాయి. ఆ మేరకు కొత్తగా టెండర్లు పిలవనున్నారు. టెండర్లు పిలిచిన రెండేళ్లలో పనులు పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించనున్నారు.

అడిషనల్ సొలిసిటర్ జనరల్‌గా ధనంజయ

▸ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు



అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)గా సీనియర్ న్యాయవాది చల్లా ధనంజయ నియమితులయ్యారు. ఏఎస్‌జీ హోదాలో ఆయన కేంద్రం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించనున్నారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్ల పాటు ఆయన ఏఎస్‌జీ పోస్టులో కొనసాగనున్నారు. చల్లా ధనంజయ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసి. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1983లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 1987 వరకు రాజమండ్రిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన ధనంజయ.. తర్వాత తన ప్రాక్టీస్‌ను హైకోర్టుకు మార్చారు. రాజ్యాంగం, పన్నులు, సివిల్, క్రిమినల్ కేసులు వాదించడంలో మంచి పేరు సంపాదించారు. 2022లో హైకోర్టు ఆయనకు సీనియర్ న్యాయవాది హోదా ఇచ్చింది.

తులసిబాబు కస్టడీ ముగిశాక బెయిల్ పిటిషన్‌పై విచారించండి

▸ హైకోర్టుకు నివేదించిన ప్రాసిక్యూషన్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నరసాపురం మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజుపై సీఐడీ కస్టడీలో జరిగిన దాడి వ్యవహారంలో తులసిబాబు పోలీస్ కస్టడీ ముగిసిన తర్వాత ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని ప్రాసిక్యూషన్ హైకోర్టును కోరింది. ట్రయల్ కోర్టు తులసిబాబును మూడు రోజుల పాటు కస్టడీకి ఇచ్చిందని, ఈ నెల 29తో కస్టడీ ముగుస్తుందని సోమవారం నివేదించింది. ఆ తరువాత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ కోర్టును అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించా

ఒంగోలుకు తులసిబాబు తరలింపు



తులసిబాబును ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఒంగోలుక్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రఘురామరాజు కస్టోడియల్ హింస కేసులోతులసిబాబును 3 రోజుల కస్టడీకి పోలీసులు తీసుకున్నారు. సోమవారం సాయంత్రం గుంటూరు జైలులో ఒంగోలు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. జీజీహెచ్‌లో వైద్యపరీక్షల అనంతరం ఒంగోలుకు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విచారణ చేపట్టినట్లు తెలిసింది. 29 వరకు విచారణ చేయనున్నారు.

మన నేతన్న పొట్టకొట్టి..

▸ కమీషన్ల కోసం పొరుగు వస్త్రం కొనుగోలు

▸ చేనేత జౌళి శాఖ అధికారుల అవినీతి

▸ తెలంగాణ నుంచి లివరీ వస్త్రాల సేకరణ

▸ అక్కడి మగ్గాలకు సామర్థ్యం లేకపోయినా ఆర్డర్లు

▸ మహారాష్ట్ర వ్యాపారి మాయాజాలం

▸ వెళ్లి విచారించిన మన నేతన్నలు

▸ సేకరించిన సమాచారంతో విజిలెన్స్‌కు ఫిర్యాదు

▸ ప్రాథమిక విచారణలో పెద్దఎత్తున అక్రమాలు



అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సొంత రాష్ట్రంలో నేతన్నల్ని ఆదుకోవాల్సిన ఆప్కో పొరుగు రాష్ట్రం నుంచి వస్త్రాన్ని కొనుగోలు చేస్తోంది. కమీషన్ల కోసం అధికారులు మన చేనేతల పొట్టగొడుతున్నారు. ఏపీలోని సంక్షేమ శాఖలు, గురుకులాలకు అవసరమైన వస్త్రాన్ని సేకరించడంలో చేనేత జౌళి శాఖ అధికారులు పాల్పడుతోన్న అవినీతిపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు అందాయి. విజిలెన్స్ అధికారులు కూపీ లాగడంతో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ప్రాథమిక సమాచారం సేకరించిన విజిలెన్స్ విభాగం పూర్తి స్థాయి నివేదిక అందాక ప్రభుత్వానికి పంపించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు లక్షన్నర వరకూ చేనేత మగ్గాలు ఉండగా వాటిలో లివరీతో పాటు సాధారణ వస్త్రాలు ఉత్పత్తి అవుతున్నాయి. దుప్పట్లు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు లాంటివి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖలు కొనుగోలు చేస్తాయి. సాధారణ వస్త్రాలైన చీరలు, ఇతరత్రా ఆప్కో షోరూమ్‌ల ద్వారా చేనేత జౌళిశాఖ విక్రయిస్తుంది. ప్రభుత్వ శాఖలు లివరీ వస్త్రాలు తప్పనిసరిగా మన చేనేతల నుంచి కొనుగోలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టమైన జీవో జారీ చేసింది. అయినా కమీషన్లకు అలవాటు పడ్డ చేనేత జౌళిశాఖ అధికారులు అదేమీ పట్టించుకోకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలుకు ఆదేశాలిస్తున్నారు.

కమీషన్ల కోసమే తెలంగాణకు ఆర్డర్లు

మన రాష్ట్రంలో లివరీ వస్త్రాలు పలు సొసైటీల్లో నిల్వ ఉన్నా కొనుగోలు చేసే దిక్కులేదు. తెలంగాణలోని మహబూబ్‌నగర్, వరంగల్ సొసైటీల నుంచి గడిచిన 4నెలల్లో రూ.12 కోట్ల విలువైన లివరీ వస్త్రాలు అధికారులు కొనుగోలు చేశారు. ఏపీ చేనేత జౌళిశాఖలో ఓ అధికారి కమీషన్ల కోసమే ఈ పని చేశారని తెలుసుకున్న నేతన్నలు కొందరు పొరుగు రాష్ట్రానికి వెళ్లి విచారించారు. అక్కడి సొసైటీలకు అంతమొత్తంలో లివరీ వస్త్రం సరఫరా చేసే శక్తిలేదని తేలింది. మరి ఎలా సరఫరా చేస్తున్నారని ఆరా తీయగా మహారాష్ట్రకు చెందిన ఒక వ్యాపారి తమిళనాడులోని ఈరోడ్ నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి భారీ లాభాలతో తెలంగాణలోని మాక్ సొసైటీ (పది మంది)ల పేరుతో బిల్లులు ఇస్తున్నారని తెలిసింది. ఇదే విషయమై తెలంగాణ చేనేత జౌళిశాఖ అధికారులను సంప్రదించగా.. తమ రాష్ట్రంలో 17 వేలకు మించి చేనేత మగ్గాల్లేవని వారు చెప్పారు.

అవినీతి అధికారులపై చర్య తీసుకోవాలి..

తమకు అన్యాయం చేసిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. తాము వస్త్రం సరఫరా చేస్తామని అడిగేందుకు వెళితే కమీషన్లు తీసుకునే ఆ అధికారి కనీసం లోపలకు కూడా అనుమతించలేదని, ఆయన అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో 3లక్షల మందికి పైగా చేనేతలు, లక్షన్నరకు పైగా మగ్గాలుంటే కనీసం నూలు ఇతర ముడిసరుకు ఇవ్వకుండా చేనేత రంగాన్ని జౌళిశాఖ నిర్వీర్యం చేస్తోందని నేతన్నలు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తెలంగాణలో సేకరించిన వివరాలు, ఆధారాలతో ఏపీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

నగరి వస్త్రంపై ప్రేమెందుకో..

ఆంధ్రప్రదేశ్‌లో లక్షన్నర వరకూ చేనేత మగ్గాలుంటే సుమారు 800 చేనేత సహకార సంఘాలున్నాయి. వాటి ద్వారా ఉపాధి పొందే నేతన్నను ఆదుకోవడానికి గత టీడీపీ సర్కారు నూలు, పట్టు, ఇతర ముడిసరుకు రాయితీపై సరఫరా చేసి కార్మికులను ఆదుకుంది. ఆప్కో వస్త్రాల విక్రయాలకు తోడ్పాటు అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కోసం 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా శ్రమించింది. అయితే జగన్ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఇచ్చే యూనిఫామ్ కోసం మన రాష్ట్రంలోని ఒక్క చేనేత సంఘానికి లేదా కార్మికుడికి నూలు ఇచ్చిన పాపాన పోలేదు. అదే సమయంలో నగరి ప్రాంతంలోని పవర్ లూమ్స్ నుంచి అప్పటి మహిళా మంత్రి సిఫారసుతో కోట్లాది రూపాయల విలువైన వస్త్రాలు కొనుగోలు చేశారు. ఆ కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయంటూ పాఠశాల విద్యాశాఖ అధికారి వెట్రి సెల్వి రూ.కోటిన్నరకు పైగా బిల్లులు ఆపించారు. ఇప్పుడు అదే నగరి నుంచి లివరీ వస్త్రం కొనుగోలుకు అధికారులు ఆసక్తి చూపుతున్నారు. తమిళనాడు నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి అధిక ధరకు ఏపీలోని సంక్షేమ శాఖలకు సరఫరా చేయడం ద్వారా చాటున అధికారులకు కమీషన్లు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కాబోతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పండేది ఇక్కడ.. అమ్మేది అక్కడ!



ఆయిల్‌పామ్‌కు రైతుకు ఆదరణ ఏదీ?

తెలంగాణకు తరలిపోతున్న ఉత్పత్తి

గత ప్రభుత్వ విధానాలతో జీఎస్టీ కోల్పోయిన ఏపీ

కేంద్ర రాయితీ పథకాలపైనా గతంలో నిర్లక్ష్యం

పెరగని సాగు విస్తీర్ణం.. రాష్ట్రానికి నష్టం

ఆయిల్‌పామ్‌కు కూటమి సర్కార్ ఊతమిచ్చేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం.. ఉత్పత్తిలో ఏపీనే అగ్రస్థానంలో ఉంది. పంట ఇక్కడ సాగవుతుండగా.. దీనిని తెలంగాణ రాష్ట్రం దిగుబడి చేసుకుని అధిక ప్రయోజనాలు పొందుతోంది. అక్కడి ఫ్యాక్టరీలో ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఈఆర్)ని చూపుతూ రైతులకు ఎక్కువ ధర ఇస్తోంది. ఏపీలో మాత్రం పెదవేగిలోని పాత ఫ్యాక్టరీలో తక్కువ ఓఈఆర్ వస్తుండటంతో తక్కువ ధర ఇస్తోంది. దీంతో రైతులు తెలంగాణవైపే మొగ్గుచూపుతున్నారు. ఆయిల్‌పామ్ ధరల నిర్ణయంలో సీఏసీపీ నిబంధన ప్రకారం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఈఆర్)ని ప్రామాణికంగా తీసుకోవాలి. రాష్ట్ర పరిధిలో ఆయిల్ ఫెడ్ నిర్వహించే ఫ్యాక్టరీలో తాజా పండ్ల నుంచి తీసే నూనె శాతం ప్రకారం రైతులకు ధర చెల్లించాలి. కానీ గత ప్రభుత్వం ఆయిల్‌ఫెడ్ పరిధిలోని పెదవేగి ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని చెప్పి, తూతూ మంత్రంగా రిపేరు చేసి వదిలేసింది. దీంతో ఆశించిన ఫలితం రాలేదు. తెలంగాణలోని ఫ్యాక్టరీలో 19%పైగా ఓఈఆర్ వస్తుంటే.. పెదవేగిలోని ఫ్యాక్టరీలో 17% కూడా రావట్లేదు. దేశంలోనే ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. 5.66లక్షల ఎకరాలతో 49% ఏపీలోనే సాగవుతోంది. రాష్ట్రంలో 1.74లక్షల మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఏటా 19లక్షల టన్నుల గెలలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎకరానికి 7.92 టన్నుల దిగుబడి వస్తోంది. గంటకు 461 టన్నుల క్రషింగ్ సామర్థ్యమున్న 13 ప్రాసెసింగ్ యూనిట్లున్నాయి. అయినప్పటికీ రైతులకు మాత్రం ఆశించిన ధర రావడం లేదు. ఇందుకు గత వైసీపీ సర్కార్ చేసిన తప్పిదాలే ప్రధాన కారణం. వీటిని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతుందా. లేక వాటినే అనుసరిస్తుందా? అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. గత ప్రభుత్వం కొత్త మండలాల కేటాయింపుపై పెట్టిన శ్రద్ధ.. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపు, అధిక దిగుబడి సాధించడంపై చూపలేదు. రైతులకు ప్లాంట్ మెటీరియల్ సబ్సిడీపై ఇవ్వకుండా, మైక్రో ఇరిగేషన్ బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేసింది. కేంద్రం కేటాయించే 60% నిధులకు రాష్ట్ర వాటా 40% విడుదల చేయకపోవడంతో రైతులకు రాయితీలు అందలేదు. దీంతో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంలో ఏపీ వెనుకబడింది. ఈ విషయంలో తెలంగాణ చాలా ముందంజలో ఉంది. ఫలితంగా గత ప్రభుత్వ హయాంలో ఆయిల్ పామ్ రైతులు అన్నివిధాలా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు ఆదేశాలు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను చెల్లించడంతోపాటు కేంద్రం ఇచ్చే నిధుల్ని సద్వినియోగం చేసుకుంటూ, అదనపు నిధుల సమీకరణకు ఉద్యాన శాఖ ప్రయత్నాలు చేస్తోంది. అలాగే డ్రిప్ పరికరాలపై రైతులకు సబ్సిడీని 90 శాతానికి పెంచి, అందుకు అవసరమైన అదనపు నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. దీనివల్ల ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుదలతోపాటు అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఏర్పడుతుంది. ఆయిల్‌పామ్ ధరల నిర్ణయంలో కూడా గత ప్రభుత్వం శాస్త్రీయ విధానాలను పాటించలేదు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలైన కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైస్ (సీఏసీపీ) నిబంధనలకు, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈవో) స్కీం కింద వయబిలిటీ గాప్ ప్రైస్ (వీజీపీ) నిబంధనలకు విరుద్ధంగా నాటి ప్రభుత్వం వ్యవహరించింది.

జీఎస్టీ కోల్పోయిన ఏపీ

గత ప్రభుత్వ విధానాలతో ఏపీకి మరో నష్టం కూడా జరిగింది. లక్ష టన్నుల మీద, క్రూడాయిల్‌పై వచ్చే జీఎస్టీ కూడా కోల్పోయింది. అప్పటి తెలంగాణ ప్రభుత్వం లబ్ధి పొందింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఎడిబుల్ ఆయిల్ రంగంలో విదేశాలపై ఆధారపడే విధానం తగ్గించడం కోసం ఎన్ఎంఈవో అనే విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లలో ధర పడిపోయినా రైతులను ఆదుకోవటానికి వీజీపీ విధానం తెచ్చింది. దీనిని గత ప్రభుత్వం అమలు చేయలేదు. ప్రస్తుతం అధిక ధరల కారణంగా రైతులకు నష్టం లేకపోయినా, భవిష్యత్‌లో వీజీపీ విధానం అమలుతో రైతులకు మేలు జరిగే పద్ధతిని కూడా ప్రభుత్వం పరిశీలించాలి. ఆయిల్‌పామ్ రంగానికి పునరుజ్జీవం కల్పించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి. ఇందుకోసం పెదవేగి ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని రైతులు కోరుతున్నారు.

తెలంగాణకు లబ్ధి

జాతీయ ఆయిల్‌పామ్ దిగుబడిలో 5-8% వాటా కూడా లేని తెలంగాణ విధానాలనే 8590% దిగుబడి వచ్చే ఏపీ అనుసరించే కొత్త విధానానికి గత ప్రభుత్వం తెర లేపింది. ఓఈఆర్ అనేది ఫ్యాక్టరీ సామర్థ్యంతో పాటు ఆయిల్‌పామ్ సాగు ప్రాంత వాతావరణం, నేల స్వభావం, యాజమాన్య పద్ధతులు, పంట కోత సమయాన్ని బట్టి మారుతుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా, శాస్త్రీయ విధానాలను పాటించకుండా తెలంగాణ ఓఈఆర్‌ని ఏపీకి ఆపాదించింది. రాష్ట్రం విడిపోయే నాటికి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం తక్కువగా, ఫ్యాక్టరీ సామర్థ్యం ఎక్కువగా ఉంది. ఆ రాష్ట్రంలో పండిన పంట అక్కడి ఫ్యాక్టరీకి చాలక ఏపీ పంటను దొడ్డిదారిన తరలించడానికి దళారులను పెట్టుకుని, అధిక ధర ఆశ చూపి తరలించుకుపోయిందన్న విమర్శ ఉంది. ఈవిధంగా ఏపీ నుంచి ఏటా 70వేల నుంచి లక్ష టన్నుల వరకు ఆయిల్ పామ్ తెలంగాణకు తరలిపోయింది. దొడ్డిదారిన తెలంగాణ ఫ్యాక్టరీ సమీకరించిన ఆయిల్‌పామ్ ఉత్పత్తిని చూపి, కేంద్రం నుంచి ఎక్కువ సబ్సిడీలు రాబట్టుకోగా, ఆమేరకు ఏపీ తీవ్రంగా నష్టపోయింది.





బీసీ మంత్రుల సత్కార సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి సవిత, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

బీసీలను ఎంపీలు చేసిన ఘనత టీడీపీదే

▸ బీసీల్లో ఆర్థిక విప్లవాన్ని తెచ్చేందుకు కృషి: రామ్మోహన్‌నాయుడు

▸ జగన్... బీసీలను మోసం చేశారు: అచ్చెన్న

▸ బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధులకు సత్కారం

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ మెట్లు ఎక్కడానికి కూడా ఎన్నో అవమానాలు, బాధలు పడ్డ బీసీ సామాజిక వర్గాలకు ఏకంగా పార్లమెంటు మెట్లు ఎక్కే అవకాశాన్ని కల్పించిన ఘనత టీడీపీకి, మాజీ సీఎం ఎన్టీఆర్‌కే దక్కుతుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సోమవారమిక్కడ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సన్మానం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. బీసీలంతా ఏకతాటిపై నిలిస్తే రాజకీయ స్వరూపమే మారిపోతుందని తెలిపారు. "అన్ని ప్రాంతాల నుంచి బీసీ నాయకులు ముందుకు రావడానికి యుగపురుషుడు ఎన్టీఆరే కారణం. రేపటి తరానికి కూడా ఈతరం నేతలు పునాదులు వేయాలి. బీసీల్లో ఆర్థిక విప్లవం రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చంద్రబాబు విజన్‌తో బీసీలు విద్య, విజ్ఞాన పరంగా ఎదిగి ప్రపంచంలోని అగ్రదేశాల్లో తమ సత్తా చాటుతున్నారు. పనిచేయడం కాకుండా పని కల్పించే పారిశ్రామిక వేత్తలుగా బీసీలు ఎదగాలి. దీనికి అన్ని విధాలుగా బీసీ ప్రజా ప్రతినిధులు అండదండగా నిలుస్తారు" అని కేంద్ర మంత్రి అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చాక 35 ఏళ్ల పాటు బీసీలు ఓటు వేసే యంత్రాలుగానే ఉన్నారని, వారిని చట్ట సభల్లోకి తెచ్చింది ఎన్టీఆరేనని చెప్పారు. బీసీలకు 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వైసీపీ హయాంలో జగన్ మోసం చేశారని ఆరోపించారు. రెండేళ్ల క్రితం నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు శ్రీకారం చుట్టిన రోజునే బీసీ మంత్రులకు సత్కారం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. తనపై 24 కేసులు పెట్టి వేధించినా తాను వెనక్కి తగ్గలేదని, అది టీడీపీ పట్ల బీసీలకు ఉన్న నమ్మకమని మంత్రి సంజీవరెడ్డిగారి సవిత చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక్కో వ్యాపారవేత్త రావాలని, బీసీల ఎదుగుదలకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సత్కార సభలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, శ్రావణ్‌కుమార్, మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత అజెండాలు వదలండి

▸ జనసేనలో చేరిన వైసీపీ నేతలకు నాగబాబు సూచన



నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన వివిధ జిల్లాలకు చెందిన నేతలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'జనసేనలో కొత్తగా చేరే వారు క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. ముఖ్యంగా వైసీపీ నుంచి వచ్చే వారు వారి వ్యక్తిగత అజెండాలు వదిలి పెట్టాలి. ప్రజా సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి' అని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సూచించారు. సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, నందిగామ నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వీరందరికీ నాగబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, వేములపాటి అజయ్‌కుమార్, చిలకం మధుసూదన్ రెడ్డి, సామినేని ఉదయభాను ఇతర నాయకులు పాల్గొన్నారు.

గుడి..బడి ..మాల్స్ .. అన్నక్యాంటీన్లు..
కూడళ్లలో ప్రజాభిప్రాయ సేకరణ

శాఖలవారీగా ప్రజల్లో సంతృప్తిపై సర్వే

ఎల్లుండి నుంచి వాట్సప్ పరిపాలన

ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు

"ఎవరు ఏం చెప్పినా లబ్ధిదారుల మాటే ఫైనల్. ప్రజలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌నే ప్రామాణికంగా తీసుకుంటాం. పీపుల్ ఫస్ట్ అనేది మన విధానం. ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు పతి ఉద్యోగీ, ప్రతి అధికారీ, ప్రతి విభాగమూ పనిచేయాల్సిందే"

- సీఎం చంద్రబాబు



ప్రభుత్వం వద్ద డబ్బులున్నా ఇవ్వడం లేదని, హామీలు అమలు చేయడం లేదని కొందరు అనుకుంటున్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో, ఎంత లోతులో కూరుకుపోయి ఉన్నామో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. ఎంత విపులంగా చెప్పాలో అంతగా ప్రయత్నిస్తున్నాం.

ఐదు రూపాయలిచ్చి ప్రజలను శాశ్వతంగా పేదరికంలో ఉంచాలని మేం అనుకోవడం లేదు. గత ప్రభుత్వం వారికి ఒక రూపాయి ఇచ్చి పది రూపాయలు దోచుకొంది. మేం నిజాయితీగా ప్రజలను అభివృద్ధిలోకి తేవాలని అనుకొంటున్నాం. వాస్తవాలు చెప్పడానికి భయపడదల్చుకోలేదు.

- సీఎం చంద్రబాబు

పీపుల్ ఫస్ట్

పథకాలపై లబ్ధిదారుల మాటే ఫైనల్

పాలనపై నేరుగా ప్రజలనే అడుగుదాం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించా రు. పీపుల్ ఫస్ట్ అనే నినాదంతో ఈ ప్రక్రియ ను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఐవీఆర్ఎస్ విధానంలో ఫోన్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని రియల్‌టైమ్ గవర్నెన్స్ అధికారులు సేకరించారు. ఈ సర్వే వివరాలను సచివాలయంలో సోమవారం సీఎం సమీక్షించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి... మరింత లోతుగా జనంనాడిని తెలుసుకునేలా ప్రత్యేకం గా సర్వేను చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. గుడి, బడి, అన్నక్యాంటీన్లు, హోట ల్. మాల్స్ 4 రోడ్ల కూడలి.. ఇలా ప్రతిచోటా పాలనపై ఏమనుకుంటున్నారో తెలుసుకోవాల ని ఆదేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేకంగా ఏజెన్సీని ఎంపిక చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. జననమరణ ధ్రువపత్రాలు, విద్యార్హతా పత్రాలను వాట్సప్ విధానంలో జారీ చేయడాన్ని ఈ నెల 30 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలన మెరుగుపరచుకోవాలని అధికారులను ఆదేశించారు. పథకాల అమలుపై లబ్ధిదారుల నుంచి నేరుగా అభిప్రాయాన్ని సేకరించాలని స్పష్టంచేశారు. పింఛన్ల పంపిణీ, దీపం, అన్న క్యాంటీన్లు, ఉచి త ఇసుక సరఫరా, ఆస్పత్రులు, దేవాలయాల్లో సేవలు తదితర 10 అంశాలపై సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. కాగా, ఇప్పటికే నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వే వివరాలను రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖ సీఈవో దినేశ్‌కుమార్ వెల్లడించారు. పాలనపై ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను ప్రామాణికంగా తీసుకుంటామని, వారి అభిప్రాయాలకు అనుగుణంగా శాఖల పనితీరును మెరుగుపరచుకుంటామని చంద్రబాబు వెల్లడించారు. కొన్ని శాఖల్లో అనుకున్నంత సంతృప్తి నమోదు కాలేదంటూ అసహనం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటికీ ఏఐ అవగాహన

రాష్ట్రంలో జననమరణ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతా ధ్రువీకరణ పత్రాలు అందించే వా ట్సప్ పాలనా విధానం ఈ నెల 30న ప్రారంభిద్దామని అధికారులతో సీఎం చంద్రబాబు అన్నారు. సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి అపోహలకూ తావులేకుండా చూడాలని ఆర్టీజీఎస్ అధికారులను ఆదేశించారు కేంద్రం అమలు చేస్తున్న డిజీ పర్స్ విధానంలో విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు భద్రంగా, అందుబాటులో ఉండేలా 'బ్లాక్ చైన్'తో ఒప్పందాన్ని చేసుకున్నామని సీఎంకు అధికారులు వివరించారు. 40 ప్రభుత్వశాఖల డేటాను అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేశామని దినేశ్‌కుమార్ వెల్లడించారు. ఈ డేటా ఆధారంగా ప్రతి గ్రామానికీ ఒక ప్రొఫైల్‌ను రూపొందిస్తున్నామన్నారు. ఆధార్ నమోదు చేసుకున్నవారందరి వివరాలను సేకరించామన్నారు. ప్రభుత్వానికి చెందిన సామాజిక ఆస్తుల జియోట్యాగింగ్ జరిగిందని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ కృత్రిమ మేధ సాంకేతికతపై అవగాహన కలిగినవారు ఒక్కరైనా ఉండాలని చంద్రబాబు ఆకాక్షించారు. రాష్ట్రంలో 15% వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ శాఖలన్నీ పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎం కార్యదర్శులు రాజమౌళి, పీఎస్ ప్రద్యుమ్న, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పథకాలపై ఐవీఆర్ఎస్ సర్వే వివరాలు...

పథకం	సంతృప్తి (%)	అసంతృప్తి (%)
సామాజిక పింఛన్లు		
ప్రతి నెల ఇంటి వద్దే పింఛన్	92.20	
పింఛను అందించే ఉద్యోగుల తీరు	87.48	
ప్రక్రియ అమలు		15.60
అన్నక్యాంటీన్లు		
పరిసరాల పరిశుభ్రత	82	
ఆహార నాణ్యత	91	
సమయపాలన	94	
ధాన్యం సేకరణ		
అమలు తీరు	89.92	
గోనె సంచుల లభ్యత		30
ధర నిర్ణయం	84	
దైవ దర్శనాలు		
ఏడు ప్రధానాలయాల్లో దర్శనాల తీరు	70	
వసతులు		37
ప్రసాదాల పంపిణీ	81	
ఎన్టీఆర్ వైద్యసేవ		
ఆస్పత్రుల నిర్వహణ	90	
వైద్య మిత్ర సేవలు	87	
సిబ్బంది అందుబాటు	67	
ప్రక్రియ అమలు		37
ఉచిత సిలిండర్ పథకం		
48 గంటల్లో ఖాతాలో జమ	48	
ఆర్టీసీ సేవలు		
ప్రయాణం సురక్షితం	88	
సమయానికి గమ్యస్థానానికి..		27
బస్టాండ్లలో మౌలిక సౌకర్యాలు		63
ఉచిత ఇసుక విధానం		
ఇసుక లభ్యత	78	
రిజిస్ట్రేషన్ ప్రక్రియ	75	
రవాణా చార్జీలు	75	

ఆర్థికం ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

కుదరదు. మరోరకంగా సర్దుబాటు చేసుకొని సంక్షేమం చేయాలి' అని అన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి శ్రీలంక మాదిరిగా ఉందని మేం చెప్పిన మాట నిజం. అది నూటికి నూరు శాతం నిజమని నీతి ఆయోగ్ జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై చేసిన అధ్యయనం నిరూపించింది. గత ప్రభుత్వం నాశనం చేసిందని చెప్పి వదిలేయలేం. బాగు చేయాలి. మాపై నమ్మకంతోనే ప్రజలు 93 శాతం సీట్లు గెలిపించి ఇచ్చారు. ఆ నమ్మకం నిలుపుకొంటాం. ప్రతి విషయం ప్రజల ముందు పెడతాం. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలను అన్వేషించి అమలు చేస్తాం. ఆదాయం పెరిగితే అది ప్రజలకే చెందుతుంది. పేదలకు కూడా వెసులుబాటు కల్పించాల్సిన బాధ్యత మాపై ఉంది. గత ప్రభుత్వం అసమర్థత, అవినీతి విధానాలతో రాష్ట్రాన్ని వెనక్కు తీసుకువెళ్లిందన్నది నిజం' అని చంద్రబాబు అన్నారు.

ఎవరొచ్చినా చేస్తారనుకున్నారు

'గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వృద్ధిరేటు 15 శాతం వరకూ వెళ్లిందని, ఎవరు వచ్చినా అభివృద్ధి ఇలాగే ఉంటుందని 2019 ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలు అనుకొన్నారు. కానీ అంచనా తప్పని ఆలస్యంగా అర్థం చేసుకొన్నారు. ఇంతగా దెబ్బ తిన్న రాష్ట్రాన్ని మళ్లీ బాగు చేయగలరా అని నన్ను అనేకమంది అడిగారు. బాగు చేయడానికి పోరాడటం తప్ప ఇక్కడ మరో మార్గం లేదు. కేంద్రం కొంత సాయం చేసింది. మా పరిధుల్లో మేం శాయశక్తులా పనిచేస్తున్నాం. ఈ 7 నెలల్లో రూ.12 వేల కోట్లు విడుదల చేసి.. ఆగిపోయిన కేంద్ర పథకాలను పునరుద్ధరించాం. వాటిని పునరుద్ధరిస్తే కానీ కొన్ని పథకాల కింద కేంద్ర నిధులు రావు. పళ్ల బిగువన వాటికి డబ్బు సర్దుబాటు చేశాం. ఇవిచెప్పకపోతే ప్రజలకు అర్థం కావు' అన్నారు.

మళ్లీ ప్రగతి పథంలోకి తెస్తాం

'గుజరాత్‌లో ఐదుసార్లు నుంచి ఒకే పార్టీ గెలుస్తోంది. దీనివల్ల విధానాలు ఒకేదారిలో నడుస్తున్నాయి. పంజాబ్‌లో తరచూ మారిపోతున్నాయి. దీంతో మొత్తం దేశంలో మన కంటే అధ్వానంగా ఉన్న రాష్ట్రంగా అది తయారైంది. గత 30 ఏళ్ల నుంచి ఏ రాష్ట్రంలో ఏం జరిగిందో.. ఎవరు ఆదాయాలను పెంచారో.. మంచి పాలన ఎవరు ఇచ్చారో నీతి ఆయోగ్ అధ్యయనం చేస్తే.. మేం గతంలో ఎంత చాకిరీ చేశామో మొత్తం దేశానికి తెలుస్తుంది. రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలోకి తీసుకువచ్చి చూపిస్తాం. ఈసారి రిపబ్లిక్ దినోత్సవంలో గవర్నర్ ప్రసంగాన్ని మొక్కుబడిగా తయారు చేయలేదు. నిన్న, నేడు, రేపు రాష్ట్రం పరిస్థితి ఏమిటో చెబుతూ మా భవిష్యత్ ప్రణాళికకు పది సూత్రాలు అందులో వివరించాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమం

'ఆదాయం పెరిగితే రాష్ట్రం ముందుకు వెళ్తుంది. ఆదాయం పెంచడం కోసం ఉన్న డబ్బులు మొత్తం అభివృద్ధి పైనే పెట్టలేం. అభివృద్ధితో పాటు సంక్షేమం కూడా చూడాలి. పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. గతంలో అమలు చేసిన మంచి పాలనా విధానాల వల్ల తెలంగాణలో ఇప్పుడు తలసరి ఆదాయం దేశంలోకెల్లా అధికంగా ఉంది. ఒక మంచి పాలసీ ప్రజల జీవితాలను మార్చేస్తుంది. చైనా 1978లో ఆర్థిక సంస్కరణలు తెచ్చింది. సోవియట్ యూనియన్ కొంత ఆలస్యంగా రాజకీయ సంస్కరణలు తెచ్చింది. చైనా అమెరికాతో పోటీగా సూపర్ పవర్‌గా ఎదిగితే, రష్యా కొంత వెనకబడిపోయింది. ఒక విధానం తెచ్చే మార్పు ఏమిటో ఇదే పెద్ద ఉదాహరణ' అని చంద్రబాబు పేర్కొన్నారు.

బాబు కష్టాన్ని దావోస్‌లో ప్రత్యక్షంగా చూశా

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కోసం చంద్రబాబు ఎంత కష్టపడుతున్నారో దావోస్‌లో తాను ప్రత్యక్షంగా చూశానని, ఆయనతో కలిసి రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడంలో భాగస్వామ్యం కావడం తన పూర్వజన్మ సుకృతమని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణలో పాల్గొనేందుకు సోమవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమా రాలేదని, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడాన్నిబట్టి చంద్రబాబు బ్రాండ్ వాల్యూ తెలుస్తోందన్నారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ దావోస్‌లో మాట్లాడుతూ.. మహారాష్ట్రకు ముంబై, తెలంగాణకు హైదరాబాద్ ఎలానో ఏపీకి చంద్రబాబు అలా అని వ్యాఖ్యానించడం చంద్రబాబుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇమేజ్‌ను తెలుపుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం లోకేశ్ యువగళం పాదయాత్ర అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఏడాది క్రితం ఏపీని గుర్తు చేసుకుంటే అంధకారాంధ్రప్రదేశ్ గుర్తుకొస్తుందని, అప్పట్లో ప్రజలకు ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. నాడు ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా లెక్క చేయకుండా ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు లోకేశ్ ముందడుగు వేశారని, 226 రోజులపాటు నిరంతరాయంగా పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.

మహిళలకే పట్టా

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాలు జారీ చేసింది.

ఇళ్ల స్థలాలు వీరికే...

- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికే ఇళ్ల స్థలాలు.
- మాగాణి, మెట్ట కలిపి ఐదు ఎకరాలకు మించి ఉండకూడదు. ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి.
- ఈ పథకం కింద ఇంటి స్థలం కోరుకునే వారికి రాష్ట్రంలో మరెక్కడా సొంత ఇంటి స్థలం, ప్లాట్లు ఉండరాదు.
- జగన్ హయాంలో స్థలం కేటాయించి, అందులో నిర్మాణం చేయకుంటే రద్దుచేసి కొత్తగా కేటాయిస్తారు.
- జగన్ ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించినా, పట్టా తీసుకోనివారికి అవకాశమున్న చోట కొత్త పట్టా.
- గతంలో ఇంటి స్థలాలు కేటాయించి, దానిపై కోర్టుల్లో కేసులు ఉంటే, రద్దు చేసి కొత్తగా మరో చోట ఇస్తారు.
- గతంలో పట్టా ఇచ్చినా గడువులోగా ఇంటి నిర్మాణం చేసుకోకుంటే వాటిని రద్దు చేసి కొత్తగా స్థలం కేటాయిస్తారు.

ప్రజల సమక్షంలో జాబితా

గ్రామం, పట్టణం యూనిట్‌గా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. గ్రామస్థాయిలో వచ్చే దరఖాస్తులను వీఆర్‌ఓ లేదా ఆర్‌ఐలు పరిశీలిస్తారు. గ్రామ, పట్టణ స్థాయిలో సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో ముసాయిదా లబ్ధిదారుల జాబితాను ప్రవేశపెడతారు. తర్వాత తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఆమోదిస్తారు. ఇంటి స్థలానికి ఆధార్, రేషన్ కార్డును అనుసంధానిస్తారు. దీంతో గతంలో ఇళ్ల స్థలాలు తీసుకున్నవారు, మరెక్కడైనా సొంత ఇళ్లు కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే ఆ విషయం తెలిసిపోతుంది.

స్థలాల కోసం భూసేకరణ

పేదలందరికీ ఇళ్లు పథకం కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించారు. అందులో నిరుపయోగంగా ఉన్నవి లేదా ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా ఉన్న వాటిని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనివల్ల భూసేకరణ భారం తగ్గుతుంది. పేదింటి కోసం స్వచ్ఛందంగా భూములు ఇచ్చేవారుంటే సంప్రదించాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో అందుబాటులో ఉన్న భూములను వినియోగించుకోవాలని సూచించింది. చివరి ప్రయత్నంగానే అసైన్డ్ భూములపై దృష్టిపెట్టాలని ఆదేశించింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు గ్రామకంఠం పరిధిలో ఇళ్ల స్థలాలు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకోవాలని రెవెన్యూ శాఖ స్పష్టత ఇచ్చింది.

పర్యవేక్షణకు కమిటీలు

పేదలందరికీ ఇళ్లు పథకాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయిలో రెవెన్యూ శాఖ మంత్రి చైర్మన్‌గా కమిటీ ఏర్పాటైంది. ఇందులో పురపాలక, గృహ నిర్మాణ శాఖల మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులు, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, సీసీఎల్‌ఏ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సభ్యులుగా ఉంటారు. సభ్య కన్వీనర్‌గా అదనపు సీసీఎల్ఏ ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా శాఖల మధ్య సమన్వయం కోసం రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ నేతృత్వాన అధికారుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో పేదలందరికీ ఇళ్లు పథకం అమలులో జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా, డిప్యూటీ కలెక్టర్ సమన్వయ అధికారిగా వ్యవహరించనున్నారు.

రాష్ట్ర అప్పులు రీషెడ్యూల్ చేస్తున్నాం

- చెల్లింపు కాలపరిమితి పెంచమని కోరుతున్నాం
- వైసీపీ విధ్వంసంపై ఆనాడు మేం చెప్పిందే

నీతి ఆయోగ్ ధ్రువీకరించింది: సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల జగన్ హయాంలో చేసిన మితిమీరిన అప్పులతో రాష్ట్రం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జగన్ ప్రభుత్వం చెల్లించకుండా పెండింగులో పెట్టిన రూ.వేల కోట్ల బిల్లులను కూటమి సర్కారు ఏర్పడిన ఆరు మాసాల కాలంలో చెల్లించినట్టు తెలిపారు. అదేవిధంగా జగన్ హయాంలో నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయిన కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు కేటాయించినట్టు చెప్పారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ ఆర్థిక విధ్వంసంపై చెప్పిన అంశాలనే నీతి ఆయోగ్ తన నివేదికలో ధ్రువీకరించిందన్నారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికపై చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "2018-19లో వృద్ధిరేటు 11.14 శాతం ఉందని, వైసీపీ హయాంలో అది 10.32 శాతానికి తగ్గింది. రాష్ట్ర వృద్ధిరేటు 15 శాతం లేదా అంతకంటే పైస్థాయిలో ఉంటేనే వైసీపీ హయాంలో చేసిన అప్పులకు అసలు, వడ్డీ చెల్లించగలుగుతాం. వైసీపీ హయాంలో కూడా వృద్ధిరేటు అంతకు ముందు స్థాయిలోనే పెరిగి ఉంటే గత ఐదేళ్లలో జీఎస్‌డీపీ అదనంగా రూ.7 లక్షల కోట్లు పెరిగి ఉండేది. అధిక వడ్డీలకు అప్పులు చేసే అవసరం ఉండేది కాదు. 2022-23లో వైసీపీ ప్రభుత్వం రూ.67,000 కోట్ల అప్పులు తెచ్చింది. దీనిలో మూలధన వ్యయం రూ.7,244 కోట్లే. తెచ్చిన అప్పులకు తోడు ఆదాయం పెరగకపోవడంతో అప్పుల చెల్లింపు సామర్థ్యం సున్నాకు చేరుకుంది. తెచ్చిన అప్పుల సొమ్మును దుబారా చేశారు. రాష్ట్ర ఆదాయం కూడా 17.1 శాతం నుంచి 9.8 శాతానికి తగ్గింది. అప్పులు 16.5 శాతం మేర, వడ్డీ 15 శాతం మేర పెరిగింది. ఎక్కువ వడ్డీకి అప్పులు తేవడం, మూలధన వ్యయం లేకపోవడం, పన్నులు పెంచడం లాంటి వివిధ అంశాల కారణంగా ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఒక్క జలవనరుల ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేదు" అని ముఖ్యమంత్రి వివరించారు.

కేంద్రం ఆదుకుంటోంది

ఆర్థికంగా దివాలా తీసిన రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుంటోందని సీఎం చంద్రబాబు తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు రూ.11 వేల కోట్ల ప్యాకేజీ, పోలవరానికి రూ.12,750 కోట్లు, అమరావతికి అప్పుగా రూ.15,000 కోట్లు ఇప్పించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణం పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కానీ, ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదన్నారు. కొంచెం తేరుకోగానే తల్లికి వందనం, రైతుకు అన్నదాత సుఖీభవ లాంటి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. గత ఐదేళ్లలో ఖర్చులు 11.5 శాతం పెరిగాయని, నిర్వహణ పేరుతో దుబారా ఖర్చులే అధికంగా ఉన్నాయన్నారు. జీఎస్‌డీపీలో సొంత ఆదాయం 7.1 నుంచి 6.4 శాతానికి తగ్గిపోయిందన్నారు. 2014-19లో అప్పుల చెల్లింపు సామర్థ్యం 22.7 శాతం ఉండగా, 2022-23లో సున్నాకు చేర్చారని చెప్పారు. ప్రభుత్వం తెచ్చిన అప్పుల్లో మూలధన వ్యయం 2014-19లో 59.15 శాతం, 2019-24లో 22.54 శాతంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు తక్షణ కర్తవ్యంగా మూలధన వ్యయం, రెవెన్యూ వనరులు పెంచుకోవడం, ఆర్థిక క్రమశిక్షణ అమలు చేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో ఆర్థికంగా భారీ నష్టం జరిగిందని, ఇది తాము ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందన్నారు. తాము అధికారంలోకొచ్చిన 6నెలల్లో రూ.వేల కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేశామని, రూ.9015 కోట్ల గ్రాంట్ ఇచ్చి 76 కేంద్ర పథకాలు పునరుద్ధరించామని సీఎం వివరించారు.


"జగన్ చేసిన రూ.9.75 లక్షల కోట్లకు పైగా అప్పులకు ఏటా అసలు, వడ్డీ చెల్లించాలి. తెచ్చిన అప్పులను నాడు దుబారా చేశారు. అందుకే వృద్ధి రేటు తగ్గి ఆదాయం పడిపోయింది. దాని ఫలితమే ఇప్పుడు అప్పులపై వడ్డీలు కట్టలేని పరిస్థితి వచ్చింది. అందుకే, అప్పులు రీషెడ్యూల్ చేసి, వడ్డీరేట్లు తగ్గించి, చెల్లింపు కాలపరిమితి పెంచే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం"

- సీఎం చంద్రబాబు

పర్యాటకంలో 1,217 కోట్లు

- విశాఖలో ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సు
- 8 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నోవోటెల్‌లో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో ఎనిమిది సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. వీటి ద్వారా రూ.1,217 కోట్ల పెట్టుబడులు వస్తాయని, వివిధ ప్రాంతాల్లో 825 హోటల్ రూమ్‌లు అందుబాటులోకి వస్తాయని, 2,667 మందికి ఉపాధి లభిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, ఎండీ, వీసీ ఆమ్రపాలి వెల్లడించారు. విశాఖపట్నాన్ని క్రూయిజ్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, ఎంటర్‌టైన్‌మెంట్, టూరిజం రియల్ హబ్‌గా నగరం మారనుందని మంత్రి దుర్గేశ్ అన్నారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో పర్యాటకులకు 50 వేల గదులు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పరిశ్రమగా గుర్తించిందని, పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ వర్తింపజేయనున్నామని చెప్పారు. సింగిల్ విండో ద్వారా దరఖాస్తు చేసిన నెల రోజుల్లో అనుమతులు ఇస్తామన్నారు. హోటళ్లలో బార్ లైసెన్స్ ఫీజు రూ.66 లక్షలు పెట్టడం వల్ల వ్యాపారం జరగడం లేదని రాష్ట్ర హోటలియర్స్ అసోసియేషన్ తమ దృష్టికి తీసుకువచ్చిందని, ఆ విషయం సీఎం చంద్రబాబుకు వివరించగా, దానిని రూ.20 లక్షలకు తగ్గించడానికి అంగీకరించారని, త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని మంత్రి తెలిపారు. హోటళ్లను లేట్ నైట్ వరకు తెరిచి ఉంచేందుకు కూడా అనుమతి ఇవ్వనున్నామని చెప్పారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అరకులోయలో నిర్వహించే 'అరకు చలి ఫెస్టివల్' పోస్టర్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అధికారులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఒప్పందాలన్నీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో జరిగాయి. కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగ మాధవి, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, 150 మందివరకు పెట్టుబడిదారులు పాల్గొన్నారు.



పెట్టుబడిదారుల సదస్సులో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. వేదికపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, జీసీసీ ఎండీ కల్పనా కుమారి, ఏపీటీడీసీ చైర్మన్ ఎస్.బాలాజీ ఉన్నారు

టూరిజంలో ఆశించిన అభివృద్ధి లేదు: స్పీకర్ అయ్యన్న

రాష్ట్రంలో పర్యాటక రంగం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని, లోపాలను సరిదిద్దుకొని, సానుకూల దృక్పథంతో పెట్టుబడిదారులకు సహకరించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. పెట్టుబడిదారుల సదస్సుకు ఆయన అతిథిగా వచ్చారు. అద్భుతమైన విశాఖపట్నం దేశంలోని ఇతర పర్యాటక ప్రాంతాల స్థాయిలో అభివృద్ధి చెందడం లేదన్నారు. అంతా గోవా ఎందుకు వెళుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. పర్యాటకులు ఆశించేవి అందించినప్పుడే ఆదరణ లభిస్తుందన్నారు. లంబసింగికి రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తున్నారని, వారికి సరైన వసతి, భోజనం, బస లేవన్నారు. ఏజెన్సీలో 1/70 చట్టం వల్ల ఇతరులు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం లేదన్నారు. కర్ణాటకలోని కూర్గ్‌లో కూడా ఏజెన్సీయేనని, మరి అక్కడ పెట్టుబడులు ఎలా సాధ్యమయ్యాయో అధికారులు తెలుసుకోవాలన్నారు.

ఒప్పందాలు కుదిరిన పర్యాటక ప్రాజెక్టుల వివరాలు

సంస్థ పేరు	ప్రాజెక్టు	ప్రాంతం	గదులు	పెట్టుబడి (కోట్లలో)	ఉద్యోగాలు
అట్మాస్పియర్ కోర్	హోటల్	యూరాడ, తిరుపతి	150	500	700
సుమి యశశ్రీ	రిసార్ట్	విశాఖ, అమరావతి	75	50	240
ఎవరెస్ట్	వెల్‌నెస్ రిసార్ట్	విశాఖపట్నం	60	7	120
రాయల్ పామ్స్	లగ్జరీ రిసార్ట్	చీరాల	70	30	200
రిప్పుల్స్ అండ్ కో	విల్లాస్	పరియాపల్లి (ఎస్.కోట)	120	100	450
బ్లూబే ఇన్‌ఫ్రా	బీచ్ ఫ్రంట్ రిసార్ట్	భోగాపురం	30	18	62
ఎస్ పార్క్	హోటల్, రిసార్ట్	బాపట్ల	20	7	80
డాల్ఫిన్ క్రూయిజ్	క్రూయిజ్ టూర్స్	విశాఖపట్నం	-	5	15

జగన్ పాలనలో రాష్ట్రానికి చెడ్డపేరు

- ఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చేందుకు చంద్రబాబు కృషి
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్ చెడ్డపేరు తీసుకొచ్చారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో దావోస్ పర్యటనకు వెళ్లే పరిస్థితి లేదని, వెళ్లినా ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో కూడా నాటి ప్రభుత్వ నేతలకు తెలియదని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనపై జగన్ అభిమానులు సోషల్ మీడియాలో విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. సోమవారం, ఇక్కడ తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పెమ్మసాని మాట్లాడారు. ఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పడిన 7-8 నెలలలోనే రాష్ట్రానికి 49 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని, పెట్టుబడుల విలువ రూ.3 లక్షల కోట్ల వరకు ఉంటాయని అన్నారు. కాగా, గుంటూరు- నల్లపాడును కలిపే పెద్దపలుకలూరు ఆర్వోబీ నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే ఆమోదం తెలిపిందని, రూ.41 కోట్లతో నిర్మించే ఈ ఆర్వోబీ నిర్మాణానికి మరో మూడు వారాల్లో టెండర్ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు అన్ని శాఖలూ కీలకం: పట్టాభి

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనకు అన్ని శాఖల సహకారం కీలకమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. సోమవారం వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి నోడల్ ఆఫీసర్స్‌తో పట్టాభిరామ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనకి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్న విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలి. అందులో భాగంగానే ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంగా ప్రకటించి స్వచ్ఛ సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగుల్ని, ప్రజల్ని పెద్దఎత్తున భాగస్వాముల్ని చేస్తున్నారు. వీటి కోసం ఒక ప్రత్యేక యాప్‌ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వివిధ శాఖల నోడల్ ఆఫీసర్స్ సహకారం ఉంటేనే చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్ర కల సాకారమవుతుంది. ఇప్పుడున్న టెక్నాలజీని స్వచ్ఛ ఆంధ్రకి ఉపయోగిస్తూ, వినూత్న ఆలోచనలతో పనిచేసే వారికి ప్రోత్సాహంగా స్వచ్ఛ ఆంధ్ర డే రోజున వారిని సత్కరిస్తాం' అని పట్టాభి చెప్పారు.

యువగళానికి రెండేళ్లు.. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సంబరాలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తైన సందర్భంగా సోమవారం టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడారు. 'నారా లోకేశ్ యువ గళం పాదయాత్ర ప్రారంభించి, ఎన్ని ఆటంకాలు ఎదురైనా, అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు సృష్టించినా.. జనమే బలమై, తన పాదయాత్రను జైత్రయాత్రగా సాగించారు. కుప్పం వరదరాజస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్ర విశాఖ జిల్లా అగనంపూడిలో ముగిసింది. 226 రోజులు, 3,132 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. రాళ్లు విసిరినా, దాడులు చేసినా, కేసులు పెట్టినా, బెదరకుండా పాదయాత్రను ముందుకు నడిపి, కూటమి విజయంలో కీలక పాత్ర పోషించారు. అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టి, రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు అన్ని విధాలా లోకేశ్ కృషి చేస్తున్నారు' అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, రాంగోపాల్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు జీవీరెడ్డి, గురుమూర్తి, రాకేశ్, యువగళం సభ్యులు జశ్వంత్, నారాయణస్వామి, రామారావు, రమణారెడ్డి, అనిల్, పార్టీ నేతలు బుచ్చిరాంప్రసాద్, రమేశ్, కృష్ణ, హసన్‌బాష, రమణ, నరేంద్రబాబు పాల్గొన్నారు.

టీడీపీ విజయంలో లోకేశ్ పాదయాత్రే కీలకం: మంత్రులు

యువగళం పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తైన సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌కి మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు తెలిపారు. లోకేశ్ పాదయాత్ర గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని అత్యంత భారీ మెజార్టీతో గెలిపించడంలో కీలకపాత్ర పోషించిం దనడంలో అతిశయోక్తి లేదన్నారు. లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొచ్చిందని మంత్రి ఎస్ సవిత అన్నారు.

లోకేశ్ స్ఫూర్తితో ప్రజాదర్బార్:ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రభుత్వ పాలనను నిరంతరం పర్యవేక్షించడమే కాకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ... 'యువగళం ద్వారా లోకేశ్ ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకున్నారు. మంగళగిరిలో ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ఆయన స్ఫూర్తితో మేంకూడా ప్రజాదర్బార్ నిర్వహిస్తాం' అని వెల్లడించారు.

యువగళానికి రెండేళ్లు సందర్భంగా... పిఠాపురంలో వర్మ పాదయాత్ర

పిఠాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం సాయంత్రం పాదయాత్ర నిర్వహించారు. మూడు కిలోమీటర్ల మేర సాగిన ఈయాత్రలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా పిఠాపురంలో పాదయాత్ర నిర్వహిస్తున్న వర్మ



యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ ప్రధాన కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఆ పార్టీ నేతలు అశోక్ బాబు, జీవీ రెడ్డి, తదితరులు

మామూలు కార్యకర్తనే!

- ఒక వ్యక్తి 3సార్లకు మించి ఒక పదవిలో ఉండకూడదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. నేను కూడా ఈసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండకూడదని భావిస్తున్నా. గ్రామ స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకూ పార్టీలో మార్పు రావాలి. దీనిపై పెద్దలు తగిన నిర్ణయం తీసుకుంటారు.
- ఒక విద్యార్థికి ఎంబీఏ కోర్సు ఎటువంటిదో.. రాజకీయాల్లో ఉండే నాయకుడికి కూడా పాదయాత్ర ఎంబీఏ వంటిది. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మాట నిలబెట్టుకుంటా.

\- మంత్రి లోకేశ్

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తగా ఉండడమే తనకిష్టమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. పార్టీలో అందరూ తనను అలాగే చూడాలని కోరారు. 'సాక్షి' పత్రికపై దాఖలు చేసిన పరువునష్టం కేసులో సోమవారం ఉదయం ఇక్కడి కోర్టుకు హాజరైన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినాయకుడు చంద్రబాబు ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని నెరవేర్చుతానని, కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేస్తానన్నారు. పార్టీకి చెడ్డపేరు తీసుకురానని, ఏ బాధ్యత అప్పగించినా క్రమశిక్షణతో పూర్తిచేస్తానని చెప్పారు.

యువగళం పాదయాత్ర చేపట్టి సోమవారానికి రెండేళ్లు పూర్తయిందని, ఆ సమయంలో ప్రజలతో మమేకమైనప్పుడు అనేక సమస్యలు తెలుసుకునే అవకాశం వచ్చిందన్నారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చేయడానికి వెళ్లినప్పుడు అక్కడ అధికారులు ఇచ్చే ప్రొఫార్మాలో 'వై స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ' అనే ప్రశ్నకు 'ఏదో ఒక రోజు రాజకీయాల్లోకి వస్తాను.. అందుకే ఇక్కడ ఎంబీఏ చేస్తున్నానని జవాబురాశాను' అని గుర్తుచేసుకున్నారు. తల్లి, చెల్లిపైనే జగన్మోహన్‌రెడ్డికి నమ్మకం లేదని, అటువంటప్పుడు పార్టీలో నాయకులపై ఎలా ఉంటుందని లోకేశ్ ప్రశ్నించారు. వైసీపీ నుంచి ఒక్కొక్కరూ రాజీనామా చేస్తున్నారని.. అయితే చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తులను వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. తుపాకీ పెట్టి కాకినాడ పోర్టును అడ్డగోలుగా లాక్కున్నారని, రూపాయి వస్తువును ఆరు పైసలకే విజయసాయిరెడ్డి కొట్టేశారని ఆరోపించారు. విశాఖలో భూకబ్జాలపై చర్యలు తీసుకుంటామని,ఎవరిపైనా కక్ష సాధింపు ఉండదన్నారు.

పరువునష్టం కేసు విచారణ వచ్చే నెల 28కి వాయిదా

తనపై తప్పుడు కథనం రాసిన 'సాక్షి'పై లోకేశ్ గతంలో పరువునష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆ కేసు నిమిత్తమే ఆయన సోమవారం 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో హాజరయ్యారు. ప్రతివాది తరఫు న్యాయవాది కోర్టుకు రాకపోవడంతో విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా పడింది.

అక్కడ ఒప్పందాలుండవు.. చర్చలే!

- ఏకంగా వర్కులోకే వెళ్తామని మిట్టల్ చెప్పారు
- ఆర్సెలార్‌కు అనుమతులన్నీ ఇచ్చేశాం
- 3 నెలల్లో విశాఖకు టీసీఎస్: లోకేశ్



విశాఖలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లో రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని, వీటి వల్ల 4.1 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని లోకేశ్ అన్నారు. 'చంద్రబాబు 1997 నుంచి దావోస్ వెళ్తున్నారు. అక్కడ ఎప్పుడూ ఒప్పందాలు జరగవు. చర్చిస్తారు.. కంపెనీల ఆసక్తి మేరకు ఆ తర్వాత ఒప్పందాలు చేసుకుంటారు. ఒప్పందం ఎందుకు.. ఏకంగా వర్కులోకి వెళ్తామని ఆర్సెలార్ మిట్టల్ చెప్పారు. దీనిని తప్పుబడతారా? ఇప్పటికే ఆర్సెలార్ ఉక్కుకు అన్ని అనుమతులూ ఇచ్చేశాం. త్వరలో భూమి కేటాయిస్తాం. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే పెట్టుబడులు వస్తాయి.. పారిశ్రామికవేత్తలకు విశ్వాసం పెరుగుతుంది. గతంలో దావోస్‌లో జగన్‌ను కలిసేందుకు ఒక కంపెనీ ప్రయత్నిస్తే అందుకు నిరాకరించారు. నేను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఐటీ కంపెనీల ప్రతినిధులను కలిశాను. టాటా చైర్మన్ చంద్రశేఖర్‌ను కలిసిన తర్వాత విశాఖకు టీసీఎస్ వస్తోంది. 3 నెలల్లో రాబోతోంది. ఆ కంపెనీకి కావలసిన మౌలిక వసతులు కల్పించాం. రానున్న రెండేళ్లలో భూములు సమకూర్చుకుని టీసీఎస్ సొంతంగా క్యాంపస్ ఏర్పాటుచేస్తుంది. ఇన్ఫోసిస్ కూడా సొంత క్యాంపస్ కోసం చూసుకుంటోంది. ఐదేళ్లలో ఐటీలో విశాఖలో ఐదు లక్షల మందికి ఉద్యోగాల కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఐటీలో డీప్ టెక్నాలజీ, బిగ్‌డేటా, ఏఐ వచ్చాయి. వాటిని అందిపుచ్చుకోవాలని భావిస్తున్నాం. డేటా సిటీ గురించి చర్చిస్తున్నాం. టాప్ 100 కంపెనీలతో మాట్లాడాం. జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్) ఏర్పాటుకు కృషిచేస్తున్నాం. ఫార్చ్యూన్ 2000లో ఉన్న కంపెనీలకు దేశంలో ఎవరూ ఇవ్వని విధంగా తక్కువ ధరకు భూములిస్తామని దావోస్‌లో హామీ ఇచ్చాను. పెట్టుబడిదారులంతా మళ్లీ జగన్ అధికారంలోకి రారని గ్యారెంటీ ఇవ్వగలరా అని అడుగుతున్నారు. మాజీ మంత్రి రోజాకు దావోస్,జ్యూరిచ్‌కు తేడా తెలియదు' అని అన్నారు.

కొందరు సీఈవోల వల్ల విశాఖ ఉక్కుకు నష్టం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగదనే మాటకు కట్టుబడి ఉన్నామని లోకేశ్ చెప్పారు. 'అనేక ఉక్కు కర్మాగారాలు ప్రైవేటీకరణ దిశగా పయనిస్తున్నాయి. ఒక సెంటిమెంటుతో ఏర్పడిన విశాఖ ఉక్కు నిలబడేందుకు కేంద్రం ప్యాకేజీ ఇచ్చింది. సొంత గనులు లేకపోవడం వల్ల కాదు.. కొందరు సీఈవోల వల్ల కర్మాగారం నష్టపోయింది.'అని తెలిపారు. పాయకరావుపేట-తుని పరిసరాల్లో విమానాశ్రయం కోసం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో మాట్లాడాల్సి ఉందన్నారు. విద్యాదీవెన విషయంలో విద్యార్థులను ఇబ్బందులు పెట్టే కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగన్ అక్రమాస్తుల కేసుల్లో..
రోజువారీ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత కోర్టుకు హాజరు కావడం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. జగన్ మాజీ ముఖ్యమంత్రి అని, ఆయన బెయిల్‌పై బయట ఉండడంతో విచారణకు అంతరాయం కలిగిస్తున్నారని, ప్రభావితం చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాకుండా ఆయనకు మినహాయింపునిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ కూడా సవాల్ చేయలేదని గుర్తుచేశారు. పదేళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. డిశ్చార్జ్ పిటిషన్లపై వాదనలు విని, ఎటువంటి నిర్ణయం వెలువరించకుండానే ఐదుగురు న్యాయాధికారులు బదిలీ అయ్యారని గుర్తుచేశారు. కనీసం ఒక్క డిశ్చార్జ్ పిటిషన్‌పైనా తుది నిర్ణయం రాలేదన్నారు. కేసుల బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని.. తామిప్పుడు కేసు విచారణ త్వరగా చేపట్టాలని, పర్యవేక్షణ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని శ్రీనివాసన్ తెలిపారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పైనే ఉన్నారని, సుప్రీంకోర్టు, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా ట్రయల్‌లో జాప్యం జరుగుతోందని, సీబీఐ కోర్టు శుక్ర, శనివారాల్లోనే కేసును విచారిస్తోందని మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. జగన్ అక్రమాస్తుల కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేసినట్లు దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది వివరించారు. జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. కేసుల విచారణను హైకోర్టు పర్యవేక్షిస్తోందని, ట్రయల్ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఇది రాజకీయపరమైన పిటిషన్ అని తెలిపారు. అన్ని పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ హైకోర్టు జగన్ అక్రమాస్తుల కేసును పర్యవేక్షిస్తున్నందున కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. గతంలో ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ కేసులకు కూడా వర్తిస్తుందని స్పష్టంచేసింది. ట్రయల్ కోర్టు రోజువారీ విచారణ చేపట్టాలని, హైకోర్టు కూడా పర్యవేక్షించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది. అలాగే హైకోర్టు పర్యవేక్షణ నేపథ్యంలో జగన్ బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై ప్రత్యేకంగా విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని పేర్కొంది. అందుకే పిటిషన్‌ను డిస్మిస్ చేయాలా.. ఉపసంహరించుకుంటారా అని రఘురామ తరపు సీనియర్ న్యాయవాదిని ప్రశ్నించింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు శ్రీనివాసన్ తెలుపగా.. ధర్మాసనం అంగీకరించింది. గతంలో జగన్ అక్రమాస్తుల కేసులను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించగా.. అనూహ్యంగా గత విచారణ నుంచి ఆ కేసులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనానికి బదిలీ అయిన విషయం విదితమే.



న్యాయమూర్తులు హరనాథశర్మ, లక్ష్మణరావులను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం

న్యాయమూర్తులకు ఘన సన్మానం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇద్దరు న్యాయమూర్తులు అవధానం హరిహరనాథశర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులను ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. వారిని శాలువతో సత్కరించి, జ్ఞాపికలు, దేవుడి చిత్రపటాలను అందజేశారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీహరి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

1 నుంచి భూముల ధరలు పెంపు!

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భూముల విలువ 10 నుంచి 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. గతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రెండు గ్రామాల్లో భూముల ధరలు వేర్వేరుగా ఉండేవి. అలాంటి లోపాలను ఇప్పుడు సరిదిద్దారు. రాజధాని అమరావతికి పెట్టుబడులతో పాటుగా ప్రపంచస్థాయి సంస్థలను తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతం పరిధిలోని 29 గ్రామాల్లో భూముల ధరలతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదు. అదే సమయంలో డిమాండ్ భారీగా ఉన్న విజయవాడ, గుంటూరు, భోగాపురం, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో భూముల ధరలతో పాటుగా రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెంచనున్నారు.

10 వేల కోట్లు వస్తాయని..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. 2024-25 బడ్జెట్‌లో రూ.13,500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కానీ, ఏప్రిల్-డిసెంబరు మధ్య కేవలం రూ.6,388 కోట్లు మాత్రమే వచ్చింది. అంచనా వేసిన ఆదాయంలో కనీసం సగం కూడా రాలేదు. జనవరిలో కూడా ఆదాయం కూడా ఆశాజనకంగా లేదు. ఫిబ్రవరి, మార్చి ఈ రెండు నెలల్లో భూముల ధరలు పెంపు వల్ల ఆదాయం కొంత మేర పెరుగుతుందని భావిస్తున్నారు. బడ్జెట్లో అంచనా వేసినంత కాకపోయినా రూ.10,000 కోట్ల ఆదాయమైనా సాధించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.



మరమ్మతులు చేసిన రోడ్ల ఫొటోలను తిలకిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి

రోడ్లకు 1,149 కోట్ల
నాబార్డు నిధులు

- 10,200 కిలోమీటర్ల స్టేట్ హైవేల అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి జనార్దనరెడ్డి

ఏలూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు పూడ్చడానికి అవకాశం లేని 12,274 కిలోమీటర్ల రహదారులను నాబార్డు నిధులు రూ.1,149 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వెల్లడించారు. ఎన్‌డీబీ పథకం కింద చేపట్టిన రోడ్ల పనులను సోమవారం ఆయన పరిశీలించి, ఏలూరు జిల్లా రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆర్అండ్‌బీ రోడ్లను తాము అధికారంలోకి వచ్చిన 180 రోజుల్లో పూర్తి చేశాం. గత ప్రభుత్వం రహదారులకు రూ.16,852 కోట్లు కేటాయించి రూ.7,334 కోట్ల మాత్రమే ఖర్చు చేసింది. అందులో మళ్లీ తిరిగి రూ.2,300కోట్ల బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం కొలువు తీరాక రూ.1,080కోట్లతో 52 వేల కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేశాం. ఇందులో 65 శాతం పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాం. వర్షాల కారణంగా అలస్యమైనవి, మిగిలినవి ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తాం. 180 రోజుల్లో 21,220 కిలోమీటర్ల మేర గుంతలు పడిన రహదారులపై సజావుగా రాకపోకలు సాగించడానికి పరిశ్రమలకు, పర్యాటకానికి అనువుగా అన్ని విధాలుగా మరమ్మతులు చేపట్టాం. వైసీపీ హయాంలో చేత కాక వదిలేసిన 12,653 కిలోమీటర్లలో 10,200 కిలోమీటర్ల స్టేట్ హైవేలను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయడానికి డీపీఆర్ సిద్ధం చేశాం. రూ.47 కోట్లతో కాంట్రాక్టు ఏజెన్సీని ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా రాకపోకలకు అనువుగా జంగిల్ క్లియరెన్స్‌కు రూ.33 కోట్లు ఖర్చు చేశాం. ఏలూరు నగరంలోని శనివారపుపేట కాజ్ వే వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేశాం. త్వరలో టెండర్లు పిలుస్తున్నాం' అని మంత్రి తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉన్నారు.

గాలి నాణ్యత పెంచేలా కృషి..

- 15 ఏళ్ల మౌనికకు షేక్ జాయెద్ అవార్డు
- అబుదాబిలో తెలుగమ్మాయి అరుదైన ఘనత

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశం అబుదాబీలో తెలుగమ్మాయి అక్కినేని మౌనికకు అరుదైన గౌరవం దక్కింది. అబుదాబీలో ఉంటున్న 15 ఏళ్ల మౌనిక.. ప్రతిష్ఠాత్మక షేక్ జాయెద్ సస్టెయినబిలిటీ అవార్డును గెలుచుకుని ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. కర్బన ఉద్గారాలను తగ్గించి, తరగతి గదిలో గాలి నాణ్యతను పెంచేలా ఆమె రూపొందించిన ఫార్ములాకు ఈ అవార్డు దక్కింది. కొబ్బరి పీచు, సహజ రబ్బరుతో రూపొందించిన 'కార్బన్ స్పాంజ్'తో ఇండోర్ కాలుష్య సమస్యను అధిగమించవచ్చని మౌనిక ఫార్ములా నిరూపించింది. మౌనిక తల్లిదండ్రులు అక్కినేని భూపేష్, స్వీటీ ఏలూరు నగరానికి చెందినవారు. ప్రస్తుతం వారు అబుదాబీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో అబుదాబి రాజు, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ చేతుల మీదుగా మౌనిక ఈ అవార్డుని అందుకుంది. జాయెద్ వేదికపై స్వాగతం పలుకుతుండగా సంప్రదాయ భారతీయ వస్త్రధారణలో చిరునవ్వుతో వడివడిగా నడుచుకుంటూ వచ్చిన మౌనిక అవార్డును స్వీకరించింది. ఈ అవార్డు క్రింద తనకు అందిన 1.5 లక్షల డాలర్లను తరగతి గదుల్లో ఈ ఫార్ములాను అమలు చేయడానికి వెచ్చిస్తామని మౌనిక తెలిపింది.



అబుదాబి రాజు షేక్ జాయెద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న అక్కినేని మౌనిక

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.